ధర్మము

# అమ్మ చెప్పిన కమ్మని నీతి కథలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాధీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

# తెలివి

ఓ గ్రామంలో ఒక జమీందారు వుండేవాడు. అతడి పేరు రామరాజు అతడి భార్యపేరు రాజమ్మ. రామరాజుకు పెద్ద ఇల్లుంది. ఆ ఇంటి చుట్టూ మొక్కలతోనూ, చెట్లతోనూ ఎంతో అందంగా వుండేది. అతడింట్లో చాలామంది కూలీలు పనిచేస్తూండేవారు. ఒకరోజు ఒకతను వచ్చి తాను అనాధనని, నా అన్నవారు ఎవరూ లేరని, తనకేదైనా పని ఇప్పించండని తనకి జీతమివ్వకపోయినా ఫర్వాలేదు, అన్నంపెడితే చాలని రామరాజు, రాజమ్మల వద్ద మొరపెట్టుకున్నాడు. వారిద్దరూ దయతలచి పనిలో పెట్టుకున్నారు.

అతడు రామరాజు వద్ద తన పేరు 'చెట్టు' అని, రాజమ్మ వద్ద 'నీరు' అని చెప్పాడు. ఓ రోజు అతను జమీందారింట్లో డబ్బు దొంగతనం చేస్తుండగా రాజమ్మ చూసింది. ఆమె పరుగు పరుగున వెళ్ళి భయంగా తన భర్తతో "ఏమండీ! నీరు డబ్బు దొంగిలిస్తున్నా"డండి అని చెప్పింది. అప్పుడు రామరాజు "నీకేమైనా పిచ్చా..! నీరు డబ్బు దొంగిలించడమేమిటి? నీరుకి చేతులున్నాయా? కాళ్ళున్నాయా? నీకంతా పిచ్చికాకపోతే" అని బయటకు నడిచాడు. అప్పుడు రాజమ్మ "అదేనండి.. మనింట్లో క్రొత్తగా చేరిన వ్యక్తి డబ్బు దొంగిలించి పారిపోతున్నాడండి వాడ్ని పట్టుకోండి" అని అన్నది. అప్పుడు రామరాజు తెల్లబోయి 'ఓరే రంగా.. భీముడు.." అని కూలీలను పిలుస్తూ ఆ చెట్టును పట్టుకోండి అని గట్టిగా అరిచాడు. అప్పుడా కూలీలు అక్కడున్న పెద్ద చెట్టును గట్టిగా పట్టుకున్నారు. అప్పుడు రామరాజు కూలీలను "ఆ చెట్టును కాదురా..! డబ్బు దొంగిలించుకుపోతున్న వ్యక్తిని పట్టుకోండిరా..." అనే లోపల ఆ దొంగ తప్పించుకు పారిపోయాడు.

తెలివి ఒకరి సొత్తు కాదు.

# వ్యక్తిత్వం

ఓ రోజు ఓ అమెరికా దేశపు గొప్ప వ్యాపారస్తుడు ఓడలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. అతడి వద్ద బంగారం గడియారంతోపాటు ఎక్కువ విలువ చేసే వస్తువులున్నాయి.

అతడికివ్వబడిన గదిలో భారతీయ వ్యాపారస్తుడు కూడా వున్నాడు. అతడు బట్టతల, బారు మీసాలు,విశాలనేత్రాలతో చూడటానికి గంభీరంగా వున్నాడు. అమెరికా వ్యాపారస్తుడికి అతడి ఆకారం నచ్చలేదు. పైగా అతడికి తన గడియారం, విలువైన వస్తువులు భద్రంగా వుండవేమోనన్న అనుమానం కూడా కలిగింది. వాటిని భద్రపర్చటం చాలా ముఖ్యమని భావించాడు.

అమెరికా వ్యాపారస్తుడు ఓడ కెప్టెన్ వద్దకెళ్ళి "సార్! నా వద్ద బంగారపు గడియారంతో పాటు విలువైన వజ్రాలు, నగలు, విలువైన బహుమతులు వున్నవి. నా గదిలో నాతోపాటు

ప్రయాణం చేస్తున్న ఇండియా వ్యాపారస్తునిపట్ల నాకంత నమ్మకం కలగటం లేదు. అయినా అనుమానంతో వుండకూడదని నా విలువైన వస్తువులను మీ సేఫ్‌లో వుంచుకుంటే నాకెంతో మేలు చేసిన వారవుతారు!" అని అన్నాడు.

"దాన్దేముంది సార్..! మీరు తప్పకుండా వాటిని మా సేఫ్‌లో దాచుకోండి. ఐతే ఇండియా వ్యాపారస్తుడు మీ కన్నా ముందుగా వచ్చి తన విలువైన సామాన్లని మా సేఫ్‌లో పెట్టాడు. ఐతే అతడు మీపై అనుమానంను ప్రకటించలేదు" అని చెప్పాడు ఓడ కెప్టెన్. దాంతో మనిషి రూపం కాదు ప్రధానం అని అమెరికా వ్యాపారస్తునికి అర్ధమై సిగ్గుతో తలదించుకున్నాడు.

మనిషికి బాహ్యరూపం కన్నా అంతర్ వ్యక్తిత్వం చాలా ఉత్తమమైనది.

# అనువ్వగాని చోట...

ఒకసారి దుర్యోధనుడు తన తమ్ముళ్లయిన దుశ్శాసనుడు, దుస్సహుడు, దుర్విగాహుడు, దర్మదుడుతో హిడింబీ వనానికి విహారార్థం వెళ్ళాడు. రాకరాక ఇన్నాళ్లకు మరుదులు తనింటికొచ్చినందుకు హిడింబి సంతోషించి, విందు భోజనానికి ఏర్పాట్లు చేసింది. విందుకు ముందు దుర్యోధనుడు హిడింబితో తన పరాక్రమం గురించి, తన తమ్ముళ్ల పరాక్రమం గురించి చాలాసేపు చెప్పాడు. భీముడు తన కాలిగోటికి పనికిరాడు అన్నాడు. హిడింబి అంతా ఓపికగా వింది.

చివరికి మరుదులు నలుగురికి విందు వడ్డించింది హిడింబి. అందరికీ తలా ఓ పళ్లెం పెట్టి దాన్లో నువ్వులు కూడా వడ్డించింది. అందరూ అన్నీ కలుపుకున్నారు. "నెయ్యి ఏది?" అన్నాడు దుర్యోధనుడు. మేం నెయ్యివాడం. నువ్వుల నూనెనే వాడతాం అన్నది హిడింబి.

"ఈ నువ్వులనుండి నూనె ఎలా వస్తుంది?" అన్నాడు దుర్యోధనుడు ఆశ్చర్యంగా. "ఈ నువ్వుల్లోనుండి నూనె పిండుకో మరిది! దానినుండి నూనె కారుతుంది" అన్నది హిడింబి. దుర్యోధనుడు తన కుడిచేత్తో నువ్వులు చేతిలోకి తీసుకుని గట్టిగా పిండాడు. కానీ నూనె రాలేదు. దుర్యోధనుడు ఎంతో ప్రయత్నించాడు. ఫలితం శూన్యం! వెంటనే హిడింబి తన కుడి అరచేతితో దుర్యోధనుడి కుడి పిడికిలిని ఒడిసి పట్టి గట్టిగా పిండింది. నువ్వుల నూనెతో సహా దుర్యోధనుడి పిడికిలినుండి రక్తం కూడా కారి అన్నంలో పడింది.

"చూసావా మరిదీ! ఇందాక నీ పరాక్రమం గురించి చాలాసేపు చెప్పావు. నా బలం చూశావ్ కదా! భీముని భార్యను నేను. ఇక భీముని బలం గురించి నీకు నేను వేరే చెప్పనక్కర్లేదు. భీముని ముందు నువ్వెంత? భీముడెప్పుడు ఇక్కడికొచ్చినా నువ్వుల నూనె పిండుకునే భోజనం చేస్తాడు. నా దగ్గర చెబితే చెప్పావ్ కానీ నీ సోదరుడు భీముని దగ్గర నీ ప్రతాపం గురించి చెప్పకు! ఆయన అసలే కోపిష్టి!" అన్నది హిడింబి మందలింపుగా. దుర్యోధనుడు సిగ్గుతో చితికిన అరచేతికి కట్టుకట్టుకున్నాడు.

అనువ్వగాని చోట అధికులమనరాదు.

# మంచితనం

తన కూతురి పెళ్లికి అవసరమైన పదివేల వరహాలు తన అన్నగారైన రాము వద్ద అప్పు తీసుకుని ఇంటిదారి పట్టాడు సోము.

మధ్యదార్లో కొంత అడవి మార్గం. బందిపోటు దొంగల భయం. అయినా తోడెవరూ దొరక్కపోవడంతో ఒంటరిగానే బయల్దేరాడు.

అకస్మాత్తుగా అతడు భయపడిందంతా జరిగింది. అడవి మధ్యకి రాగానే దొంగలు చుట్టుముట్టి మర్యాదగా నీ దగ్గరున్న డబ్బు మొత్తం ఇటివ్వు అన్నారు.

వెంటనే సోము పదివేల వరహాల మూటవిప్పి వారిముందు పెట్టాడు. "అయ్యా! ఓ ఆడపిల్ల కన్యాదానం విడిపించడానికి అప్పుగా తీసుకెళ్తున్నాను. వీటిని కొల్లగొట్టి ఆ పెళ్ళి పాడు చేసేటంత దుర్మార్గులు కాదనుకుంటాను మీరు. మీకూ ఆడపిల్లలున్నారు కదా..! కాదంటారా.. ఈ డబ్బు తీసుకుని నన్ను చంపేయండి. ఆ తర్వాత నా కూతురి జీవితం ఏమైనా నేను చూడబోను" అన్నాడు విరక్తిగా.

వాళ్లమీద సోము మాటలు బాగా పనిచేశాయి. కనీసం ఒక్కడితోనైనా మంచివారు అన్పించుకోవాలని సరేవెళ్ళు, ఆడపిల్ల పెళ్లి చెడగొట్టేంత దుర్మార్గులం కాదు. ఈ వంద వరహాలు కూడా పట్టుకెళ్ళి అన్నల బహుమతి అని చెల్లాయికివ్వు" అని వంద వరహాలు ఇచ్చారు.

తన లౌక్యం పనిచేసినందుకు సంతోషపడుతూ సోము వారిచ్చిన వరహాలు కూడా తీసుకుని ఊరు దారి పట్టాడు.

మన మంచితనమే మనల్ని ఎల్లప్పుడూ కాపాడుతుంది.

# దురుసుతనం

గంగవరం ఓ చిన్న గ్రామం. గ్రామంలో రెక్కాడితే గాని డొక్కాడని జనాభా ఎక్కువ. ఏ ఋతువుకాఋతువు పండితే గ్రామంలో ధాన్యలక్ష్మి నిండి సుఖశాంతులతో వుండేది గ్రామం.

ఐతే వరసగా రెండేళ్ళు అనావృష్టివల్ల నేలతల్లి చినుకుకోసం అంగలార్చి బీటలు ఇచ్చింది. పంట దాకా ఎందుకు..నారు మడులు ఎండిపోయి నాట్లే పడలేదు. భూమి తల్లి పచ్చదనంతో నిండితే కడుపులు నింపుకునే పశువులన్నీ అస్థిపంజరాలయ్యాయి.

గ్రామం మీద రాబందులు ఎగరసాగాయి.

అలాంటి సమయంలో గ్రామానికంతా మోతుబరి, పిసినారి రత్తయ్య ఓ పూట గ్రామస్తులకు అన్నదానం చేశాడు.

"చూడు..డొక్కలు మాడిన ఆ బీదా బిక్కీ ఎలా చేతులు నాకుతున్నారో. నేను కాబట్టి వూరందరికీ అన్నదానం చేశాను. నాలాంటి దానకర్ణుడు మరొకడు లేడు" అని స్వస్తుతి చేసుకోసాగాడు రత్తయ్య.

అది విన్న పాలేరు భీమన్న రత్తయ్య పిసినారి బుద్ధి తెల్సినవాడు కనుక గాదుల్లో ధాన్యం తీసి సంతర్పణ చేశాడు. ఆ వడ్లు ప్రసాదించేది భూమాత. భూదేవికి కావాల్సింది నీరు. ఆ నీటినిచ్చేవి మేఘాలు. మేఘానికి పక్షపాత బుద్ధిలేక తన నీటికి పేద గొప్ప తార తమ్యం లేకుండా అందరికీ సమభావంతో త్యాగం చేస్తుంది. ఏనాటికైనా దానంలో చెప్పుకోవల్సి వస్తే మేఘాన్నే ముందు చెప్పాలి అన్నాడు.

భీమన్న నోటి దురుసుతనం తెల్సిన రత్తయ్య మౌనం వహించాడు.

# పందెం తెచ్చిన మార్పు

అయినదానికీ, కానిదానికీ పందాలు కాసే రవికి ఆ వూర్లో పందాల రవిగాడుగా పేరు పండిపోయింది. ఏ పందెం అయినా రవియే గెలవడంతో ఓ విధంగా గర్వం కూడా కల్గింది అతడికి.

గ్రామంలో పెద్ద తోట యజమాని సురేంద్ర పట్నంలో చదువుతూ, శెలవలకు ఆ వూరు వచ్చాడు. రవి కథ విని...మా తోటలోని ఓ చెట్టు చూపిస్తా. దాని పళ్ళు పది నువ్వు తింటే పదివేల రూపాయలిస్తాను అన్నాడు. పదివేల రూపాయల పందెం రవి ఎప్పుడూ కాయలేదు.

రవి తోటంతా కలియతిరిగాడు. బత్తాయి, కమలా, జామ, సపోటా, మామిడీ.. "ఓహ్... తినేస్తాను. ఏదీ చూపించు!" అన్నాడు.

పందెం కోసం ఊర్లో పెద్దలందర్ని పిలిచాడు. రవి ఓడిపోతే పదువేలు ఇచ్చి, ఇకముందు ఎవ్వరితోనూ పందెం వేయకూడదని ఖరారునామా.

సురేంద్ర రవిని, పెద్దల్ని తోటలో ఓ మూలనున్న చెట్టు దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. కమలాల్లా ఎర్రగా, ఏపుగా వున్నాయి ఆ పళ్ళు. ఐతే అవి విష ముష్టి పళ్ళు. ఆ పళ్ళు పది తింటే తనపని ఆఖరే అనుకున్నాడు రవి. బ్రతికుంటే బలుసాకు తినొచ్చు...

పెద్దల సమక్షంలో తను ఓడిపోయినట్లేనని అంగీకరించి, పదువేలు సమర్పించుకున్నాడు రవి. ఆ తర్వాత అతడు మరెవరితోనూ పందేలు కాయలేదు.

# జ్ఞానోదయం

ఒకానొక గ్రామంలో ఓ అవ్వ తన కొడుకు, కోడలు, మనవడితో నివసిస్తూ వుండేది. ఆ అవ్వ బాగా ముసల్ది అయిపోయింది. ఆమెలో శారీరక బలహీనత ఎక్కువ అయిపోయింది. అప్పుడప్పుడు ఆమె చేతిలోంచి గాజు కప్పులు, గాజు పళ్ళేలు జారిపడి పగిలిపోతుండేవి. అవి పగిలినప్పుడల్లా కోడలు తన ముసలి అత్తను తిట్టేది. ఇలా తన నానమ్మను తిట్టడం మనవడికి ఇష్టం వుండేదికాదు. కానీవాడు అమ్మను ఏమీ అనలేక పోయేవాడు.

ఓ రోజు అవ్వ చేతినుండి నగిషీలు చెక్కిన గాజు పళ్ళెం పడి పగిలిపోయింది. కోడలు కోపగించుకుని, తన కొడుకుని పిలిచి డబ్బులు ఇచ్చి అవ్వకు ఓ చెక్క పళ్ళెం కొనుక్కురమ్మని

చెప్పింది. వాడెంతో బాధపడ్డాడు. అవ్వ బాధపడుతుందని వాడికి తెలుసు. అయినా తన అమ్మకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

బజారునుండి రెండు చెక్క పళ్ళాలు తెచ్చాడు. అవి చూసి అమ్మ ఆశ్చర్యపోయింది. "ఒక చెక్క పళ్ళెం తెమ్మంటే రెండు ఎందుకు తెచ్చావ్?" అని కోపంగా అడిగింది.

"మరేం లేదు. ఒకటి అవ్వకి. నీవు కూడా ముసలి దానివి అయిపోతే నీకు కూడా ఒకటి వుండాలి కదా!" అని చెప్పాడు.

కోడలికి జ్ఞానోదయమైంది. ఆ రోజునుండి అత్తగార్నెంతో ప్రేమగా చూసుకోసాగింది కోడలు.

మీ తరంలోని మీ తల్లితండ్రులను, వృద్ధుల్ని మీరెలాగైతే చూస్తారో.... మీ తర్వాత తరం వారు అంటే మీ కొడుకు / మనవలు కూడా మిమ్మల్ని అలాగే చూస్తారు.

# మానవ జీవితం

కాశీపురంలోని వేదశాస్త్రి వేదపండితుడు. అతడి ఏకైక పుత్రరత్నం పరమ శుంఠలా తయారై ఇల్లు విడిచి దేశాలు పట్టిపోయాడు. శాస్త్రి భార్య విశాలాక్షి మహాసాధ్వి. చేతికొచ్చిన కొడుకు చేజారి పోయాడనే దిగులుతో మంచం పట్టింది. కొడుకు కోసం ఏడ్చి ఏడ్చి ఆమెకు కళ్ళు కూడా కన్పించుకుండా పోయాయి.

గర్భ దరిద్రుడైన వేదశాస్త్రికి కష్టాలు క్రొత్తవి కాకపోయినా ఎక్కువైనాయి. బ్రహ్మముహూర్తంలో లేచింది మొదలు దైవకార్యాలు చేయడం, ఆ పూటకు భిక్ష సంపాదించు కోవడం, వంట చేసి భార్యకు తిన్పించడం, ఆమెకి సేవచేయడం అతడి దినచర్య అయిపోయింది. మంచంలోనే కృశించి, కృశించి ఆమె ఓ రోజు తనువు చాలించింది.

తనకున్న ఆ ఒక్క పూరిల్లు అమ్మి, ఆ డబ్బుతో వేదశాస్త్రిగారు మరణించిన తన భార్యకి సాంప్రదాయంగా కర్మ క్రతువులు నిర్వహించాడు. కన్న కొడుకును, కట్టుకున్న భార్యను, చివరికి తనకంటూ వున్న పూరి గుడిసెను కూడా పోగొట్టుకొని నిర్మల చిత్తంతో, సుఖదుఃఖాలకు అతీతంగా వున్న అతడ్ని చూసి కార్యానికొచ్చిన కొందరు ఆ విషయమే అతడితో ఇలా అన్నారు.

"శాస్త్రి! అనేక జాతి పక్షులు ఓ మహావృక్షాన్ని ఆశ్రయించి, విశ్రమించి, సూర్యోదయంతో పలు దిక్కులకు వెళ్ళిపోతుంటాయి. మానవ జీవితమూ అంతే! ఈ భూమ్మీద మన పని అయిపోగానే వెళ్ళిపోతుంటాం. అశాశ్వతమైన ఇహలోక బాంధవ్యాల కోసం బాధపడట మెందుకురా?" అని. దాంతో జ్ఞానోదయమైన శాస్త్రి మనస్సులో నవచైతన్య కిరణాలు ప్రసరించ ఇహలోక మోహాలకు స్వస్తిచెప్పి దైవ సాన్నిధ్యంలో గడిపే నిమిత్తం హిమాలయాలకు పయనమయ్యాడు.

అశాశ్వతమని తెలిసీ కూడా ఇహలోక బాంధవ్యాలపై మక్కువ ఏర్పరచుకోవడం అవివేకం.

# స్వార్థం

రవి శుభలేఖను రాము చేతికిచ్చి "రామూ! నా ఇద్దరి చెల్లెళ్లకి పెళ్లి చేస్తున్నాను. నువ్వు తప్పకుండా రావాలి" అని చెప్పాడు.

"మరి నీ పెళ్లెప్పుడోయ్!" నవ్వుతూ అడిగాడు రాము.

"నా చెల్లెళ్ల పెళ్లి తతంగం పూర్తి అయిన వెంటనే నా పెళ్లికి ప్రయత్నాలు చేస్తాను" చెప్పాడు రవి.

రాము సంతోషిస్తూ "పాతికేళ్లు దాటుతున్నా చెల్లెళ్ల పెళ్లిళ్లు చేసిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్న నీ నిర్ణయాన్ని అభినందిస్తున్నా రవీ!" అన్నాడు.

"అభినందించదగ్గ గొప్ప పనేం చేయటం లేదు. వారికి పెళ్లిళ్లు చేయడంలో కొంత నా స్వార్థం కూడా వుంది" అన్నాడు రవి.

రాము ఆశ్చర్యపడి "స్వార్థమా...ఏమిటది?" అనడిగాడు.

"ఔను...స్వార్థమే! నాకు పిల్లనివ్వటానికి వచ్చిన వారిలో కొందరు మా అమ్మాయికి అత్తగారి సాధింపులేగాక ఆడబిడ్డల ఈసడింపులు కూడా వుంటాయి. మీ ఇంట్లో మా అమ్మాయి ఇమడలేదు బాబూ అని చెప్పి వెనక్కి వెళ్లిపోయారు. ఇంకొందరు మేము మా అమ్మాయికి కట్నం ఇస్తే ఆ కట్నం డబ్బులతోనే ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేస్తావు. అప్పుడు మా అమ్మాయి గతేం కావాలి. కట్నం తీసుకోకుండా చేసుకుంటావేమో పెళ్లి చేసుకో... అమ్మాయి నిస్తామంతే. అని ముఖంమీదే తెగేసి చెప్పారు. నాకు కట్నం ఇచ్చి పిల్లనివ్వాలంటే మా ఇంట్లో నా చెల్లెళ్లు వుండకూడదు అందుకే వారికి ముందుగా పెళ్లి చేస్తున్నాను" అని అసలు విషయం చెప్పాడు రవి.

అంతా విన్న రాము "నీలో ఇంత స్వార్థముందా?" అని నోరెళ్లబెట్టాడు.

# బుద్ధిబలం

ఒకసారి నారదుడు కైలాసానికి ప్రయాణమౌతూ మంచి మామిడిపండు కైలాసానికి తెచ్చాడు. అక్కడ ఆడుకుంటున్న గణపతిని, కుమారస్వామిని పిలిచాడు. "ఏమి నారదా!" అని వచ్చిన గణపతి నారదుని చేతిలోని పండుని చూసి, దాన్ని లాక్కోబోతుండగా కుమారస్వామి వచ్చి 'ఆ పండు నాదంటే నాదని' ఇద్దరూ పోట్లాడుకోసాగారు. అప్పుడు నారదుడు "మీ ఇద్దరికీ ఓ పోటీ పెడుతున్నాను. అందులో ఎవరు గెలిస్తే వారికే ఈ పండు" అని అన్నాడు. ఇంకేముంది కుమారస్వామి నెమలి వాహనంతో వచ్చి "ఏమిటో త్వరగా శెలవియ్యండి స్వామీ!" అని అడిగాడు. ఈ ప్రపంచంలోని భూమంతటినీ ఎవరు చుట్టి వస్తారో వారికే ఈ పండునిస్తాను అన్నాడు నారదుడు. ఇక కుమారస్వామి నాదే విజయం అని హుషారుగా నెమలిపై ముందు బయల్దేరాడు. వినాయకుడు "గౌరీ శంకరా!" అని

పిల్చాడు. వెంటనే అక్కడికి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమయ్యారు. వారి ఇరువురి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసి నమస్కరించడంతో కుమారస్వామి ఎక్కడికెళ్ళినా అతడికన్నా ముందు వినాయకుడు వెళ్తున్నట్లు కన్పించింది. వెంటనే నారదుడు మామిడి పండును వినాయకుడికిచ్చాడు వినాయకుడిది బుద్ధిబలం. కుమారస్వామిది శక్తిబలం.

శక్తి బలం కన్నా బుద్ధిబలం ఎంతో గొప్పది.

# ఆత్మ విశ్వాసం

శేషు చిన్నప్పట్నుంచి చదువు చాలా కష్టతరమైనదిగా భావించాడు. శేషుతల్లి శాంత చదువు సులభమైనదిగా ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. పైగా ఎక్కువ కాలం ఆటపాటలతో గడిపేవాడు. శేషు తండ్రి రంగారావ్ బంగారపు వ్యాపారస్థుడు. కొడుకు చెడిపోతున్నాడని తెల్సినా, కొడుకు ఇంటినుండి వెళ్ళిపోతానని బెదిరించడంతో నోరు మెదిపేవాడు కాదు ఆయన. శేషుకి మామయ్య అయిన కిషోర్ చెన్నైలో వుద్యోగం చేస్తుండే వాడు. అక్కాబావల్ని చూడాలని వచ్చి బావ ద్వారా శేషు విషయమంతా విని అర్థం చేసుకుని, శేషుని కొన్నిరోజులు తన వద్దకు పంపమని అడిగాడు. కొడుకు బాగుపడతాడేమో నన్న ఆశతో కిషోర్ వెంటపంపడానికి ఒప్పుకున్నాడు తండ్రి. చెన్నై సిటీకి వెళ్తున్నాడని తెలిసి శేషు ఎంతో సంతోషించాడు.



చూపించాల్సినవన్ని కిషోర్ శేషుకి కొద్దిరోజులు చెన్నై అంతా త్రిప్పి చూపించాడు. అందరూ తెల్లవారేసరికి నీట్‌గా రకరకాల యూనిఫారమ్స్ వేసుకుని చదువుకోవడానికి వెళ్తున్నారు. వారిని చూసి శేషుకూడా ముచ్చటపడ్డాడు. తర్వాత క్రీడా మైదానాలలో ముఖ్యమైన క్రికెట్ స్టేడియంకు శేషుని తీసుకెళ్ళాడు కిషోర్. అక్కడ ఆ రోజు భారత్ - ఇంగ్లాండ్‌ల మధ్య హోరాహోరీగా మ్యాచ్ జరుగుతుంది. టిక్కెట్స్ కొని ఇద్దరూ లోనికి వెళ్ళి క్రికెట్ ఇద్దరికి ఇంట్రస్టే కనుక ఆసక్తిగా చూడసాగారు.

భారత్ ఆటగాళ్ళు ఒక్కొక్కరూ ఇంగ్లాండ్ ఆటగాళ్ళకు తలవంచుతున్నారు. భారత్ సారధి మాత్రం ధైర్యంను చెక్కు చెదరనివ్వకుండా ధాటిగా ఆడుతున్నాడు. ఒక్కసారిగా భారత్ ఆటగాళ్ళు తమలోనున్న శక్తియుక్తుల్ని జోడించి ఆత్మవిశ్వాసాన్ని కూడదీసుకుని చివరకు విజయాన్ని చేజిక్కించుకున్నారు. అప్పుడు కిషోర్ శేషుని వుద్దేశించి శేషూ! కష్టతరమైనదని తెలిసీ కూడా మన ఆటగాళ్ళు ఎలా విజయాన్ని సాధించారో చూశావా? ఇప్పటికైనా తెలుసుకో..ఆత్మవిశ్వాసంతో ఎంతటి పనినైనా సాధించవచ్చునని అని నిదానంగా చెప్పాడు.

ఆ మాటలు శేషు మనసుని బాగా ఆలోచింపచేశాయి. తను చేస్తున్న తప్పేమిటో తనకి అర్థమైంది.

అప్పట్నుంచి బాగా చదివి ఆత్మవిశ్వాసంతో మంచి మార్కులు సాధించాడు. రవిలో వచ్చిన మార్పుకు అతడి తల్లితండ్రులు ఎంతగానో ఆనందించారు.

ఆత్మవిశ్వాసం, పట్టుదల వుంటే సాధించలేనిది లేదు.

# గర్వం

మగధను పాలించే రవివర్మ చాలా ధైర్యవంతుడు. ఎంతో పరాక్రమవంతుడు. అందువల్ల రాజులో కాస్త గర్వం చోటు చేసుకుంది. ఆ కారణంగా తనంతటివాడు మరొకడు లేడను కొంటున్న రాజుకు, తన వెంట తోడు ఎవరూ లేకుండా ఒంటరిగానే అడవికెళ్ళి జంతువుల్ని వేటాడే అలవాటుంది.

"మీరు మాటి మాటికీ ఎవర్నీ వెంటబెట్టుకోకుండా ఒంటరిగా అడవికెళ్ళడం మంచిదికాదు. మనకి శత్రువులున్నారన్న సంగతి మీకు తెలుసుకదా..! కాలం ఎప్పుడూ ఒకే విధంగా వుండదు" అన్నాడు మంత్రి రాజుతో కానీ రాజు వినలేదు.

కొన్నాళ్ళు గడిచాయి. యథాప్రకారంగా అడవికెళ్ళి వేటాడుతున్న రవివర్మకి అనుకోకుండా ఆపద వచ్చిపడింది. ముసుగు వేషాల్లో వున్న ఇద్దరు వ్యక్తులు రాజును అమాంతంగా పట్టుకుని ఓ చెట్టుకు బంధించి, తళ తళ మెరిసే కత్తుల్ని బైటకు తీసి "నిన్ను ఇక్కడే చంపాలా? లేక మా రాజ్యానికి ఈడ్చుకువెళ్ళి చంపాలా?" అన్నారు.

వారు శత్రురాజ్యానికి సంబంధించినవారని రవివర్మకి పూర్తిగా తెలిసి ప్రాణం పోయినంతపనైంది. గతంలో మంత్రి చెబుతూ వచ్చిన మంచి మాటలు రాజుకి గుర్తొచ్చాయి. ఒంటరివాడైన తనను ఇప్పుడు ఎవరు రక్షిస్తారు? ఇలా ఆలోచిస్తున్న రవివర్మకు తమ ముసుగు వేషాల్ని తొలగించిన తన మంత్రి, సైన్యాధిపతిని చూసి ఆశ్చర్యపడ్డాడు.

"మహారాజా! మీ మనసు మార్చడానికే మేమిలా కావాలనే చేశాం. క్షమించండి." అన్నారు మంత్రి, సైన్యాధిపతి.

అప్పుడు రవివర్మకు వారిలా ఎందుకు చేయాల్సి వచ్చిందో తెల్సింది. తనలో వున్న ఆ కాస్త గర్వం తగ్గిపోయింది. అప్పట్నుంచి రవివర్మ తనకు తోడుగా కొందరు భటుల్ని వెంటబెట్టుకుని వేటకి వెళ్ళసాగాడు.

# ఎత్తుకు పై ఎత్తు

ఐదున్నర సంవత్సరాల క్రితం లక్షరూపాయల్ని ఫిక్సెడ్ డిపాజిట్ చేసిన రామనాథం గారికి ఆ రోజే రెండు లక్షలు చేతికొచ్చాయి. అతని కొడుకు గోపి తండ్రితో "నాన్నా! ఇన్నాళ్ళు బాడుగింట్లో వున్నాం. ఇప్పుడీ డబ్బుతో మంచి ఇల్లు కట్టుకుందాం" అన్నాడు.

అందుకు తండ్రి చిరునవ్వు నవ్వి "ఏం..ఆ బాడుగిల్లు బాగాలేదా?" అని ప్రశ్నించాడు.

"అబ్బ! అలాగని కాదు నాన్నా! స్వంతింటికీ బాడుగింటికీ తేడా లేదా? ఇంటి ఓనర్ ఖాళీ చేయ్ అంటే ఖాళీ చేయాలి. మనం తిన్నా తినకపోయినా నెల నెలా తప్పనిసరిగా బాడుగ కట్టాలి. బాడుగ కట్టడం ఒక్కరోజు ఆలస్యమైతే ఇంటిఓనర్ రంకెలేస్తాడు" అన్నాడు కొడుకు.



రామనాథం బుర్రగోక్కుంటూ "ఇల్లు కట్టాలంటే దాదాపు రెండు లక్షలు అవుతుంది. రెండు లక్షలకు నెలకు ఒక రూపాయి వడ్డీ వేసుకున్నా రెండు వేలవుతాయి. ఇప్పుడు మనం ఈ ఇంటికి 500లు బాడుగ కడుతున్నాం. అంటే ఈ ఇంట్లోనే వుండి రెండు లక్షలు డబ్బును బ్యాంక్‌లో వేస్తే నెలకు 1,500/-లు ఆదా అవుతాయి. అర్థమైందా?" అన్నాడు. గోపీ మరేం మాట్లాడలేదు.

ఒకటవ తేది రాగానే ఇంటిఓనర్ రామనాథం వద్ద బాడుగ తీసుకుని "చూడండి రామనాథం గారూ! మీరు వెంటనే ఇల్లు ఖాళీ చేయాలండి" అన్నాడు.

పిడుగులాంటి వార్తతో అదిరిపడ్డాడు రామనాథం కంగారునుండి తేరుకుని. "ఇప్పుడేమైందండి! ఇల్లు ఖాళీ చేయమంటున్నారు.. నెలనెలా సక్రమంగా బాడుగ ఇస్తూనే వున్నాను కదా..! కావాలంటే మరో వంద బాడుగ పెంచుకోండి. అంతేగానీ ఏకంగా ఇల్లు ఖాళీ చేయమంటే ఎలా?" అన్నాడు.

ఖాళీ చేయక తప్పదండి. ఈ ఇంటిని అమ్మేయాలనుకుంటున్నాను అన్నాడు ఇంటి ఓనర్.

ఏమిటీ..మీరంటున్నది? ఆశ్చర్యంగా అడిగాడు రామనాథం.

"ఈ ఇల్లువల్ల నేను చాలా నష్టపోయాను. ఇప్పుడిలాంటి ఇల్లు కట్టాలంటే కనీసం రెండు లక్షలు కావాలి. రెండు లక్షలకు ఒక రూపాయి వడ్డీ వేసుకున్నా నెలకు రెండు వేలవుతుంది. ఇప్పుడు మీరిస్తున్న అద్దె 500లు. అంటే నేను నెలకు 1,500/- నష్టపోతున్నాను. అందుకే నేను వెంటనే ఇల్లు అమ్మేయాలనుకుంటున్నాను. అదే ధరకు మీరు కొన్నాసరే! ఒకవేళ కొనడం ఇష్టంలేకపోతే బాడుగ రెండువేలు ఇచ్చినా సరే మీ ఇష్టం! తెల్సిన వారు కనుక చెబుతున్నాను అన్నాడు.

రామనాథం బుర్ర గిర్రున తిరిగిపోయింది. ఇతడికిన్ని తెలివితేటలెక్కడ్నుంచి వచ్చాయబ్బా? అని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. రామనాథం మనోభావాల్ని గమనించిన ఓనర్ నవ్వుతూ "ఏమిటలా ఆలోచిస్తున్నారూ? నా బుర్ర పదునుగా ఆలోచించినందుకా? అది నా తల మహాత్మ్యం కాదు. మొన్న మీ తండ్రి కొడుకుల సంభాషణ విన్నాక నాకు జ్ఞానోదయమైంది" అన్నాడు.

తెలివి ఎవరి సొత్తు కాదు. అది ఒకరికే పరిమితం కాదు.

# క్రమశిక్షణ

శివపురం గ్రామంలో శంకరయ్యనే తిండిపోతు వుండేవాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా కూర్చుని తింటుండేవాడు. రోడ్ రోలర్‌లాగ వున్న శంకరయ్యకు పిల్లనివ్వటానికి ఎవరూ ముందుకు రాలేదు. వాడి తండ్రి రామనాథం వాడికి ఈ జన్మలో పెళ్లికాదని దిగులు పడేవాడు.

ఓ రోజు రామనాథం పట్నం వెళ్లినప్పుడు తన మిత్రుడైన జగన్నాథానికి తన కొడుకు విషయం చెప్పాడు. విషయం విన్న జగన్నాథం వాడ్ని తన వద్దకు పంపమని చెప్పాడు.

మర్నాడు శంకరయ్యని జగన్నాథం వద్దకు పంపాడు రామనాథం.

వ్యాపారస్తుడైన జగన్నాథం తనకు బాకీలున్నవారందరి అడ్రసులిచ్చి ఈ బాకీలు వసూలు చేయి ఇందులో కష్టమేముంది. బాకీలు వసూలు అయ్యేవరకు తిరగటమే కదా! అన్నాడు.

శంకరయ్య తన భారీకాయాన్ని ఈడ్చుకుంటూ డబ్బులు వసూలు చేయడానికి అడ్రసులు తీసుకుని బయల్దేరాడు. జగన్నాథం పెట్టింది తినడం, ఉదయం నుండి సాయంత్రం వరకూ తిరగడం శంకరయ్యకు దినచర్య అయిపోయింది.

ఆరు నెలల జీతం ఒకేసారి ఇస్తానని చెప్పి శంకరయ్యకి ఒక్క నయా పైసా కూడా ఇచ్చేవాడు కాదు జగన్నాథం. చేతిలో డబ్బులేకపోవడంతో చిరుతిళ్లు తినే వీలు శంకరయ్యకి లేకపోయింది.

ఓ ఆరు నెలలు గడిచేసరికి జగన్నాథం పెట్టిన భోజనం క్రమశిక్షణతో ప్రొద్దుట్నుంచి రాత్రివరకూ తిరుగుతూండటంతో సన్నగా తయారయ్యాడు శంకరం. తన శరీరాన్ని చూసుకున్న శంకరయ్య ఇంకెప్పుడూ క్రమశిక్షణ లేకుండా తినకూడదని, శరీరానికి వ్యాయామం తప్పనిసరనే విషయం గుర్తించాడు. శంకరయ్యలో వచ్చిన మార్పును చూసి రామనాథం చాలా సంతోషించాడు.

# మనోయజ్ఞం

త్రేతాయుగంలో శ్రీరామ, రావణ యుద్ధంనకు ముందు సముద్రానికి వంతెన నిర్మించుటకు శ్రీరాముని అనుచరులైన వానరులు ప్రతిరాతి మీద రామ అన్న పదాన్ని వ్రాసి, దానిని తీసుకెళ్లి సముద్రంలో వేయగానే అది తేలి వంతెనకు అవసరమైన విధంగా సమకూరుతుండేది.

అక్కడే నిల్చుని ఇదంతా గమనిస్తున్న శ్రీరామునితో వింతకోరిక జనించింది. "ఆహా! నా పేరు మహిమవల్లే కదా, ఈ రాళ్ళు సముద్రంలో మునిగిపోకుండా నీటిలో తేలుతున్నాయి. అలాంటప్పుడు నేను విసిరే రాతి మీద నా పేరెందుకు రాసుకోవాలి? ఎటూ తేలుతుంది కదా"ని తలచి, ఓ రాయి తీసుకుని చుట్టుప్రక్కలంతా కలియజూశాడు. దగ్గర్లో ఎవరైనా తనపనిని గమనిస్తున్నారేమోనని!

ఎవరూ తనవైపు చూడటం లేదని గుర్తించిన శ్రీరాముడు చేతిలో వున్న రాతిని తాత్సారంగా నీటిలోకి విసిరాడు ఢభేల్‌మని శబ్దం రావడంతో దూరం నుండి వస్తున్న హనుమంతుడు ఠపీమని అక్కడవాలి. శ్రీరాముని చర్యను చూసి "ప్రభూ! తమరి అనుచరుల మైన మేము ఇందరముండగా తమరు జలగర్భంలోకి రాళ్ళు వేయటమా!" అని దీనంగా పలికాడు.

శ్రీరాముడు అందుకు జవాబివ్వక తాను విసిరిన రాయివైపు తదేకంగా చూస్తున్నాడు. హన్మంతుడు కూడా తన ప్రభువు విసిరిన రాయివైపు చూడడం మొదలపెట్టాడు. కొన్ని గంటలు గడిచిపోయాయి. కానీ రాముడు విసిరిన రాయి తేలలేదు. అంటే అది నీటిలో పూర్తిగా మునిగిపోయింది. ఈ వింత సంఘటనకు ఆశ్చర్యచకితుడైన హన్మంతుడు "ప్రభూ! ఇదేంటి...అవతారపురుషులైన తమరు వేసిన రాయి నీటిలో మునిగిపోవడమా?" అని ప్రశ్నించాడు.

ఆ చర్యకు సిగ్గు పడిన శ్రీరాముడు భక్తునివైపు చూసి ఆంజనేయా! ఇందులో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. నేను నా పేరు, మహిమను చూసి గర్వపడి వింత సంకల్పం చేశాను. మీరంతా భక్తి అనే మనోయజ్ఞంతో చేసే కార్యాలు సార్థకమైనవి. ఈ యుగధర్మం కూడా ఇదే. నేను చేసిన పని వికర్మతో కూడుకున్నది. సుకర్మతో భక్తితో చేసే పనులు నీటిలో తేలిన రాళ్లలాగ పలువురికి కన్పిస్తాయి. అంతేకాక అవి ఒక ప్రయోజనాన్ని సాధిస్తాయి. కానీ అహం అనే వింత కోరికతో చేసే పనులు నీటిలో మునిగిపోయే రాళ్లలాగ పదిమంది దృష్టిలో పడకపోవడమేకాక వాటివల్ల కలిగే ప్రయోజనం కూడా ఏమీ వుండదు" అని జవాబిచ్చాడు.

"మహాప్రభూ! ఎట్టివారికైనా వింతకోరికలు వుండకూడదు. యుగధర్మం పాటించాలనే ఈ దివ్యమైన తమ సందేశం చిరస్మరణీయమైనది. లోకానికి ఆదర్శవంతమైనది" అని భక్తి పూర్వకంగా ప్రణమిల్లుతూ స్వామి పాదాల మీద వాలిపోయాడు హన్మంతుడు.

# మోసానికి మోసం

వైజాగ్‌లో వీరయ్యనే బట్టల వ్యాపారి వుండేవాడు. వీరయ్య బట్టలను మూటగా కట్టుకుని ఊరూరు తిరుగుతూ అమ్మేవాడు

వీరయ్యకు వయసు పైబడటంతో బట్టల మూట మోసే ఓపిక తగ్గింది. దాంతో వీరయ్య తక్కువ జీతానికి బట్టలమూట మోసేవాడు ఎవరైనా దొరుకుతాడేమోనని వెతకసాగాడు.

చివరకు వీరయ్య కళ్ళు సాంబనే వెర్రిబాగులవాడిపై పడింది. సాంబ వూరివాళ్ళు చెప్పే పనులు చేస్తూ వారిచ్చే చిల్లర డబ్బులతో కాలక్షేపం చేసేవాడు.

వీరయ్య వాడ్ని పిలిచి "ఒరే! బట్టలమూట మోయటానికి రోజూ నాతో వస్తే ఊరివాళ్లిచ్చే డబ్బులకన్నా ఎక్కువిస్తాను "అన్నాడు. తెలివిలేని సాంబ అందుకు సరేనని ఒప్పుకుని వీరయ్య వెంట తిరగసాగాడు.

కానీ వీరయ్య భార్యమాత్రం తెలివిలేనివాడ్ని పనిలో పెట్టుకుంటే మనకే నష్టం అంటి అందుకు వీరయ్య మూట మోయడానికి తెలివివుండనవసరం లేదని సర్దిచెప్పాడు.

ఓ రోజు ఉదయం వీరయ్య సాంబని పిలిచి "ఒరే! ప్రక్క గ్రామంలో ఓ పనుంది. నేను ముందుగా పోయి పని ముగించుకుని ఆ ఊరి రచ్చబండ దగ్గరుంటాను. నువ్వు నెమ్మదిగా బట్టలమూటతో అక్కడకు రా" అని చెప్పి వెళ్ళిపోయాడు. తర్వాత సాంబ తాపీగా మూట నెత్తిన పెట్టుకుని బయల్దేరాడు. దార్లో వాడికి ఓ దేవత గుడి కన్పించింది.

గుడివద్ద ఓ రైతు పసుపు కుంకుమ ఆవుకి దిద్దుతూ కన్పించాడు. అది చూసి సాంబ "ఏమిటి! కుంకుమ బొట్టు ఆవుకి దిద్దుతున్నావ్?" అనడిగాడు. ప్రక్కవూరి సంతలో ఆవునమ్ము దామని బయల్దేరాను. దేవి అనుగ్రహముంటే ఎక్కువ ధర వస్తుందని కుంకుమ బొట్టు ఆవుకు పెట్టానన్నాడు.

ఆ మాటలు విన్న సాంబ బుర్రలో ఓ ఆలోచన వచ్చింది. వెంటనే గుళ్ళోకి వెళ్ళి గుప్పెడు పసుపు, కుంకుమ తెచ్చి మూట విప్పి బట్టలకు మొత్తం రాసేశాడు. తర్వాత మూట నెత్తిన పెట్టుకుని హుషారుగా పాటలు పాడుతూ వీరయ్యను చేరుకున్నాడు.



మూటకు పసుపు కుంకుమ అంటుకుని వుండటం చూసి "వీరయ్య ఏమిటిది?" అనడిగాడు. సాంబ గొప్పపని చేసినట్లు ముఖం పెట్టి "అయ్యా! బట్టలు మొత్తం అమ్ముడు పోవాలని వచ్చేదార్లో వున్న దేవతగుడి దగ్గర అమ్మవారి పసుపు కుంకుమల్ని బట్టలకు దిద్దాను" అన్నాడు. ఆ మాటలకు వీరయ్య కంగారుగా మూటవిప్పి, ముద్దగా పసుపు, కుంకుమ రాసున్న బట్టల్ని చూసి "ఓరి దద్దమ్మా! పసుపు పూసిన బట్టల్ని ఎవ్వరూ కొనరు. వాటికి ధర ఎక్కువ రాదు" అంటూ నెత్తీ నోరూ బాదుకున్నాడు.

ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు.

# కోరికల చిట్టా

ధనవంతుడు, పిసినారి అయిన శీనయ్య రోజూలాగే దేవుడికి పూజ చేస్తూ, తన కోర్కెల చిట్టా దేవుడికి విన్నవించుకున్నాడు. ఇంతలోగా బయటనుండి రోజూ కాలువ కడిగే వెంకయ్య కేక వినబడింది. ఎప్పటినుండో ఓ పాత చొక్కావుంటే ఇమ్మని శీనయ్యను అడుగుతున్నాడు వాడు. ప్రతిసారీ ఇస్తాలే అంటూ వాయిదా వేస్తున్నాడు శీనయ్య. ఇంక వాడి పోరు పడలేక

ఏదో ఒక పాతచొక్కా ఇచ్చి వదిలించుకోవాలనుకున్నాడు. తను ఇంట్లో లేని సమయంలోనైతే భార్య మంచి చొక్కాని ఇచ్చేస్తుందన్న భయంతో పూజ మధ్యలో లేచి పాత బట్టలున్న ట్రంక్ పెట్టె తీశాడు. వాటిల్లో ఏది ఇవ్వాలో అన్నీ తిరగామరగా వేసి చూస్తున్నాడు. వున్నవాటిలో బాగా చిరిగిపోయిన చొక్కా తీసి కాలువ కడిగే వాడికి ఇది చాల్లే అనుకుని ఆ చొక్కా తీసి వెంకయ్యకి ఇచ్చాడు. దానికి వెంకయ్య సంతృప్తి పడి వెళ్ళిపోయాడు. లోపలికొచ్చిన శీనయ్య తిరిగి దేవుని ముందు కూర్చుని కోర్కెల చిట్టా విప్పాడు.

"స్వామీ! ఇన్ని రోజులుగా నిన్ను పూజిస్తున్నాను. కానీ నా కోర్కెలు తీరటానికి ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలి స్వామీ! నీ భక్తుడినైన నన్ను కరుణించటానికి ఇంకా ఆలోచిస్తున్నావా తండ్రీ!" అని వేడుకున్నాడు. వెంటనే శీనయ్యముందు దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

దేవుడ్ని చూసిన శీనయ్య ముఖంలో ఎంతో సంతోషం. "నన్ను కరుణించావా తండ్రీ! నా కోర్కెలు తీర్చటానికి వచ్చావా?" అని ఉద్వేగంతో దేవుని ముందు మోకరిల్లాడు. దేవుడు చిన్నగా నవ్వాడు శీనయ్యకు ఏమీ అర్థం కాలేదు.

"శీనయ్యా! నువ్వు రోజూ నన్ను భక్తిగా సేవిస్తున్నావు. కాదనటంలేదు. అలాగే రోజూ నీ కోర్కెలు అన్నీ విన్నవించుకుంటున్నావు. నీ కోర్కెలన్నీ తీర్చటం లేదని నన్ను ఆడిపోసుకుంటున్నావు. ఆ వెంకయ్యకి నీ పాతచొక్కా ఇవ్వటానికి అన్ని రోజులు ఆలోచించి, రేపుమాపు అని వాయిదా వేసి, చివరికి జీర్ణావస్థలో వున్న చింకిచొక్కా ఇచ్చావే నీ కోర్కెలన్నీ తీర్చటానికి నేను ఇంకెంత ఆలోచించాలో చెప్పు?" అన్నాడు. కనువిప్పు కలిగిన శీనయ్య ఇంకెప్పుడూ దేవుని ముందు కోర్కెలచిట్టా విప్పకుండా వున్నంతలో దానధర్మాలు చేయడం మొదలు పెట్టాడు.

# రాజనర్తకి

అవంతి నగరానికి, కుసుమ పురానికి సత్సంబంధాలుండేవి. అవంతి రాజనర్తకి కౌముది రాజాజ్ఞను పురస్కరించుకుని కుసుమ పురానికెళ్ళి అక్కడ జరిగిన ఉత్సవాల్లో నాట్యం చేసింది. ఆమె అవంతి నగరానికి తిరిగి వస్తూ మార్గమధ్యంలోని అడవుల్లో వున్న బందిపోట్లకు దొరికిపోయింది. కౌముది వెంటవున్న సైనికులు, బందిపోట్లను ఎదిరించి పోరాడలేక ఓడిపోయారు.

బందిపోట్లు రాజనర్తకిని ముఠానాయకుడి దగ్గరకు తీసుకెళ్ళారు. ఆమె ముఠా నాయకుడితో "నేనెవరనుకున్నావ్? అవంతి రాజనర్తకిని.. మీరు నన్ను బంధించారని మహారాజుకు తప్పక తెలుస్తుంది. ఆయన సైన్యాన్ని పంపి మిమ్మల్ని సర్వనాశనం చేస్తారు" అన్నది.

బందిపోట్లు ఆమె మాటను నమ్మలేదు. ఏదో సాధారణ నగరవాసి అనుకున్నారు. వారిలో ఒకడు "నువ్వు రాజనర్తకివా? ఇంకా నయం సాక్షాత్తూ మహారాణినే అనలేదు" అన్నాడు.



ఇది విని అందరూ నవ్వారు. బందిపోట్ల ముఠానాయకుడామెతో "సరే! నువ్వు మా ముందు నాట్యం చేసి రాజనర్తకివని నిరూపించుకో!" అన్నాడు.

ఇందుకు రాజనర్తకి పట్టరాని కోపంతో "ఛీ. మీలాంటి అడవి మనుషులముందు నాట్యం చేయడమా? నేను నాట్యం చేసేది రాజాస్థానాలలోనే నా ప్రాణం తీసినా సరే. నేనిక్కడ నాట్యం చేయను" అంది.

ఈ జవాబు వింటూనే బందిపోటు ముఠానాయకుడు ఉలిక్కిపడి, "అవును! ఈమె నిస్సందేహంగా రాజనర్తకే. వృత్తివిలువ తెలిసిన నిజమైన కళాకారిణి. ఈమెనూ ఈమె వెంట వచ్చిన పరివారాన్ని సగౌరవంగా అడవిని దాటించండి" అని తన అనుచరుల్ని ఆజ్ఞాపించాడు.

# చెప్పి చేసిన మోసం

రాజీవుడనే అతడికి కచేరీలో వుద్యోగం వచ్చింది. వుద్యోగంలో చేరిన మొదటి రోజున అక్కడే పనిచేస్తున్న రాఘవ అనే అతను రాజీవుడితో "ఇదిగో చూడు! ఈ కచేరీలో చాలా జాగ్రత్తగా వుండాలి. డబ్బులు కనబడితే చాలు అప్పులు అడుగుతారు. అప్పుమాత్రం త్వరగా తీర్చరు!" అని హెచ్చరించాడు.



ఆ తర్వాత వాళ్ళిద్దరి మధ్య స్నేహం పెరిగింది. నెలాఖరున అందరికీ జీతాలిచ్చారు. తననెవరైనా అప్పు అడిగితే కుదరదని చెబుదామని రాజీవుడు గట్టిగా నిర్ణయించుకున్నాడు అయితే రోజులు గడుస్తున్నా తనని ఎవరూ అప్పు అడగలేదు.

ఒకరోజు రాఘవ, రాజీవుడు బజారుకు సరుకులు కొనటానికి బయల్దేరారు. రాఘవ కావాల్సిన సరులు తీసుకుని మొత్తం ఎంతివ్వాలో చెప్పమన్నాడు కొట్టువాడ్ని. కొట్టువాడు చెప్పిన మొత్తానికి అతడి దగ్గర యాభై రూపాయలు తక్కువగా వున్నది.

అప్పుడు రాఘవ, రాజీవుడితో తీసుకున్న సరుకులు ఇచ్చేయడమెందుకు. ఓ యాభై రూపాయలు సర్దు. రేపు కచేరికి రాగానే ఇస్తాను అన్నాడు. రాజీవుడు సరేనని ఇచ్చాడు.

అయితే ఎన్ని రోజులు గడిచినా రాఘవ తను తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోయేసరికి రాజీవుడు దానిసంగతి అడిగాడు.

వెంటనే రాఘవ "అదేమిటి? నేను ముందే చెప్పాను కదా! ఈ కచేరీలో అప్పలిస్తే అంత త్వరగా వసూలవ్వవని కొన్నాళ్ళు ఓపిక పట్టు. నా దగ్గరున్నప్పుడు ఇస్తాను" అన్నాడు.

# జమీందారుగారి పడవవాడు

చంద్రగిరి జమీందారుకు పడవ నడిపేవాడు కావాలని ప్రకటన ఇచ్చాడు. ఆయనకు దగ్గర్లో వున్న నదిలో సాయంవేళల్లో పడవ షికారు చేయడమంటే చాలా ఇష్టం. నది కొంత వారగా ఎన్నో మలుపులు తిరుగుతూ చాలా ఉధృతంగా ప్రవహించేది. అందువల్ల పడవ నడిపేవాడు చాలా నేర్పరి అయి వుండాలని ఆయన షరతు పెట్టాడు.

ఆయన చెప్పిన విధంగా దివాన్ చాలామందిని పరీక్షించి చివరకు పోలయ్య, జాలయ్య అనే వాళ్ళను జమీందారు దగ్గరకు తీసుకొచ్చి అయ్యా! ఈ పోలయ్య పడవ నడపడంలో మంచి నేర్పరేగాక, గజ ఈతగాడు. పోతే ఈ జాలయ్యకూడా పడవ నడపడంలో చెప్పకోదగిన నేర్పరే కానీ అంతపెద్ద ఈతగాడు మాత్రం కాదు అని చెప్పాడు.

జమీందరు ఆ ఇద్దర్నీ రేపు రమ్మని చెప్పి, వాళ్ళు వెళ్ళిపోగానే దివాన్‌తో ఆ జాలయ్యను రేపు రాగానే పన్లోకి తీసుకోండి అని చెప్పాడు.

అందుకు దివాన్ ఆశ్చర్యపోతూ "అయ్యా! అదేమిటి? గజ ఈతగాడు పోలయ్యని కాదని, అంతగా ఈతరాని ఆ జాలయ్యకి పని ఇద్దామనుకుంటున్నారు" అన్నాడు.

జమీందారు మందహాసం చేసి "పడవ నడపడంలో ఇద్దరూ నేర్పరులే. ఇక ఈతలో మాత్రం ఆ పోలయ్య ఘటికుడు. అలాంటివాడు తగినంత జాగ్రత్తగా వుండడు. కారణమేమిటంటే ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా సునాయాసంగా నదిని ఈదుకు పోగలనన్న ధైర్యం వాడికుంటుంది. జాలయ్యకు అంతగా ఈతరాదు. కనుక పడవ నడపడంలో అతి జాగ్రత్తగా వుంటాడు. అలాంటివాడి చేతిలో వాడి ప్రాణానికే కాదు, నా ప్రాణానికీ ముప్పు వుండదు. అవునా?" అని అడిగాడు.

"నేనింత దూరం ఆలోచించలేదు. తమరు ఆ ఇద్దర్నీ బాగా అంచనా వేశారు!" అన్నాడు దివాను తృప్తిగా.

# బహుమతికి కారణం

శివరామపాలెం జమీందారు భూపతిరాయుడు, ఒక ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా ఒక సాహితీ పోటీ ఏర్పాటు చేశాడు. ఆ పోటీ ఏమిటంటే - పరమ శివుడిపైన ఒక గంటలో వంద పద్యాలను ఆశువుగా చెప్పాలి. విజేతకు సరస్వతీ పుత్ర బిరుదుతోపాటు, వెయ్యి వరహాలు బహుమతిగా ఇస్తానని ఆయన ప్రకటించాడు.

ఆ పోటీలో రజనీచంద్ర అనే పాతికేళ్ళ యువకుడు, నారాయణా చార్యులు అనే ఒక ఎనభై ఏళ్ళ వృద్ధుడూ సమ ఉజ్జీలుగా నిలిచారు. జమీందారు ఎవరిని విజేతగా నిర్ణయిస్తారో నని సభలోనివారంతా ఆత్రుతగా చూడసాగారు.



జమీందారు కొద్దిసేపు ఆలోచించి, నారాయణాచార్యులు పోటీలో విజేతగా ప్రకటించాడు. ఆయనకు బిరుదు, సన్మానాలతోపాటు వెయ్యి వరహాలు బహుమతి కూడా ఇవ్వబడింది.

సభ ముగిశాక దివాను, జమీందారును పోటీలో రజనీచంద్రకాక, నారాయణా చార్యులు నెగ్గినట్లు ప్రకటించడానికి ఏదైనా ప్రత్యేక కారణం వున్నదా? అని అడిగాడు. అందుకు జమీందారు "లేకేం దివాన్‌జీ! రజనీచంద్ర యువకుడు. ఈ ఏడాది కాకపోయినా వచ్చే ఏడాది అప్పుడూ కాకపోతే ఆ పై ఏడాది పోటీలో పాల్గొని నెగ్గే అవకాశం వుంది. పోతే, ఏ క్షణమైనా రాలిపోవటానికి సిద్ధంగా వున్న పండుటాకు వంటివాడు నారాయణా చార్యులు..! ఇప్పుడు తప్పిపోతే ఆయన విద్వత్తును సన్మానించుకునే అదృష్టం వచ్చే ఏడాది మనకు దక్కకపోవచ్చు కదా!" అన్నాడు.

# భగవద్గీత

రామనాథం మాస్టారు చక్కని ఉపాధ్యాయులు మాత్రమే కాదు. సమయోచితమైన సలహాలతో అందరికీ మంచిని పెంచే మహామనిషి. ఒకరోజు రామనాథం మాష్టారుగారు గోపీ అనే విద్యార్థి జన్మదినం సందర్భంగా భగవద్గీత పుస్తకం ఇచ్చాడు. భగవద్గీత పుస్తకాన్ని చూసి గోపీతో సహా అతని స్నేహితులు గొల్లున నవ్వి "వృద్ధులకు ఉపయోగపడే భగవద్గీత యువకుడినైన నాకెందుకు బహుమతిగా ఇచ్చారు?" అని అడిగారు.




అప్పుడు రామనాథం మాష్టారు అక్కడివారిని వుద్దేశించి, "ఇది వృద్ధులు మాత్రమే చదివే పుస్తకం కాదు. మానసిక పరిపక్వత చెందని మీవంటి యువకులు

చదవాల్సిన మహాగ్రంథం ఎందుకంటే నేటి సమాజంలో యువతకు మంచి చెడుకు మధ్య తేడా తెలీటం లేదు. మహావీరుడైన అర్జునుడు సంశయ మనస్కుడై కర్తవ్యాన్ని విస్మరించి మోహసముద్రంలో పడిపోతున్న సమయంలో అతడికి సత్యం వివరించి విషాదం నుండి బయటకు లాగి కార్యోన్ముఖుణ్ణి చేసింది భగవద్గీత. అందుకే ఈ గ్రంథం ప్రపంచంలోని అన్ని భాషల్లోకి తర్జుమా చేయబడింది. అలాగే ఏ సమస్య వచ్చినా దాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక చావే శరణ్యం అని భావించే వారికి సముద్రంలో దిక్కు తెలియని నావకు దిక్సూచి వంటిది భగవద్గీత. కనుక పిల్లలనుండి వృద్ధులవరకూ అందరూ చదవాల్సిన అద్భుత గ్రంథం భగవద్గీత" అని వివరించాడు.

రామనాథం చెప్పిన మాటల్లో సత్యం వున్నట్లు అక్కడ వున్నవారందరూ గ్రహించి చప్పట్లతో తమ హర్షం వెలిబుచ్చారు.

# గంప కింది కోళ్ళు

చిట్టియ్య అనేవాడు చింత బరికె తీసుకుని పదేళ్ళ కొడుకు వీపు మీద కొడుతూ కేకలు పెడుతున్నాడు. ఆ దారిన వెళ్తున్న ధర్మయ్య అనే వ్యక్తి అదిచూసి చిట్టియ్యను సమీపించి చింతబరికె లాక్కుని "చిన్న పిల్లవాణ్ణి ఎందుకలా కొడుతున్నావ్?" అని నిలదీశాడు.



"అయ్యా! మీకేం తెలియదు తప్పుకోండి. గంపక్రింది కోళ్ళని బయటకి వదలొద్దురా అని ఎన్నిసార్లు చెప్పినా వీడు వినడు" అన్నాడు చిట్టియ్య కోపంగా ఊగిపోతూ.

"పిల్లవాడు గంపక్రింది కోళ్లని వదిలేస్తే ఇప్పుడేమైంది? ఏ గద్దో తన్నుకు పోవడమో, కుక్క ఏదైనా నోట కర్చుకు పోవడమో జరిగిందా?" అని అడిగాడు ధర్మయ్య.

"అలాంటిదేం జరగలేదు బాబూ! చింతబరికె ఇటివ్వండి" అని కొడుకుకేసి గుర్రుగా చూశాడు చిట్టియ్య.

ధర్మయ్యకు చిట్టియ్య మాటలు మరీ అసందర్భంగా తోచి "చిట్టియ్యా! కాస్త శాంతపడు. మేతమేసినాక కోళ్ళు నీ ఇంటిని వెతుక్కుంటూ అవే తిరిగివస్తాయి కదా! మరెందుకీ పిచ్చికోపం?" అన్నాడు.

"అన్నీ ఎలా తిరిగివస్తాయి? వాటిల్లో రెండే నావి. మిగతావి దేని యజమాని ఇంటికి అవి పోతాయి" అన్నాడు చిట్టియ్య.

ఆ జవాబుతో చిట్టెయ్య వద్ద అసలు సంగతి తెలుసుకున్న ధర్మయ్య "అదా అసలు రహస్యం! ఈ మధ్య ఊళ్లో వాళ్ల కోళ్లతోపాటు నావీ కొన్ని కనబడకుండా పోయాయి. పద గ్రామాధికారి దగ్గరకు! ఈ చింత బరికె నీ వీపు మీద ఎన్ని దెబ్బలకు విరిగిపోతుందో ఆయనే చూస్తాడు" అంటూ చిట్టెయ్యను గ్రామాధికారి వద్దకు లాక్కుపోయాడు.

# జరిగిన పొరపాటు

హేలాపురిలో కన్నయ్య, చిన్నయ్య పరమ బద్ధకస్తులు. కష్టపడి పనిచేయడమంటే ఇద్దరికీ ఇష్టముండదు. వున్న ఊళ్లో పెళ్లసంగతి తెలుసు గనుక పొరుగూళ్లకు పోయి అక్కడ ఎవరింట్లోనైనా శుభకార్యానికి విందు భోజనాలు జరుగుతుంటే వెళ్లి సుష్టిగా భోజనం చేసేవాళ్లు.

వాళ్లిద్దరూ ఒకసారి మిట్టమధ్యాహ్నంవేళ ఒక ఊరు చేరారు. అక్కడో ఇంటి ఎదురు గోడ మీదుగా ఎవరో విస్తరాకులు వీధిలోకి వేస్తున్నారు. "ఆహా..పెళ్లి భోజనం!" అంటూ కన్నయ్య, చిన్నయ్య ఆ ఇంటి ఆవరణలోకి వెళ్లారు. ఆ సమయంలో వడ్డన చేసేటందుకు విస్తరాకులు వేస్తున్నారు. ఇద్దరూ వాటి ముందు కూర్చున్నారు.

అక్కడ వడ్డన ఏర్పాట్లు అజమాయిషీ చేస్తున్నవాడు వీరివైపు అనుమానంగా చూసి "అయ్యా! తమరెవరో కాస్త చెబుతారా?" అనడిగాడు.

వెంటనే కన్నయ్య "నేను పెళ్లి కూతురి మేనమామ బావమరిదిని!" అన్నాడు. చిన్నయ్య "నేను పెళ్లి కూతురి పెదతండ్రిగారి చిన్నల్లుడిని!" అన్నాడు.

మరుక్షణం వాళ్లను ప్రశ్నించినవాడు పెద్దగా "ఈ దొంగవెధవలను వెంటనే వీధిలోకి నెట్టండి.!" అన్నాడు. వెంటనే నలుగురు పనివాళ్లు వచ్చి ఆ ఇద్దర్నీ ఎదురు గోడమీదుగా ఫులివిస్తరాకుల్లోకి విసిరి వేశారు.

"ఎక్కడ జరిగిందిరా చిన్నా.. పొరపాటు?" అన్నాడు కన్నయ్య ఒళ్లు దులువుకుంటూ.

"మనల్ని ఇక్కడ విసిరేసిన దుర్మార్గులు తిట్టిన తిట్లు నువ్వు వినలేదా? ఇప్పుడు జరుగుతుంది పెళ్లి కాదురా.. ఇల్లుగలాయన తండ్రి పెద్దదినం భోజనాలు" అన్నాడు చిన్నయ్య మూలుగుతూ.

# చత్వారం

పూర్వం ఒకప్పుడు హత్యలు, దారి దోపిడీలేకాక, చిన్న చిన్న దొంగతనాలను చేసేవాళ్లను గ్రామాధికారులు మెడలో ఒక కొయ్యగుదిబండ కట్టి ఎండలో కూర్చోబెట్టేవారు.

ఒకసారి ఎల్లయ్య అనేవాడు గ్రామం బయట పొలిమేరలో మేస్తున్న ఎద్దునొక దాన్ని దగ్గర్లో దొరికిన తాడును మెడకు కట్టి, దొంగిలించుకుపోవాలని చూశాడు. అయితే ఆ ప్రాంతాల కాపలాదారుడొకడు అది చూసి గ్రామాధికారికి చెప్పాడు. గ్రామాధికారి నౌకర్లను

పంపి ఎల్లయ్యను పట్టుకుని సూర్యాస్తమయం వేళ వరకూ శిక్షగా మెడలో ఒక గుదిబండ తగిలించి, ఎర్రని ఎండలో కూర్చోబెట్టాడు.

కొంతసేపు తర్వాత ఎల్లయ్య ఊరివాడు పుల్లయ్య అటుగాపోతూ ఎల్లయ్యను చూసి ఆశ్చర్యంగా "ఏమిటిది, మెడలో గుదిబండా నువ్వు?" అని అడిగాడు. "ఏం చెప్పేది. అంతా నా దురదృష్టం?" అన్నాడు ఎల్లయ్య "అసలేం జరిగిందేంటి?" అన్నాడు పుల్లయ్య తమ ఊరివాడి పరిస్థితికి జాలిపడుతూ.

"మరేంలేదు. అలా గ్రామందాటి పోతుంటే ఒక పచ్చిక బయల్లో పెద్ద తాడొకటి కంటబడింది. తీసుకున్నానంతే" అన్నాడు ఎల్లయ్య.

"దారిలో కనబడిన త్రాడు తీసుకున్నందుకు ఇంత శిక్షా?" అంటూ నివ్వెరపోయాడు పుల్లయ్య.

"ఆ త్రాడు వెనక ఎంతలేదన్నా ఐదారు వందల విలువచేసే ఎద్దు ఒకటి వున్నది. నా చత్వారం పాడుగానూ, దాన్ని నేను గమనించలేదు" అన్నాడు ఎల్లయ్య ఉస్సురుమంటూ.

# చిలుక పలుకు

శివాపురం అనే గ్రామంలో వుండే సిద్ధయ్య అనే అతను చిలుకను కొందామని బజారుకెళ్లి ఒక దుకాణంలో అందమైన చిలుకనొకదాన్ని చూసి దాని ఖరీదెంత? అని దుకాణం వాడ్ని అడిగాడు.



"వంద రూపాయలు" అన్నాడు దుకాణంవాడు.

"వంద రూపాయలే!" అంటూ సిద్ధయ్య ఆశ్చర్యపోయాడు.

"ఈ చిలుక సామాన్యమైంది కాదు. కావాలంటే దాన్నే అడగండి అంత ఖరీదు చేస్తుందో లేదో" అన్నాడు దుకాణం వాడు.

"నువ్వు వంద రూపాయలు ఖరీదు చేసేమాట నిజమేనా?" అని సిద్ధయ్య చిలుకను అడిగాడు.

"అందుకు సందేహమెందుకు?" అన్నది చిలుక.

ఆ జవాబుకు సిద్ధయ్య చాలా సంతోషించి, దుకాణం వాడికి వందరూపాయలు ఇచ్చి చిలుకను ఇంటికి తీసుకుపోయాడు ఇంట్లో

అతడి భార్యాపిల్లలు అడిగిన ప్రతి ప్రశ్నకు చిలుక "అందుకు సందేహమెందుకు?" అని జవాబివ్వసాగింది.

దానితో సిద్ధయ్య చిలుకకు ఆ మాట తప్ప మరేమీ రాదని తాను మోసపోయానని గ్రహించి తలబాదుకుంటూ పెద్దగా "నేను ఒట్టి అమాయకపు వెధవను - మోసపోయాను" అన్నాడు.

ఆ వెంటనే చిలుక అందుకు "సందేహమెందుకు?" అన్నది.

అది విని సిద్ధయ్యతోపాటు, అతడి భార్యా పిల్లలు పొట్టచెక్కలయ్యేలాగ నవ్వుకున్నారు.

# పుర్రెతో పుట్టిన బుద్ధి

పరమ పిసినారి జమీందారు సర్వారాయుడికి ఎప్పుడైనా గుడికి వెళ్తే పూజారికి దక్షిణగా ఏదైనా ఇవ్వటం, దేవునికి కొబ్బరికాయ పగలకొట్టడం, పాదరక్షల కాపలా కుర్రాడికి ఏదైనా ఇవ్వడం ఇష్టముండేది కాదు.

జమీందారు పిసినారితనం బాగా ఎరిగిన పూజారి సోమనాథశాస్త్రి ఆయనను నోరెత్తి ఏమీ అడిగేవాడు కాదు.

ఓ మహాశివరాత్రి పర్వదినాన జమీందారు సర్వారాయుడు మొదట వ్యక్తిగా గుడికి రావడమే కాకుండా పూజారి శాస్త్రికి ఒక కానీ దక్షిణగా పళ్లెంలో వేశాడు.

అంత చిన్న బోణీతో మనసు బాధపడ్డ పూజారిశాస్త్రి "జమీందారుతో తమవంటి గొప్పవారినుండి 'కానీ' దక్షిణగా స్వీకరించడం నాకు ఎంతో అవమానంగా వుంది! దయచేసి మరొక కానీ దక్షిణగా ఇవ్వండి!" అన్నాడు.

ఆ మాటలతో ఒళ్ళుమండిన సర్వారాయుడు "ఇంకొక కానీ ఇచ్చి మళ్ళీ రెండోసారి మిమ్మల్ని అవమానపరచటం నాకూ ఇష్టం లేదు" అంటూ ఇచ్చిన కానీ వెనక్కి తీసుకుని గుడి బయటకు నడిచాడు.

# మతి మరుపు

సూర్యోదయంతోనే చెరువుకు స్నానానికి పోతున్న సూరయ్య అనే ఆయన్ని అతడి పొరుగూరి దూరపు బంధువైన సోమయ్య దారిలో కలుసుకుని "ఈ మాట నిజమేనా? మీ ఇంట్లో ఆ మధ్య వరుసగా మూడుసార్లు దొంగలుపడి దోచుకున్నారట!" అని అడిగాడు.

"ఆ మాట నిజమే!" అన్నాడు సూరయ్య విచారంగా.

"మరి భోషాణం అంతదాన్ని దొంగలు బద్దలు కొడుతున్నప్పుడు నీకు మెలకువ రాలేదా?" అని అడిగాడు సోమయ్య.

"ఎక్కడి మెలకువ! దొంగలు నా తలగడ క్రిందనుండి భోషాణం తాళపుచెవులు తీసుకుని చప్పుడు కాకుండా తలుపులు తెరిచి దోచుకెళ్ళారు" అన్నాడు సూరయ్య.

"ప్రతిసారి తాళపు చెవుల్ని తలగడక్రింద దాచటానికి బదులు మరెక్కడైనా దాయొచ్చు కదా!" అని అడిగాడు సోమయ్య.

"అదీ చేశాను!" అన్నాడు సూరయ్య నిట్టూరుస్తూ.

"ఎక్కడ దాచావేమిటి?" అన్నాడు సోమయ్య.

"ఎప్పటిలాగ తలగడ క్రిందకాకుండా, వాటిని అటకమీద దాచాను" అన్నాడు సూరయ్య.

"అయితే దొంగలకు ఆ తాళం చెవులెలా దొరికాయి?" అన్నాడు సోమయ్య ఆశ్చర్యంగా.

"నా మతిమరుపు కొంపముంచింది! దాచిన తాళం చెవుల్ని మర్చిపోతానేమో అన్న అనుమానంతో ఒక చీటీమీద భోషాణం తాళం చెవులు అటక మీద వున్నవి. అని వ్రాసి, ఆ చీటీని తలగడక్రింద పెట్టుకుని పడుకున్నాను" అని జవాబిచ్చాడు సూరయ్య. దానితో వరసగా అన్నిసార్లు దొంగతనం ఎలా జరిగిందో సోమయ్యకి అర్థమైంది.

# సీతయ్య మందబుద్ధి

సీతయ్యకు పుట్టెడు మతిమరుపు. ఈ క్షణంలో ఏ పని చేసింది మరుక్షణంలో గుర్తుండేది కాదు. ఎక్కడ పెట్టిన వస్తువులు అక్కడే మర్చిపోయేవాడు. ఇందువల్ల అతడి కుటుంబ సభ్యులు నానా ఇబ్బందులు పడేవాళ్ళు. అతడి భార్య వెంటవుండి అన్ని పనులూ చేయించేది.

ప్రతిరోజూ గుడికెళ్ళి అక్కడ రామాయణ పారాయణం విని వచ్చే సీతయ్య రోజూ తన ఉత్తరీయమో, గొడుగో అక్కడ మరిచి వచ్చేవాడు. తర్వాత ఇంట్లో ఎవరో ఒకరు వెళ్ళి తీసుకొచ్చేవారు.

భర్త మతిమరుపుతో బాగా విసిగిపోయిన సీతయ్య భార్య ఒక రోజు కోపం కొద్దీ అతడ్ని గట్టిగా చివాట్లు పెట్టింది.

భార్య పెట్టిన చివాట్లు సీతయ్యకు చాలా బాధ కలిగించాయి. ఆ రోజు సాయంత్రం అతడు గుడినుండి ఇంటికి తిరిగి వచ్చి భార్యను కేకవేసి "నన్ను మతిమరపువాడివంటూ తెగ చివాట్లు పెట్టావ్ కదా! ఈ రోజు చూడు. గుడిలో మర్చిపోకుండా చెప్పులు తొడుక్కుని వచ్చాను" అన్నాడు.

సీతయ్య భార్య అతడి కాళ్ళవైపు ఆశ్చర్యంగా చూసి "మీ మతి మరుపు ముండినట్లే వుంది. ఈ రోజు మీరసలు గుడికి చెప్పులు తొడుక్కుని వెళ్ళలేదు!" అన్నది.

# పిసినారి

వరలక్ష్మి మహా పిసినారని ఆ వీధిలోనే కాదు. ఆ గ్రామంలో అందరికీ తెలుసు. ఒకసారి చాకలికి బట్టలేసి పద్దు రాసుకునేందుకు పెన్ను అవసరమైంది. ప్రక్కింటి కమల కొడుకును అడిగి పెన్ను తీసుకురమ్మంది కూతురును.



లేదన్నారని ఉత్తినే వచ్చేసింది కూతురు. ఎదురింటి గీత, వనజ, సరళను అడిగిచూడమంది మళ్ళీ.

"అమ్మా! అందరూ లేదన్నారే!" అని నిట్టూర్చింది కూతురు.

"సర్లే! ఇవ్వకపోతే ఇవ్వకపోయారు. మీ నాన్న బట్టలు పెట్టుకునే బీరువాలో పెన్నుంది తీసుకురా" చెప్పింది వరలక్ష్మి.

ముందు ఆశ్చర్యపోయి చూసినా, తర్వాత వెతికి పట్టుకువచ్చి ఇస్తూ - "అవునమ్మా! నాకు తెలియక అడుగుతాను. మనింట్లోనే పెన్నూ, పేపరు పెట్టుకుని ఇతరులను అడగటం దేనికి?" అనుమానంగా చూసింది కూతురు.

"ఎందుకా- ఏమిటి? ఇంకు అయిపోతే మనం కొనగలమా?" విసురుగా అంది తల్లి. అర్థమైన దానిలా కూతురు తలూపేసరికి "ఇదైనా మనం కొన్నదా ఏమిటి? ఎదురింటి పిల్లాడు ఇక్కడకు రాసుకోవటానికి వచ్చి మర్చిపోయిన పెన్ను" అని తల్లి చెప్పేసరికి మరోసారి నివ్వెరపోయి చూడాల్సి వచ్చింది తల్లిని.

తల్లి పిసినారితనానికి తలబాదుకుంది కూతురు.

# మట్టిబుర్ర

రామాపురంలో నివశించే సోమనాథాన్ని ఆ ఊరి ప్రజలంతా మట్టిబుర్ర సోమనాథం అని పిలిచేవారు. కానీ సోమనాథం వారి మాటలను కొంచెం కూడా పట్టించుకునేవాడు కాదు.

ఇలా వుండగా ఒక రోజు పొరుగూరునుండి అల్లుడ్ని చూద్దామని తన మామగారైన సింగినాదం వచ్చాడు. ఆ ఊళ్ళో వారందరూ తన అల్లుడ్ని మట్టిబుర్ర సోమనాథం అని పిలవటం చూసి చాలా బాధపడ్డాడు. జనమంతా తన అల్లుడ్ని అలా ఎందుకు పిలుస్తున్నారో కొంచెం కూడా అర్థం కాలేదు. వెళ్ళి ఆ విషయాన్ని అల్లుడ్ని అడుగుదామనకున్నాడు. కానీ అడిగితే అల్లుడేమైనా అనుకుంటాడేమోనని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

ఒకరోజు సాయంత్రం ఏదో పనిమీద బయటకు వెళ్తున్న సింగినాదం దగ్గరకు సోమనాథం వచ్చి "మామగారు! ఇంట్లో నాకు మీ పదిరూపాయల నోటు దొరికింది. తీసుకోండి." అని జాగ్రత్తగా దాన్ని అందజేశాడు

అల్లుడి నిజాయితీకి ఎంతో సంతోషించి సింగినాదం ఆ పదిరూపాయలనోటుని అందుకుంటూ "అవును! ఈ పది రూపాయలనోటు నీకు ఎక్కడ దొరికింది అల్లుడూ?" అని అడిగాడు.

వెంటనే సోమనాధం మరేమీ తడుముకోకుండా "గోడకి తగిలించి వున్న మీ చొక్కా జేబులో మామయ్యా!" అన్నాడు అమాయకంగా.

అంతే! అల్లుడు చెప్పిన ఆ సమాధానం విన్న సింగినాధానికి నెత్తిమీద పిడుగు పడినట్లయి, ఆ ఊరి ప్రజలంతా తన అల్లుడ్ని మట్టి బుర్ర సోమనాధం అని ఎందుకంటు న్నారో ఇప్పుడర్థమైంది.

# పరమానందయ్యగారి మూడో శిష్యుడు

పరమానందయ్యగారు మళ్ళీ పుట్టారు. ఈసారి గురుకులంలో విద్యాబోధన కాకుండా ఓ చిన్న పల్లెటూళ్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా చేరి, ఆ ఊర్లోనే చిన్న పెంకుటింట్లో అద్దెకుంటున్నారు.

నందయ్య అనే శిష్యుడు అమ్మగారు, అయ్యగారు చెప్పిన పనులన్నీ చేస్తుండేవాడు.



"నందయ్యా! మా నాన్న దగ్గుమందు అయిపోయిందిరా... దగ్గుకి మందివ్వమని హాస్పిటల్లో అడిగి తీసుకురా!" అని మొదటి పనిని శిష్యుడికే అప్పగించాడు ఖాళీసీసా ఇస్తూ పరమా నందయ్యగారు శిష్యుడు హాస్పటల్‌కి వెళ్ళి దగ్గుకి మందు కావాలన్నాడు. దానికి డాక్టర్ దగ్గుకి మందెందుకు బాబూ - ఇంజక్షన్ ఇస్తాను అన్నాడు. "అలాగే ఇవ్వండి!" అన్నాడు శిష్యుడు. సిరంజినిండా తగు మోతాదు మందు తీసి ఇంజక్షన్ ఇచ్చి పంపేశాడు డాక్టర్.

ఖాళీసీసాతో శిష్యుడు ఇంట్లో అడుగు పెట్టేసరికి "ఏమైందిరా?" అని అడిగి, విషయం తెలుసుకుని "దగ్గు మా నాన్నకి అయితే నువ్వు ఇంజెక్షన్ తీసుకోవడమేమిట్రా? వెర్రి వెధవా నిజంగానే పరమానందయ్య శిష్యుడవనిపించుకున్నావు. నీలాంటి బడుద్ధాయి శిష్యులతో ఎలాగరా వేగేది" అని చొక్కా చింపుకుని జుట్టు పీక్కున్నాడు పరమానందయ్య. శిష్యుడు పుచ్చుకున్న ఇంజక్షన్ వికటించి ఏ ప్రాణం మీదకొస్తుందో అని శిష్యుడ్ని తీసుకుని హాస్పటల్ వైపు పరుగులు తీసింది గురువుగారి భార్య.

# తేలు కుట్టిన దొంగ

కిరణ్ డిగ్రీ విద్యార్థి. వాడు తలపెట్టిన పని ముందుగా ఆలోచించి పథకం ప్రకారం చేసి విజయం సాధించేవాడు. దాంతో కిరణ్ తాను చాలా తెలివైనవాడ్ని అని గర్వపడుతూ వుండేవాడు.

కిరణ్ తండ్రి వర్తక వ్యాపారి. డబ్బు ఖర్చు విషయంలో చాలా పొదుపరి. ఆయన ప్రతీ సంక్రాంతి పండక్కి కిరణ్‌కి ఒక జత బట్టలు కుట్టించుకోవటానికి డబ్బులు ఇచ్చేవాడు. ఈసారి పండక్కి తండ్రి దగ్గర రెండు జతల బట్టలకు డబ్బు వసూలు చేయాలని కిరణ్ పథకం వేశాడు.



పండుగ కొన్ని రోజులు వుందనగా కొత్త బట్టలు కొనటానికి తండ్రిని డబ్బులు అడిగాడు. తండ్రి ఎప్పటిలాగే ఒక జత బట్టలకి డబ్బులిచ్చాడు. కిరణ్ ఆ డబ్బు తీసుకుని బట్టలు కొనటానికి బజారుకెళ్ళి పథకం ప్రకారం డబ్బు దాచి వెంటనే ఇంటికివచ్చాడు. ఖాళీ చేతులతో వచ్చిన కిరణ్‌ను చూసి "ఏరా..! బట్టలు కొనలేదా? అని తండ్రి అడిగాడు. కిరణ్ దిగులుగా ముఖం పెట్టి తండ్రితో "బజార్లో జేబు దొంగ డబ్బును కాజేశాడు" అని చెప్పాడు. ఆ మాటలకు తండ్రి మండిపడుతూ డబ్బు విషయంలో నీకు బొత్తిగా జాగ్రత్త లేదు అంటూ కిరణ్‌ని నానా తిట్లు తిట్టాడు. తండ్రి తిట్లకు కిరణ్ మరింత బిక్కముఖం పెట్టాడు. కిరణ్ పరిస్థితిచూసి ఆయన పండగ దగ్గరకొచ్చాక మరో జత బట్టలకు డబ్బులిస్తాన్లే అని కొడుకును సముదాయించాడు.

తాను పన్నిన వలలో తండ్రి పడినందుకు కిరణ్ లోలోపల సంతోషిస్తూ "అలాగే నాన్నా!" అన్నాడు. ఆ తర్వాత కిరణ్ దాచిన డబ్బుతో ఓ జత బట్టలు కొని, వాటిని రహస్యంగా ఇంట్లోని పాత బట్టల పెట్టెలో దాచాడు. పండగ దగ్గర పడింది. కిరణ్ బట్టల విషయం గుర్తుచేశాడు తండ్రికి. ఆయన చిరాగ్గా వ్యాపారం నష్టంలో వుంది. బట్టలు సంగతి తర్వాత చూద్దాం

అన్నాడు. తండ్రి మొండి మనస్తత్వం తెలిసిన కిరణ్ డబ్బు పోయిందని చెప్పి కొన్న జత బట్టలతో సరి పెట్టుకోవచ్చులే అని భావించాడు.

ఆ మర్నాడు కిరణ్ కాలేజినుండి ఇంటికి తిరిగివచ్చేటప్పటికి వాడికి బల్లపైన ఒక క్రొత్త స్టీలు బిందె కన్పించింది. అదిచూసి కిరణ్ ఈ క్రొత్త స్టీల్ బిందె ఎక్కడిది. అని తల్లిని అడిగాడు. పాత బట్టలకు స్టీల్ సామాన్లు ఇచ్చేవాడు వస్తే పెట్లో వున్న పాతబట్టలన్ని ఇచ్చి ఈ క్రొత్త స్టీల్ బిందె కొన్నానని చెప్పింది. వెంటనే కిరణ్ పాత బట్టలపెట్టె తెరిచి చూశాడు. క్రొత్త బట్టల జత కన్పించలేదు. దాంతో కిరణ్ తాను వేసిన ఎత్తు ఫలించకపోగా అసలుకే ఎసరు వచ్చిందని బాధపడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే తన తెలివితక్కువతనం బయటపడుతుందని కిరణ్ తేలు కుట్టిన దొంగలా కిక్కురుమనలేదు.

# కలవర మనసు

ఉగాది పండక్కి చీరకొనటానికి సంతకెళ్లింది వీరమ్మ. ఎర్ర చీర ఎంచుకుని బేరమాడింది. అటు తిప్పి ఇటు తిప్పి ఈ మాట, ఆ మాట చెప్పి చివరకు ఆ చీరను నలభై రూపాయలకు ఒప్పించడానికి నల్లబడ్డాడు ఎండకు చీరలవ్యాపారి చిన్నయ్య.

ఆమె ఇంటికి చేరుకునేసరికి ప్రక్కింటి శాంతమ్మ అలాంటి చీరనే తీసుకొచ్చి తను ముప్పై ఐదు రూపాయలకే కొన్నట్లు చెప్పింది. వీరమ్మకు ఆ మాట చెవిన పడగానే మనసులో ఒకటే కలవరింత మొదలైంది. చీర పోలికలో ఎటువంటి మార్పు లేదు. పొడవు వెడల్పులో తేడాలు లేవు దారం నేత అంతా ఒకటే రెండూ ఎరుపే. చీరలోని డిజైన్ కూడా అంతా ఒకటే ఐదు రూపాయలు నష్టపోయానని బేరమాడ్డంలో పొరపాటుపడ్డానని అనుక్షణం మధన పడసాగింది.

ఆ చీరను కట్టిన ప్రతీసారి ఆమెలో ఒకే బాధ అనవసరంగా ఐదురూపాయిలు ఎక్కువ పెట్టి కొన్నానని. మూడు నెలలు తర్వాత వీరమ్మకు మనసు తేలిక పడింది. కారణమేమిటంటే శాంతమ్మ కట్టిన చీర రంగు వెలిసిపోయింది.

# పెద్దల ఎన్నిక

కృష్ణాపురంలో రామయ్య, సీతమ్మ అనే దంపతులుండేవారు. ఆ దంపతులకు ఒకమ్మాయి కలిగింది. ఆ అమ్మాయి పేరు కళ్యాణి. ఆ అమ్మాయికి బాల్యం గడిచి యుక్త వయసు రాగానే తల్లిదండ్రులు ఆమెకి పెళ్లి చేయాలనుకున్నారు. కళ్యాణి అందచందాల్ని గుణగణాల్ని చూసి చాలామంది ఆ అమ్మాయిని పెళ్లాడతామని ముందుకొచ్చారు. ఐతే తల్లితండ్రులు ఒక మంచి సంబంధం చూసి నిశ్చయించారు. కళ్యాణికి ఆ వరుడు నచ్చలేదు.

కళ్యాణి ఆలోచనలు ఊహాలోకాల్లో విహరిస్తున్నాయి. ఏదో ఒక గొప్పవాడిని చేసుకోవా అని ఆమె ఊహ. ఆ ప్రాంతంలో అందర్నీ మించినవాడు రాజు కదా! రాజునే పెళ్లి చేసుకోవాలని



నిశ్చయించుకుంది. ఎవరన్నా అడిగితే నేను రాజునే పెళ్ళాడి రాణినవుతా అంటుండేది. అది విన్న వాళ్ళంతా ఫకాలున నవ్వి పోతుండేవారు. కానీ ఆమె రాజుని ఆరాధించడం మానలేదు.

ఒకరోజు దేశాన్నేలే రాజు ఆ ప్రాంతానికి వచ్చాడు. ఆ రాజుకోసం కళ్యాణి ఎదురుచూస్తూ నిల్చుంది. అంతలో ఒక సన్యాసి వచ్చి రాజుకి ఎదురుపడగానే రాజు ఆయనకు సాష్టాంగపడి నమస్కరించాడు. అది చూసి కళ్యాణి రాజుకన్నా సన్యాసి గొప్పవాడిగా తలచి ఆయననే వలచి ఆ సన్యాసిని అనుసరించసాగింది. అలా వెళ్తున్న సన్యాసి దారి ప్రక్కగా వున్న శివలింగాన్ని ఫలపుష్పాలతో పూజించాడు. దాన్ని చూసిన ఆమె సన్యాసికన్నా శివుడే గొప్పవాడని తలచి ఆ శివలింగం ముందే కూర్చుని శివునికోసం తపస్సు ప్రారంభించింది. కొద్దిసేపటి తర్వాత ఒక కుక్క వచ్చి శివలింగంపై మూత్రాన్ని వదిలి అపరిశుభ్రం చేసింది. అది చూసి ఆమె అందరికన్నా కుక్కయే గొప్పది అనుకుని కుక్కని అనుసరించింది. మరి కాసేపటికి ఆ కుక్క ఓ ఇంట్లోకి జొరబడుతుండగా ఓ పిల్లవాడు చూసి రాళ్ళతోకొట్టి వెళ్ళగొట్టాడు. ఇది చూసి వీధిలో వెళ్తున్న ఒక యువకుడు కుక్కని ఎందుకు కొట్టావంటూ పిల్లవాడ్ని కోపంగా దండించాడు. అది చూచిన కళ్యాణి ఆ యువకుని భూతదయ గమనించి ఎలాగైనా ఆ యువకుడ్నే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంది.

ఆ యువకుడు ఎవరనుకున్నారు? మరెవరో కాదు. కళ్యాణి తల్లిదండ్రులు ఆమెనిచ్చి పెళ్ళి చేయుటానికి నిశ్చయించినవాడే. కనుక అందని దానికోసం అర్రులు చాచడం కన్నా అందిన దానితో సంతృప్తి చెందడం మంచిది. అనుకున్న కళ్యాణి పెద్దలు దూరదృష్టితో నిర్ణయించిన యువకుడ్నే పెళ్ళాడి సుఖభోగాలు అనుభవించింది జీవితాంతం!

# పిచ్చి పుల్లయ్య

వీరేశం అమాయకుడు. వాడంటే అతని తల్లితండ్రులకి ప్రేమ అధికం. వాడికి గారాబం కూడా ఎక్కువే! పదేళ్ళు వచ్చినా బడికి వెళ్ళేటందుకు అంగీకరించలేదు వీరేశం. అందుకు అతడి తల్లితండ్రులు కొడుకుమీద ప్రేమతో ఏమీ అనకపోగా ఏమీ బాధపడలేదు.

వీరేశం తండ్రి తన వెంట అన్ని పనులకు, కాలక్షేపాలకు కొడుకును త్రిప్పుతుండేవాడు. అప్పుడప్పుడు తినటానికి ఏమైనా కొనిపెట్టేవాడు. ఒకనాడు వీరేశానికి అతడి తండ్రి బజార్లో బఠాణీ గింజలు కొనిపెట్టాడు. వాటిని తినేటందుకు పొట్లం విప్పుకుంటూ పొరపాటున



పాత్రంలో నుండి క్రింద పడేసుకున్నాడు వీరేశం "ఒరే బాబూ! ఏదైనా వస్తువు కొంటే దాన్ని జేబులో దాచుకోవాలి. అప్పుడది భద్రంగా వుంటుంది" అంటూ కొడుక్కి అర్థమయ్యేలా నిదానంగా చెప్పాడు తండ్రి.

ఆ తర్వాత ఒకసారి వీరేశాన్ని పిల్చి "ఒరేయ్! ఆదెమ్మ ఇంటికెళ్ళి తొందరగా పావుశేరు పాలు పట్టుకునిరా నీకు పాలకోవాచేసి పెడతాను!" అంది అతడి తల్లి. వీరేశం పాలకోవా మీద ఆశతో ఆదెమ్మ ఇంటికి పరిగెత్తుకెళ్ళి పాలు తీసుకుని వీరవేగంతో తిరిగి వచ్చేశాడు. "పాలేవిరా!" అడిగింది తల్లి వింతగా. "జేబులో పోసుకుని తెచ్చానమ్మా! జేబులో వేసుకుంటే ఏ వస్తువైనా భద్రంగా వుంటుందని మొన్న బఠాణీలు క్రింద పడిపోయినప్పుడు నాన్న చెప్పాడు. అది బాగా గుర్తు పెట్టుకున్నాను" అని తన జేబుకేసి చూసుకున్నాడు వీరేశం.

ఆ తల్లికి ఏం మాట్లాడాలో తోచలేదు.

"పోరా పిచ్చి పుల్లయ్యా!" అన్నాడు తండ్రి కొడుకుని కోపంగా చూస్తూ. ఆ తర్వాత ఆ దంపతులకు కొడుకుకి చదువు చెప్పించడం చాలా అవసరమని తెలిసొచ్చింది.

# భయం

సీతయ్య రావుబహద్దూర్ గారింట్లో పనివాడు చాలా పిరికివాడు. ప్రతీ విషయానికి భయపడుతూ వుండేవాడు. సీతయ్య పిరికితనాన్ని ఆసరాగా తీసుకుని ఊర్లో కొందరు తమ సరదాలకు తెగ ఏడ్పించేవాళ్ళు తిరిగి ఎదిరిస్తే చితకబాదుతారన్న భయంతో వణికిపోయేవాడు.

ఓ రోజు జమీందారుగారి భార్య అరటిగెలకోసం తోటకు సీతయ్యని పంపించింది. సీతయ్య తోటకెళ్ళి అరటిగెలను తీసుకుని వస్తుండగా దార్లో చెట్లకొమ్మల పైనుండి కొన్ని కోతులు చూశాయి. చటుక్కున ఎగిరి సీతయ్యముందు నిలబడ్డాయి. సీతయ్య భయంతో పరుగుతీశాడు. కానీ కోతులు వదలకుండా అరటిగెలకోసం తరుమసాగాయి. పరిగెత్తి పరిగెత్తి అలసిపోయి నిలబడిపోయాడు. అటువైపు వెళ్తున్న స్వామిజీ దగ్గరకెళ్ళి "స్వామీ! నన్ను రక్షించండి. ఆ కోతులు ఈ అరటిగెల కోసం చాలాసేపు తరుముకొస్తున్నాయి" అని చెప్పాడు సీతయ్య. స్వామీజీ ఓ నవ్వు నవ్వి "చూడు నాయనా! నువ్వు భయపడేకొద్దీ నిన్ను తరుముకుంటూ వస్తాయి. ప్రతీ విషయంలో కూడా ఇంతే. భయపడేకొద్దీ ఇలానే వుంటుంది. నువ్వొక్కసారి వాటిని తరిమికొట్టు అవి నీ జోలికి రావు" అన్నాడు. స్వామీజీ ప్రక్కనే నడిపున్న

కర్రను తీసుకుని కోతులను తరిమి తరిమి కొట్టాడు సీతయ్య. అన్ని కోతులూ పారి పోయాయి. ఆ రోజునుండి సీతయ్య అన్ని విషయాల్లో ధైర్యంగా వుండసాగాడు.

చూశారా బాలలూ. కష్టం వచ్చినపుడు భయపడిపోకూడదు. ధైర్యంగా ఎదుర్కోవాలి.

# ప్రదక్షిణ

సుబ్బిశెట్టి వడ్డీ వ్యాపారి. ఆ గ్రామంలో చాలామంది అతడి వద్దనుండి అప్పులు తీసుకున్నవారే.

ఒకరోజు రామయ్య అనే రైతు అప్పకోసం సుబ్బిశెట్టి వద్దకొచ్చాడు. అనావృష్టి వల్ల పంటలు పండక. కుటుంబ పోషణకు తప్పనిసరి పరిస్థితిలో అప్ప చేయాల్సి వచ్చింది రామయ్యకు.

"నీకిప్పడు జ్ఞాపకం వచ్చాననమాట. ఈ ఊర్లో ఎందరికో అప్పలిచ్చాను. వాళ్లువచ్చి నన్ను పలకరించిపోతుంటారు. కానీ నీవెప్పడూ నాతో మాట్లాడిన పాపాన పోలేదు. పొగరుతో నా అవసరం ఏముందిలే అనుకున్నావు. ఇప్పడు నా కాళ్ల దగ్గరకొచ్చావు" అని హేళనగా మాట్లాడాడు సుబ్బిశెట్టి.

అవసరం తనది కాబట్టి సుబ్బిశెట్టి ఎన్ని మాటలు ఆడినా రామయ్య మౌనం వహించాడు. అలా నాలుగైదు రోజులు తనచుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత రామయ్యకు కొంతడబ్బు అప్ప ఇచ్చాడు సుబ్బిశెట్టి.

ఇదంతా గమనిస్తున్న ఓ వ్యక్తి "ఏం రామయ్యా! అప్పకోసం అన్నిసార్లు ప్రదక్షిణ చేయడం సిగ్గుగాలేదూ?" అని అడిగాడు.

"నేను నాలుగైదు రోజులే తిరిగాను. కాని నాలుగైందు సంవత్సరాలు నా చుట్టూ అతను ప్రదక్షిణ చేస్తూనే వుంటాడు. బాకీ చెల్లించమని!" అన్నాడు సంతోషంగా రామయ్య.

# మెదడులేని సింహం


ఒక అడవిలో గుహలో ముసలి సింహం నివశిస్తోంది. ఒకసారి దాని కాలికి గాయమవటంతో నడవలేకపోయింది. దాంతో వేటాడి జంతువుల్ని తినలేకపోయింది. ఆ సింహానికి ఓ మెరుపులాంటి ఆలోచన వచ్చింది. రోజుకొక జంతువుకు మాయ మాటలు చెప్పి తన వద్దకు ఆహారంగా తీసుకురావటానికి తెలివైన మంత్రిని నియమించాలనుకున్నది.

నక్క బావను తన మంత్రిగా నియమించుకుని రోజుకో జంతువును తన వద్దకు తీసుకురమ్మని పురమాయించింది. మొదట గాడిదను తోలుకు రమ్మని ఆదేశించింది. గాడిద మెదడు తినాలని ఎప్పట్నుంచో కోరికగా వున్నట్లు సింహం చెప్పింది. నక్క బావ అడవంతా వెదకి సాయంత్రానికల్లా ఒక గాడిదను మాయమాటలు చెప్పి సింహం వద్దకు తోలుకుని పోయింది.




గాడిదను చూడగానే సింహం దానిపైపడి చంపేసి మెదడు తినబోయింది. నక్కబావ కూడా ఎప్పట్నుంచో గాడిద మెదడు తినాలన్న కోరిక వుంది. సింహానికి మాయ మాటలు చెప్పి తన కోరిక తీర్చుకోవాలనుకుంది.

సింహం గాడిద తల పగలగొట్టగానే నక్క కలగజేసుకుని "మృగరాజా! నీ ఒంటిపై రక్తం పడింది. స్నానం చేయకుండా ఎలా తింటావు. ప్రక్కనే వున్న కొలనులో స్నానం చేసి వచ్చి తిను" అంది. నక్క మాటలు విని సింహం కొలనులోకి వెళ్ళింది. అది వచ్చేలోగా




నక్కబావ గాడిద మెదడును తినేసింది. సింహం వచ్చి ఎంత వెతికినా మెదడు కన్పించలేదు. "ఎవరైనా ఇటువైపు వచ్చి గాడిద మెదడు తిన్నారా?" అని నక్కను ప్రశ్నించింది.

నక్కబావ నేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ "మృగరాజా! మీరు చంపిన గాడిద ఒక బుద్ధి హీనమైన జంతువు. బుద్ధి హీనులకు మెదడుండదు. ఆ కారణంగా గాడిదకు మెదడు లేదు" అని చెప్పింది.



నక్క మాటలు విన్న సింహం నిజమేనని నమ్మి, గాడిద దేహాన్ని భుజించసాగింది. నిజానికి మెదడులేనిది సింహానికేనని తెలిసి నక్క ముసి ముసిగా నవ్వుకుంటూ మరో జంతువుకు మాయ మాటలు చెప్పేటందుకు బయల్దేరింది.





# అల్లరి చేసే గాడిద

ఒకరోజు శ్రీకృష్ణ దేవరాయల కొలువులో పండిత సభ జరుగుతోంది. అనేక దేశాలనుండి చాలామంది పండితులు వచ్చారా సభకు రకరకాల ప్రశ్నలకు జవాబులు ఇస్తున్నారు ఆ పండితులు. కానీ సభలో గుసగుసలు, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడంతో నిశ్శబ్దం కొరవడింది. చివరకు పండితులు చెప్పింది ఎవరికీ అర్థంకాకుండా పోయింది. దాంతో రాయలువారికి విసుగనిపించి, తెనాలిరామకృష్ణ చెవిలో ఈ విషయం చెప్పాడు.

అంతట తెనాలి రామకృష్ణ ఆలోచించి సభనుద్దేశించి ఇలా అన్నాడు: "పండితుల్లారా! ఈ సభలో జరుగుతున్న కార్యక్రమం వల్ల ఎన్నో తెలియని విషయాలు మనకు తెలుస్తున్నాయి. కానీ ఇక్కడున్నవారు ఉద్ధండపండితులమన్న విషయం మరిచి సభలో గోల చేస్తున్నారు. ఇది మీకు తగునా?" అన్నాడు.

కొద్దిసేపు బాగానేవున్నా, మరలా మామూలుగానే సభలో గుసగుసలు ప్రారంభమైనాయి. వెంటనే రామకృష్ణుడు గట్టిగా మాట్లాడుతూ "మీ కొక కథ చెబుతాను కాస్త వినండి" అని "ఒక అడవిలో ఒకరోజు అన్ని జంతువులకు సమావేశం ఏర్పాటు చేయబడింది. ఆ సమావేశంలో వాటి ప్రవర్తనను బట్టి ఏ జంతువునకు ఏ పేరు పెట్టాలో నిర్ణయించబడింది. హుందాగా ఠీవిగా వుండేదానికి సింహం అని. జిత్తులమారి పనులుచేసే దానికి నక్క అని, పిచ్చిపిచ్చి పనులు చేసేదానికి కోతి అని, విశ్వాసం చూపేదానికి కుక్క అని, గొడవ మరియు గోల చేసేదానికి గాడిద" అని అన్నారు. అనగానే సభలో నిశ్శబ్దం అలుముకుంది.

# పిల్లల తెలివి

ఐదవ తరగతి చదువుతున్న సరోజిని పదేళ్ల కొడుకు దినేష్ బక్కచిక్కి మందకొడిగా వుండటం చూసి సరోజినికి ఎప్పుడూ దిగులుగా వుండేది. భోజనం కూడా సరిగ్గా చేయక పోవడం వల్ల మరింత దిగులుగా వుండేది. తన కొడుకు అందరి పిల్లల్లాగా తెలివిగా చురుకుగా వుండాలని ఎవరెవరి సలహాల మీదనో ఏవేవో టానిక్కులు, మందులు తెచ్చి ఇచ్చేది.

ఒకసారి ఎవరో ఇచ్చిన సలహా ప్రకారం బలవర్ధకమైన కాయగూరలు, ఆకుకూరలు వండి భోజనంలో వడ్డించి పెట్టింది. వాటిని చూసిన దినేష్ "ఈ ఉడకేసిన కూరలు నేను తిననంటే తినను. నాకు ఇష్టం లేదంతే!" అని ఖచ్చితంగా చెప్పేశాడు.

సరోజిని కొడుకుతో "చూడు బాబూ! ఇప్పుడు నువ్వు ఐదోతరగతి చదువుతున్నావు ఈ కాయగూరలు, ఆకుకూరలు ఎటువంటి ఆరోగ్యాన్నిస్తాయో నీకు తెలీదు. వచ్చే సంవత్సరం ఆరోతరగతికి వెళ్తే మీ టీచర్ ఆరోగ్యశాస్త్రంలో వీటి విలువ చెబుతుంది. అది విని నువ్వే ఆశ్చర్యపోతావు!" అంది.

తల్లితో "అమ్మా! వచ్చే సంవత్సరం నేను టీచర్ ద్వారా తెలుసుకుని అప్పుడు తింటాను ఇప్పుడు మాత్రం ప్రతిరోజూ వంటలు టీవీలో పిండివంటలలో ఆంటీలు చేసినట్లుగా నాకిష్టమైన వంటలు చేసి పెట్టు!" అన్నాడు దినేష్.



సరోజిని ఈ కాలం పిల్లలందరిలాగే తన కొడుక్కి కూడా ఇంత తెలివితేటలు వచ్చాయా? అనుకుని నిర్ఘాంతపోయింది.

## పిచ్చి+వెర్రి

రాజమండ్రిలోని ఉమెన్స్ కాలేజీ క్లాసురూంలోకి మొదటిసారి క్లాసు తీసుకోవటానికి అడుగుపెట్టింది లెక్చరర్ సీతాలక్ష్మి. రాగానే క్లాసులోని విద్యార్థినులతో "నాకు విజయవాడ ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కాలేజి నుండి ఇక్కడకు బదిలీ అయ్యింది. విజయవాడలోనూ ఇల్లునుండి బస్టాండుకు నాలుగు కిలోమీటర్లు. నేను ఆటోలో మా ఇంటినుండి విజయవాడ బస్టాప్‌కు వచ్చాను. విజయవాడనుండి రాజమండ్రికి రెండువందల కిలోమీటర్లు. రాజమండ్రిలో బస్టాప్‌నుండి మీ కాలేజికి ఆటోలో వచ్చాను. గేటు వద్దనుండి నలభై గజాలు నడిచి, రెండు మెట్లు ఎక్కి క్లాసురూమ్‌లోకి వచ్చాను. ఇప్పుడు నా వయస్సెంతో మీలో ఎవరైనా చెప్పగలరా?" అన్నది సీతాలక్ష్మి వింతగా.

క్లాసులో చాలాసేపు నిశ్శబ్దం అలుముకుంది. చివరికి విజయ అనే ఒక స్టూడెంట్ లేచి మీ వయస్సు ముప్ఫైసంవత్సరాలు అన్నది.

"శభాష్! ఇంత కరెక్ట్‌గా ఎలా చెప్పగలిగావ్?" ఆశ్చర్యంగా అడిగింది సీతాలక్ష్మి.

"ఏమీ లేదండి! మా తమ్ముడొకడున్నాడు. వాడి వయసు 17 సంవత్సరాలు వాడికి పావువెర్రి, సగం పిచ్చి. అందువల్ల దానికి సగం కలిపి మీ వయసు 34 అని అంచనా వేసి చెప్పాను" అంది విజయ నమ్రతగా. ఆ మాటకు సీతాలక్ష్మి నివ్వెరపోయింది.

# తెలివి

మల్లాపురం అనే గ్రామంలో ముగ్గురు స్నేహితులుండేవారు. వారు వ్యాపారం కోసం తిమ్మాపురం వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. తిమ్మాపురం వెళ్ళాలంటే ఒక పెద్ద అడవి దాటి వెళ్ళాలి. ముగ్గురు స్నేహితులు ఊరినుండి ఉదయం బయల్దేరారు. రెండు మూడు గంటల్లో వారు అడవిని చేరుకున్నారు. పోతూ పోతూ వుంటే ముగ్గురిలో ఒకడికి తాడు దొరికింది. మళ్ళీ పోతూ పోతూ ఇంకొకడికి చాట దొరికింది. అలాగే మరొకడికి గడ్డపార దొరికింది. వారు ముగ్గురూ ఒక గుడిలో నిద్రపోయారు.

అంతలో ఒక రాక్షసుడు అక్కడికి చేరుకున్నాడు. ఆ రాక్షసునికి నరవాసన వచ్చింది. ఆ వాసనను బట్టి గుడి దగ్గరకు చేరుకున్నాడు. నర వాసనను గుర్తుపట్టి ఈ గుడిలో మనుషులున్నారనుకుని "ఒరేయ్! మానవా నేనెవరినో తెలుసా.. రాక్షసుడ్నిరా! రారా బైటకు నమిలి మింగేస్తా!" అని పెద్దగా అరుస్తూ అన్నాడు రాక్షసుడు. ఆ ముగ్గురిలో ఒకడు తెలివితో "ఒరేయ్.. రాక్షసుడా..! నేనెవరో తెలుసా? నేను రాకాసుల గాంచిన గూకాసినిరా!" అన్నాడు కోపంగా అరుస్తూ "ఐతే బైటకిరా! నీ ప్రతాపం నా ప్రతాపం చూసుకుందాం!" అన్నాడు రాక్షసుడు "నేను రావటమేమిట్రా! నా గోరు చాలు నిన్ను పొడిచి చంపటానికి" అని గడ్డపారను చూపాడు. "అమ్మో! ఇంత పెద్దదా?" అని ఆశ్చర్యపోయాడు రాక్షసుడు. "నా చెవి చూడరా, నా చెవిని ఆడించానంటే గాలికే కొట్టుకు పోతావురా!" అని చాటని బైట అటూ ఇటూ ఊపాడు. గూకాసుని చెవిని చూసి వణికిపోయాడు రాక్షసుడు. "నా తోక చూడరా!" అని త్రాడుని బైటకు విసిరాడు. అంతే ఆ దెబ్బతో ఆ రాక్షసుడు వణుకుతూ అక్కడ్నుంచి పారిపోయాడు. ఆ రాత్రి ముగ్గురు స్నేహితులు హాయిగా నిద్రపోయి, తెల్లవారు జామున లేచి నడవటం మొదలుపెట్టారు.

తెలివి వుంటే ఏ పనినైనా తేలికగా సాధించవచ్చు.

# అనుభవాన్ని మించిన పాఠం లేదు

పూర్వం సవ్యసాచి అనే గురువు ఉండేవాడు. సకల శాస్త్రాలలో ఆయన పాండిత్యం కలవాడు. శిష్యుల విద్యాస్థాయిని గుర్తించి, వారి మానసిక పరిస్థితిని గమనించి విద్యపట్ల వారికి గల సితాగ్రత, పట్టుదల తదితరాలకు తగినట్లుగా ఎవరికి ఏవిధంగా బోధించాలో ఆ విధంగా బోధిస్తూ మంచి గురువని పేరు తెచ్చుకున్నాడు. ఇలా వుండగా గుణవర్మ అనే శిష్యుడు ఆయన ఆశ్రమంలోకి కొత్తగా వచ్చాడు. అతనికి ఎవరు ఏ పని చెప్పినా వెంటనే చేసే అలవాటు లేదు. అంతేగాక అతనికి అన్నీ అనుమానాలే. ఒకరోజు గురువు గుణవర్మను వెంట తీసుకుని అడవికి వెళ్ళాడు. దర్భలను సేకరించడం ప్రారంభించారు. దర్భలు జాగ్రత్తగా తుంచకపోతే చేతికి గుచ్చుకుంటాయి. అలవాటు లేని గుణవర్మ దర్భలు కోయబోయి చేతికి

గాయం చేసుకున్నాడు. "గురువుగారు దర్భలు ఎలా తుంచాలో తనకు ముందే చెప్పవచ్చుకదా!" అని మనసులో అనుకున్నాడు. వారు తిరిగొచ్చే దారిలో ఒకచోట ఎత్తునుంచి పల్లపుప్రాంతానికి దిగి నడవవలసి వచ్చింది. మామూలుగా నడుస్తూ గుణవర్మ కాలుజారి కిందకి దొర్లాడు.



గురువు పట్టి పట్టి అడుగులు వేస్తూ కిందకి చేరుకున్నాడు. అప్పుడు గుణవర్మ మళ్ళీ మనసులో ఇలాంటి ప్రదేశంలో జాగ్రత్తగా నడవాలని గురువుగారు నన్ను హెచ్చరించి వుంటే నేను పడిపోయేవాడిని కాదుకదా అని అనుకున్నాడు.

గుణవర్మ మనోగతాలు పసికట్టిన సవ్యసాచి అతనితో ఇలా అన్నాడు. "చూడు నాయనా! కొన్ని విషయాలు చెప్పిన దానికంటే అనుభవం ద్వారానే బాగా అవగతమవుతాయి. ఒకవేళ నేను ముందుగా హెచ్చరించినప్పటికీ నువ్వు దర్భవల్ల చేతిని గాయపరచుకోవనిగాని, పల్లపు ప్రాంతంలోకి జారిపడకుండా వుండగలవని గాని నాకు అనిపించలేదు. అందువల్లనే నేను మిన్నకున్నాను. ఇప్పుడు ఆ విషయాలలో అజాగ్రత్తగా వుంటే ఏమవుతుందో నీ అంతట నువ్వు స్వయంగా తెలుసుకున్నావు. కనుక ఇకపై అప్రమత్తంగా వుండగలవు. 'అనుభవాన్ని మించిన పాఠం లేదు' అని చెప్పారు.

గురువు మాటలు విన్న గుణవర్మ తన నిర్లక్ష్య ధోరణికి స్వస్తి చెప్పి ఆ తరువాత తెలివైన శిష్యుడని పేరు తెచ్చుకున్నాడు.

# అహంకారం

రామాపురంలో విష్ణుదత్తుడనే వేదాంతి వుండేవాడు. అతడు సకల కళలలోను ప్రావీణ్యం సంపాదించాడు. అయితే విష్ణుదత్తుడికి ప్రపంచంలోని వ్యక్తుల మీద నమ్మకం వుండేదికాదు. ఎవ్వరూ కూడా నిర్మల హృదయులు కారని అతడు భావించేవాడు.

ఆ విశ్వాసంతోనే అతడు లాంతరు చేతపట్టుకుని గ్రామాపురంలో తిరుగుతుండేవాడు. అతని ప్రవర్తన అందరికీ వింతగా ఉండేది. కొందరికి అతని ప్రవర్తన ఆశ్చర్యం కల్గించడంతో వారంతా వెళ్లి విష్ణుదత్తుడ్ని అసలు విషయం అడిగారు. అపుడు విష్ణుదత్తుడు "ఈ లోకంలో ఎవరైనా నిర్మల హృదయుడు వున్నాడా?" అని వెదుకుతున్నాను. ఆ అన్వేషణలో సూర్యుని కాంతి కూడా చాలకపోవడం వల్ల అదనంగా నా దీపాన్ని కూడా వెలిగించి వెదుకుతున్నాను. ఇంతవరకూ నాకు ఒక్కడూ కనిపించలేదు అని జవాబిచ్చాడు.

మహా పండితుడైన విష్ణుదత్తుడితో వాదించలేక అందరూ వెళ్లిపోయారు. విష్ణుదత్తుడు ఊరంతా తిరిగి తిరిగి గ్రామ శివారునగల ఒక పాక వద్దకు వచ్చాడు. ఆ పాకలో నివసిస్తున్న ఒక వృద్ధురాలు అతని ప్రవర్తనకు విస్తుపోతూ "అతడలా తిరగడానికి కారణమేమిటని?" ప్రశ్నించింది. దానికి విష్ణుదత్తుడు అంతకుముందు ప్రజలకు చెప్పిన సమాధానాన్ని చెప్పాడు.

దానికి వృద్ధురాలు నవ్వి "అయ్యా! ఈ మాత్రపు పనికి మీ వంటివారు ఇంత శ్రమపడాలా? లోకంలో ఎవరైనా నిర్మల హృదయులు ఉన్నారా? లేదా? అని వెదికేముందు మిమ్మల్ని మీరు ఆత్మపరీక్ష చేసుకోండి. అప్పుడు మీరు నిర్మలహృదయులుగా తోస్తే ప్రపంచంలోని వారంతా మీ హృదయానికి నిర్మలంగానే కనిపిస్తారు. మీరే నిర్మల హృదయులు కాకపోతే మిగిలిన ప్రపంచమంతా మీకు మలినంగానే కనిపిస్తుంది. ఇంతకూ ప్రపంచంతీరు మన దృష్టిమీద ఆధారపడి వుంది కాబట్టి ఇలాంటి విషయంలో ఆత్మపరీక్ష కావాలి" అని అంది.

వృద్ధురాలి మాటలు విన్న విష్ణుదత్తుడు సిగ్గుపడుతూ ఆనాటినుంచి గర్వం విడిచి తనలాగే సాటివారు కూడా మనుషులేనని గ్రహించి మామూలుగా ఉండటం నేర్చుకున్నాడు.

# దానధర్మాలు

విదర్భ దేశాన్ని విష్ణుదత్తుడు పరిపాలించేవాడు. విష్ణుదత్తుడు ప్రజలను కన్నబిడ్డల వలే సాకేవాడు. ప్రజలకు ఏ కష్టనష్టాలొచ్చినా తీర్చేవాడు. అంతకుమించి విష్ణు భక్తుడు. విపరీతంగా దానధర్మాలు చేసేవాడు. విష్ణుదత్తుడి దానధర్మాలకు కోశాగారంలో ఉన్న ధనమంతా కరిగిపోతుంది. ఇది గ్రహించిన మంత్రి విశ్వక్సేనుడు దానధర్మాలను ఆపుచేయమని, దానివల్ల ప్రజలంతా సోమరిపోతుల్లా తయారైపోతున్నారని చెప్పి చూశాడు. కాని విష్ణుదత్తుడు మంత్రి మాటలను పెడచెవిన పెట్టాడు.

ఒకరోజు విష్ణు దత్తుడు కొలువు తీరి వుండగా ఓ బ్రాహ్మణుడు అతని వద్దకు వచ్చి తను తెచ్చిన ఓ కుండకు సరిపడినన్ని వరహాలిమ్మనమని అడిగాడు. ఆ కుండకు ఓ పక్క చిల్లు వుంది.

ఇది గ్రహించని విష్ణుదత్తుడు కుండలో వరహాలు వేసి అతనికివ్వబోయాడు. కాని అతడికివ్వబోయే లోపే కుండలోని నాణాలన్నీ చిల్లునుంచి కిందకి జారిపోయాయి. ఇలా పలుసార్లు జరిగింది.

విష్ణుదత్తుడు జరిగింది తెలుసుకునే లోపే బ్రాహ్మణుడి రూపంలో వున్న విశ్వక్సేనుడు 'రాజా...నన్ను మన్నించండి' అన్నాడు.

విష్ణుదత్తుడు ఆశ్చర్యపోతూ విషయం అడిగాడు.

అప్పుడు విశ్వక్సేనుడు "రాజా చిల్లుకుండలో ఎన్ని వరహాలు వేసినా ఎలా తరిగి పోతుందో, అలాగే మితిమీరిన మీ దాన ధర్మాలవల్ల కోశాగారంలో ఉన్న డబ్బు సరిపోదు. దానధర్మాలు చేసుకుంటూ పోతే కొండలు కూడా కరిగిపోతాయి. మీ దాన ధర్మాల అలవాటుని ఆసరాగా తీసుకుని ప్రజలు సోమరిపోతుల్లా అయిపోయారు. కష్టపడి పనిచేసే వారంతా పనులు మానేసి మీరిచ్చే దాన ధర్మాల కోసం పోటీలు పడుతున్నారు" అన్నాడు.

విషయం తెలుసుకున్న విష్ణుదత్తుడు అప్పటినుంచి అడిగిన వారందరికీ దానధర్మాలు చేయడం మానేసి అవసరం వున్న వారికి మాత్రమే సహాయపడుతూ మంచివాడిగా పేరు తెచ్చుకున్నాడు.

# కలసి వుంటే కలదు సుఖం

రామయ్యకు నలుగురు కొడుకులు. ఆస్తిపాస్తులున్న రామయ్య కొడుకులు ఒకరినొకరు అస్తమానూ వాదులాడుకుంటుండేవారు. తను మరణిస్తే తన ఆస్తిపాస్తులను కాపాడే వారుండరని, రామయ్య విపరీతంగా బాధపడేవాడు.



ఒకసారి రామయ్య మిత్రుడు వీరయ్య అతని వద్దకు రాగా, తన కొడుకుల గురించి వివరంగా చెప్పాడు. దానికి వీరయ్య, రామయ్య చెవిలో ఓ ఉపాయాన్ని చెప్పి వెళ్ళి పోయాడు.

ఆ మర్నాడే రామయ్య తీవ్రంగా జబ్బుపడ్డాడు. తండ్రి అవసాన దశకు చేరుకున్నాడని అతని కొడుకులంతా రామయ్య వద్దకు వచ్చారు. అప్పుడు రామయ్య "అబ్బాయిలూ...నేను జీవితంలో ఎంతో కష్టపడి ఈ స్థితికి వచ్చాను. రేపో మాపో 'హరీ' మనే నాకు మీరో పనిచేయాలి" అంటూ నలుగురికీ నాలుగు పుల్లలు ఇచ్చి విరవమని చెప్పాడు.

నలుగురు కొడుకులూ పుల్లలు తీసుకుని అతి సునాయాసంగా విరిచేశారు. ఈసారి రామయ్య ఒక్కొక్క కొడుకుకి రెండేసి పుల్లలు చొప్పున ఇచ్చి విరవమన్నాడు.

ఈసారి పుల్లలు విరవడానికి కాస్త కష్టపడ్డారు కొడుకులు.

ఈసారి తలో కొడుక్కి మూడుపుల్లలు చొప్పున ఇచ్చి విరవమన్నాడు. మూడు పుల్లలు విరవడానికి విపరీతంగా కష్టపడాల్సి వచ్చింది. ఈసారి ఒక్కొక్క కొడుక్కి నాలుగు పుల్లలు ఇచ్చి విరవమన్నాడు. పుల్లలు తీసుకుని విరిచే ప్రయత్నం చేసి విఫలమయ్యారు కొడుకులు. అప్పుడు రామయ్య చిరుమందహాసం చేస్తూ "చూశారా...అబ్బాయిలూ...మీరు ఒక పుల్లను అతి సునాయాసంగా విరిచేశారు. నాలుగు పుల్లలను అస్సలు విరవలేకపోయారు. అంటే మీరు ఒకరిమీద ఒకరు వాదులాడుకుంటూ ఎవరిమట్టుకు వారు బతికితే మిమ్మల్ని మన శత్రువులు అతి సునాయాసంగా మట్టుపెట్టగలరు. అందరూ కలసి కట్టుగా వుంటే మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరన్న విషయాన్ని మీరు గమనించారా...కనుక ఇప్పటికైనా మీరు ఒకరిమీద ఒకరు వాదులాడుకోవడం మానేసి కలిసికట్టుగా వుండి మన ఆస్తిపాస్తుల్ని కాపాడండి' అంటూ వివరించాడు. అంతే ఆనాటినుంచి రామయ్య కొడుకులు కలసిమెలసి జీవించడం మొదలుపెట్టారు.

తన కొడుకుల్ని ఎలా కలపాలనే సమయంలో తన మిత్రుడు వీరయ్య ఇచ్చిన సలహాకు మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పకున్నాడు రామయ్య.

# చిలక చాతుర్యం

భువనగిరి రాజ్యాన్ని విజయవర్మ అనే రాజు పరిపాలించేవాడు. ఆయనకు శిల్ప కళంటే ప్రాణం. తన  రాజ్యంలోని గొప్ప గొప్ప శిల్పులచేత అద్భుతమైన శిల్పాలు చెక్కించి, వాటిని వివిధ ప్రదేశాలలో అమర్చి ఆనందించేవాడు. అంతేకాదు ప్రతీ ఏడూ శిల్ప విద్యలో అత్యంత నైపుణ్యం ప్రదర్శించిన శిల్పిని ఘనంగా సత్కరించేవాడు. ప్రతి సంవత్సరం లాగే, ఆ సంవత్సరం కూడా శిల్పకళా పోటీలను ఏర్పాటు చేశాడు. విజయవర్మ ప్రకటనను చూసి చాలామంది శిల్పులు తమ శిల్పాలను పోటీకి తెచ్చారు.

రకరకాల పరీక్షల తర్వాత మూడు శిల్పాలు మాత్రం చివరిస్థాయి వరకూ వచ్చాయి. ఆ మూడింటిలో ఏది గొప్ప శిల్పమో రాజుగారికి అంతుపట్టలేదు. సమస్య తేలక పోవడంతో రాజు మంత్రి సహాయాన్ని కోరాడు. మంత్రి ముందుగా ఆ శిల్పాలను చూడాలని కోరడంతో, రాజు తాను ఎంపిక చేసిన మూడు శిల్పాలను ఉంచిన ఉద్యానవనంలోకి మంత్రిని తీసుకెళ్లి



చూపించాడు. మూడు శిల్పాలను చూసిన మంత్రిగారికి నోటమాట రాలేదు. ఏది ఉత్తమ కళాఖండమో తేల్చడం సాధారణమైన విషయం కాదని అనిపించిందతనికి.

ఒక శిల్పానికి మించింది మరొకటి - ఎలా తేల్చడం? మంత్రి ఆలోచిస్తుండగా ఒక చిలక వచ్చి ఒక శిల్పం మీద వాలింది. వెంటనే మంత్రిగారికి ఒక ఆలోచన వచ్చింది. 'మహారాజా...ఈ మూడో శిల్పమే అత్యద్భుతమైన శిల్పం' అన్నాడు మంత్రి మాటలతో తన బరువు తీరిందని రాజు సంతోషించాడు. కానీ మంత్రి మూడోశిల్పమే గొప్పదని ఎలా చెప్పగలిగాడో రాజుకు అర్థంకాలేదు. ఆ విషయాన్నే మంత్రిని అడిగాడు. దానికి మంత్రి అడిగాడు. దానికి మంత్రి 'మహారాజా! ఇందులో నా గొప్పతనం ఏమీలేదు. అంతా చిలక గొప్పతనమే. చిలక మూడోశిల్పంపైన వాలడంతో నేను దాన్నే గొప్పదిగా మీకు చెప్పాను. మూడో శిల్పమైన యువతి చేతిలో ఉన్న చిలక బొమ్మను నిజమైన చిలకగా భావించి ఈ చిలక దాని దగ్గరకు చేరింది. మనుషులనే కాకుండా పక్షులను కూడా మైమరిపించగలిగిన శిల్పం అత్యద్భుతమైందని నా ఉద్దేశం అని మంత్రి వివరించి చెప్పడంతో రాజు సంతోషించాడు. మూడో శిల్పమే గొప్పదని ప్రకటించాడు. అనంతరం ఆ శిల్పాన్ని చెక్కిన శిల్పిని ఘనంగా సత్కరించాడు.

# అంతా మన మంచికే

విదర్భ దేశాన్ని విష్ణుకేతుడు పరిపాలిస్తుండేవాడు. ప్రజలను కన్నబిడ్డలవలె సాకేవాడు. ఆ దేశ మహామంత్రి విష్ణుశర్మ. విష్ణుశర్మ మహామేధావి. అతనికి రాజు మాటలంటే ఎంతో గౌరవం వుండేది. విష్ణుశర్మ ప్రతి పనికి 'అంతా మన మంచికే' అంటూండేవాడు. ఇది రాజుకు సుతారమూ ఇష్టముండేదికాదు.

ఒక రోజు విష్ణుకేతుడు ఒరలోంచి కత్తిదూయబోయి తన వేలిని కోల్పోయాడు. రక్తం ధారలై ప్రవహించింది. ఇది గ్రహించిన విష్ణుశర్మ మామూలు ధోరణిలో 'అంతా మన మంచికే' అన్నాడు.

విష్ణుశర్మ మాటలకు మండిపడ్డ రాజు వెంటనే అతనిని చెరసాలలో పెట్టించాడు. చెరసాలలో పెట్టిన అనంతరం కూడా విష్ణుశర్మ 'అంతా మన మంచికే' అన్నాడు. ఇలా రోజులు

గడుస్తున్నాయి. ఒకసారి విష్ణుకేతుడు వేటకు వెళ్ళాడు. చాలాకాలం తర్వాత వెళ్ళాడేమో విపరీతంగా వేటాడి అలసిపోయాడు.

వేటలో ఒక మృగం అతడ్ని నానా తిప్పలు పెట్టింది. చివరికి దానిని వేటాడి వస్తున్న విష్ణుకేతుడు ఓ కొండజాతివారి కంటపడ్డాడు.

అనాగరికులైన ఆ కొండజాతివారు తమ గూడెం దేవతకు బలివ్వడానికి మనిషికోసం వెతుకుతున్నారు.

రాజును చూడగానే వారు ఎగిరి గంతేసి, అతనిని బంధించి తమ గూడేనికి తీసుకుని పోయారు. అయితే రాజుకి వేలు తెగి వుండటాన్ని చూచి వారు రాజును బలివ్వకుండానే వదిలి వేశారు.

రాజు తనకు వేలు లేకపోవడం వల్లే తన ప్రాణాలు క్షేమంగా వున్నాయని గ్రహించాడు. సరిగ్గా ఇదే సమయంలో రాజుకు మంత్రి విష్ణుశర్మ మాటలు గుర్తొచ్చాయి.

అతడు వెంటనే తన రాజ్యానికి వెళ్ళి విష్ణుశర్మను కారాగారంనుంచి విడిపించి "మంత్రీ.. అజ్ఞానంతో నా వేలు తెగినపుడు, మిమ్మల్ని చెరశాలలో పెట్టినపుడు మీరు 'అంతా మన మంచికే' అని అనడంలో అంతర్యమేమిటని అడిగాడు.

దానికి విష్ణుశర్మ "రాజా... మీకు వేలు తెగబట్టేకదా మిమ్మల్ని వికలాంగుడనుకుని బలివ్వకుండా కొండజాతివారు వదిలేసింది" అన్నాడు.

"మరి మిమ్మల్ని చెరశాలలో పెట్టినపుడు కూడా 'అంతా మన మంచికే' అన్నారు. దాని అంతర్యమేమిటని అడిగాడు.

"రాజా...నన్ను చెరశాలలో పెట్టకపోయి వుంటే ఆ కొండజాతివారు మిమ్మల్ని వదిలి, అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న నన్ను బలి ఇచ్చేవారు. నన్ను చెరశాలలో ఉంచబట్టే నా ప్రాణాలు రక్షింపబడ్డాయి. కనుక ఏదైనా జరిగితే అది మన మంచికోసమే జరిగిందను కుని భావించి జీవించాలి తప్ప, జరిగిన దానిని గురించి ఆలోచించి కృంగి పోకూడదు' అని ముగించాడు.

మంత్రి మాటల్లోని అంతర్యాన్ని గ్రహించిన రాజు అతని దూరదృష్టికి మెచ్చుకున్నాడు.

# రాజధర్మం

కుంతల దేశపు చక్రవర్తి వీరసేనుడు. అతడు తాను జయించిన రాజ్యాలను సమర్థులైన వారికి అప్పగించి, వారిని తన సామంతులుగా చేసుకునేవాడు. ఒకసారి వీరసేనుడు విదర్భదేశాన్ని జయించి ఆ రాజ్యానికి సామంతరాజు అర్హతలుగల యువకుడికోసం అన్వేషిస్తున్నాడు. తన ఆస్థానంలో వీరవర్మ, రఘువర్మ అనే ఇద్దరు యువకులుండే వారు. వారిద్దరూ చతురంగ విద్యలలోనూ, తెలివితేటల్లోనూ ఆరితేరినవారే. వీరసేనుడు వీరవర్మ, రఘువర్మలలో ఒక్కరికి విదర్భదేశ రాజ్య భారాన్ని అప్పగించాలనుకుంటున్నాడు. అయితే ఇద్దరిలో ఎవరు రాజపదవికి అర్హులో తేల్చుకోలేకపోయాడు. చివరికి తన నిర్ణయం తన

మంత్రికి చెప్పాడు. మంత్రి ఒక ఉపాయం ఆలోచించి వీరవర్మను పిలిచి, 'నీవు రాజువైన అనంతరం నీ అధికారాన్ని ఎలా ఉపయోగిస్తావు?" అని ప్రశ్నించాడు.

దానికి వీరవర్మ జవాబు చెబుతూ "రాజనేవాడు అతి శక్తివంతుడు. అతని మాటకు తిరుగులేదు. అందువల్ల శాసనాలను ఖాతరు చేయని ప్రజలు తలలు వంచడానికి నా అధికారాన్ని ఉపయోగిస్తాను" అన్నాడు.

మంత్రి వీరవర్మను పంపించేసి రఘువర్మకు అదే ప్రశ్న వేశాడు. దానికి రఘువర్మ సమాధానం చెబుతూ "రాజనేవాడు ప్రజలకు తండ్రిలాంటివాడు. అందువల్ల నా అధికారంతో నేను చేసిన శాసనాలు ప్రజలనెత్తిన రుద్దడానికి ప్రయత్నించకుండా ప్రజల ప్రేమానురాగాలు సంపాదించడానికి నా అధికారాన్ని ఉపయోగిస్తాను" అని ముగించాడు.

ఇద్దరి సమాధానాలు విన్న మంత్రి రఘువర్మను ఎన్నికచేసి వీరసేనుడికి వివరించాడు.

మంత్రి తెలివితేటలకు వీరసేనుడు భేష్ భేష్ అంటూ మెచ్చుకున్నాడు.

# అత్యాశ

విష్ణుదత్తుడనే బ్రాహ్మణుడు కటిక దరిద్రంతో బాధపడేవాడు.

గంపెడు సంతానంతో, వారికి కడుపునిండా తిండి పెట్టలేక మదనపడుతూ వుండే వాడు. విష్ణుదత్తుడు శివభక్తుడు. శివుడ్ని నిత్యం ఆరాధిస్తుండేవాడు.

అయితే రోజులు గడుస్తున్న కొద్దీ విష్ణుదత్తుడి కుటుంబ పరిస్థితిలో ఎలాంటి మార్పూ కనిపించకపోయేసరికి, విష్ణుదత్తుడు కోపోద్రేకుడై తన ఆర్థిక పరిస్థితులను మార్పు చేసుకోవడానికి, అడవికి వెళ్లి శివుడి కోసం ఘోరంగా తపస్సు చేశాడు.

విష్ణుదత్తుడి తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై "విష్ణు దత్తా.. నీ తపస్సుకు మెచ్చాను. ఏం వరం కావాలో కోరుకో?" అన్నాడు.

దానికి విష్ణుదత్తుడు "మహానుభావా.. నా గురించి, నా కుటుంబ పరిస్థితుల గురించి నీకు తెలియని దేముంది? కనుక నేను నిన్ను ఒకే ఒక వరం కోరుకోదలిచాను' అన్నాడు.

దానికి శివుడు, "కోరుకో.." అన్నాడు.

"మీ దేవతల దృష్టిలో కోటిరూపాయలు ఎంతకి సమానం?" అనడిగాడు విష్ణుదత్తుడు శివుడ్ని.

'కోటిరూపాయలు మాకు ఒక్క పైసాతో సమానం' అని చెప్పాడు శివుడు.

"అయితే నాకు అలాంటి పైసా నొకదానిని అనుగ్రహించండి.. ప్రభూ.." అంటూ అడిగాడు విష్ణుదత్తుడు.

'తథాస్తు' అంటూ శివుడు అదృశ్యమయ్యాడు.

# ఓర్పే శ్రీరామరక్ష

గంగాపురంలో భూషయ్య అనే వ్యాపారి వుండేవాడు. భూషయ్య ఎల్లప్పుడూ అయిన దానికి కాని దానికి నిరుత్సాహపడుతూ వుండేవాడు. భూషయ్య ఏ రోజు వ్యాపారం సరిగా జరగకపోతే ఆ రోజు నిరుత్సాహపడిపోతూ, అందరిమీద కోపంతో విరుచుకు పడేవాడు. రాను రాను ఈ అలవాటు భూషయ్యకు వ్యసనంగా మారి అతడ్ని తీవ్రంగా వేధించసాగింది.

నిరుత్సాహాన్ని భరించలేక భూషయ్య, అక్కడికి సమీపంలో ఉన్న ఓ ఆశ్రమానికి వెళ్ళి జ్ఞానానందుడనే మహర్షి వద్ద తన బాధ చెప్పుకుని తనకు నిరుత్సాహం పోయే మార్గాన్ని సూచించమని ప్రాధేయపడ్డాడు.

భూషయ్య మాటలు విన్న జ్ఞానానందుడు చిరుమందహాసం చేస్తూ "నాయనా! సముద్ర ప్రవాహానికి ఆటు పోటులు ఎలా సహజమో, అదేవిధంగా మానవజీవితంలో సుఖదుఃఖాలు, మంచి, చెడ్డలు, ఉత్సాహ, నిరుత్సాహాలు సహజం. ఆనందం, విచారం వంటి మనోవికాసాలకు లొంగిపోతే అవి మనల్ని కృంగదీస్తాయి. మన కోర్కెలను అదుపులో పెట్టుకుని హాయిగా జీవించడానికి ప్రయత్నించు. జీవితంలో ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా ఓర్పుతో ధైర్యంగా జీవిత సమస్యలను ఎదుర్కొంటే, జీవితంలో నిరుత్సాహ మనేదే ఉండదు. పైగా ఉత్సాహంతో కొత్త కొత్త విజయాలను సాధించగలవు' అని బోధించాడు.

జ్ఞానానందుని మాటల్లోని అసలు విషయాన్ని తెలుసుకున్న భూషయ్య ఆనాటినుంచి నిరుత్సాహాన్ని వదిలి, ఉత్సాహంతో మరింతగా కృషి చేసి తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నాడు.

# విలువ

భూషయ్య, రామయ్య ఒకే ఊరువారు.

భూషయ్య ఆ చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ మోతుబరి. రామయ్యకు మాత్రం రెండెకరాల భూమి మాత్రం వుంది.

భూషయ్యకు ఆ చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ తనే ధనవంతుడినన్న గర్వం వుండేది. దీనితో అతడు అందర్నీ తక్కువచేసి మాట్లాడేవాడు. రామయ్య మాత్రం ప్రతి ఒక్కరితో పేద, గొప్ప భేదం లేకుండా కలసికట్టుగా వుండేవాడు. అందువల్ల రామయ్య మాటంటే చెవి కోసుకునేవారు. భూషయ్య మాటంటే అయిష్టత చూపేవారు.

ఒకసారి ఆ ఊరిలో జరిగిన ఓ గొడవకి రామయ్యని పెద్దమనిషిగా పిలిచారు. అది విన్న భూషయ్యకు చిర్రెత్తి పోయింది. ధనవంతుడు, మోతుబరి అయిన తనను పిలవకుండా పేదవాడైన రామయ్యను పిలిచినందుకు భూషయ్య అహం దెబ్బతింది. ఆ మర్నాడు భూషయ్య, రామయ్యను తనింటికి పిలపించి "నేను నీ కన్నా ధనవంతుడ్ని పలుకుబడి గలవాడ్ని అయినప్పటికీ జనం అంతా నీకే వంగి నమస్కారాలు చేయడానికి కారణమేమిటి?" అని అడిగాడు.

దానికి రామయ్య మందహాసం చేస్తూ 'చూడు భూషయ్యా..నీవు గ్రామంలో అందరికన్నా ధనవంతుడవు. కాని నీవు ధనముందన్న అహంకారంతో అందరూ నీ చెప్పు చేతల్లో ఉండాలని కోరుకునే మనస్తత్వం కలవాడవు ఇతరులను నీవు చీదరించుకున్నప్పుడు, ఇతరులు కూడా నిన్ను తక్కువగా చూడడంలో తప్పు లేదుగా కాని నేను మాత్రం పనివాడితో కూడా కలసికట్టుగా ఉండటం వల్ల నా మంచితనాన్ని గుర్తించివారంతా నాకు గౌరవం ఇస్తున్నారు. ఇంకో విషయం చెప్పనా...బెల్లం చుట్టూ ఈగలు మూగాయంటే ఆ బెల్లం తీయగా ఉండబట్టేగా.. తీపిలేని బెల్లం చుట్టూ ఈగలు ఎలా ముసరవో, డబ్బున్నా మనస్సు లేని మనిషి దగ్గరికి జనం కూడా రారు. విలువ అనేది మన మంచితనాన్ని బట్టిగాని, ధనాన్ని బట్టి పెరగదని తెలుసుకో" అంటూ ముగించాడు

విషయం తెలుసుకున్న భూషయ్య అందరితో కలసికట్టుగా ఉండటం నేర్చుకుని, అందరిచేత మంచివాడనిపించుకున్నాడు

# అద్దం

రామాపురంలో వజ్రగుప్తుడనే ధనిక వర్తకుడుండేవాడు. అతనికి సోమదత్తుడనే కొడుకు వుండేవాడు. సోమదత్తుడు గారాబంగా పెరగడం వల్ల యుక్త వయసు వచ్చేసరికి సోమరిగా, వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలకు డబ్బును మంచినీరులా ఖర్చు చేస్తుండేవాడు. కొడుకును మార్చడానికి వజ్రగుప్తుడు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

ఆ సమయంలో హిమాలయాలనుంచి ఒక ముని రామాపురానికి వచ్చాడు. ముని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించేవాడు. ముని మహిమ గురించి తెలుసుక్న వజ్రగుప్తుడు అతనిని తన ఇంటికి పిలిపించి తన కొడుకు ప్రవర్తన గురించి చెప్పి, బాధపడ్డాడు.



ముని వజ్రగుప్తుని కొడుకుతో "నాయనా! ఏ పనీ చేయకుండా కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయి. అలాగే ఉన్న ధనాన్ని వ్యసనాలకు వినియోగిస్తే ఏమీ మిగలదు. నీ తండ్రి చేసే వ్యాపారంలో పాల్గొని, మంచిపేరు తెచ్చుకో" అని హితవు పలికాడు.

ఆ మాటలకు సోమదత్తుడు "స్వామీ..! మా తండ్రి లెక్కలేనంత ఆస్తి సంపాదించాడు. అందువల్ల నేను సంపాదించాల్సిన అవసరం లేదు కదా. అలాగే ఉన్న ధనాన్ని అనుభ

వించడంలో తప్పేముంది?" అని సమాధానం చెప్పాడు. అపుడు ముని సోమదత్తుడి వైపు చూస్తూ ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా సంచినుంచి ఒక పొట్లం తీసి "నాయనా.. సాయిబాబా గుడినుంచి తీసుకొచ్చిన ధుని ఇది. కొంచెం నుదుటన గుండ్రంగా వచ్చేటట్లు దిద్దుకో" అని అన్నాడు.

అనంతరం సోమదత్తునితో "విభూతి బొట్టు స్పష్టంగా వచ్చిందా?" అని అడిగాడు ముని.

"నా నుదురుపై బొట్టు నాకెలా కనిపిస్తుంది? అద్దంలో చూస్తేగాని తెలియదు" అంటూ సోమదత్తుడు అద్దంలో చూసుకుంటూ విభూతి బొట్టును గుండ్రంగా వచ్చేటట్లు సరిదిద్దుకున్నాడు. అపుడు ముని చిరుమందహాసం చేస్తూ 'చూడు..నాయనా! మనకు కనిపించని నుదుట విభూతి మాదిరిగానే మనలోని దురలవాట్లు, తప్పులు మనకు తెలియవు. మన మంచికోరే ఆప్తులకే తెలుస్తాయి. అంటే వారు మన నడవడికను సరిదిద్దుకోడానికి అద్దంలాంటివారు. కనుక మన క్షేమం కోరి చెప్పేవారి మాటలను విని జీవితాన్ని సరిదిద్దుకోవాలి' అని బోధించాడు.

ముని మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించిన సోమదత్తుడు ఆనాటినుంచి తన ప్రవర్తనను మార్చుకుని అతి తక్కువ కాలంలోనే యోగ్యుడనిపించుకున్నాడు.

# శకునం

రామాపురంలో నివసించే సుబ్బన్న ఒక కిరాణా వర్తకుడు. సుబ్బన్నకి మూఢ నమ్మకాలు ఎక్కువ. ఓ రోజు ఉదయం సుబ్బన్న తల్లికి ఒంట్లో బాగోలేదని కబురు వచ్చింది. కబురు విన్న సుబ్బన్న హుటాహుటిన ప్రయాణమై బయలుదేరేసరికి నల్లపిల్లి ఎదురు వచ్చింది. అసలే మూఢనమ్మకాలున్న సుబ్బన్న వెంటనే తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు.

"అదేమిటండీ! తిరిగొచ్చారు మీ అమ్మగారికి ఆరోగ్యం సరిగ్గా లేదటగా" అంది భార్య శారద.

దానికి సుబ్బన్న "బాగోలేదని నాకు తెలుసు కాని బయలుదేరేముందు నల్లపిల్లి ఎదురొచ్చింది. అందుకే ప్రయాణం వాయిదా వేసుకొన్నాను" అన్నాడు.

"నల్లపిల్లి ఎదురు రావడమేమిటి? ప్రయాణం వాయిదా వేసుకోవడమేమిటి?" అంది శారద విస్తుపోతూ.

"నీకు తెలుసో తెలీదో నల్లపిల్లి ఎదురొస్తే అన్నీ అరిష్టాలే జరుగుతాయట" అన్నాడు సుబ్బన్న భర్త ప్రవర్తనకి మనస్సులోనే నొచ్చుకుంది శారద.

ఆ మరునాటి ఉదయం తన తల్లి ప్రాణాపాయస్థితిలో వుందని కబురొచ్చింది సుబ్బన్నకి సుబ్బన్న కళ్లనీళ్ళు పెట్టుకుంటూ మరలా బయలుదేరేసరికి ఒక విధవరాలు ఎదురొచ్చింది.

"ఛీ...ఛీ..ఎంత అపచారం? విధవ ఎదురొస్తే అన్నీ నష్టాలే జరుగుతాయట!" అని ఆ రోజు కూడా తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు. ఆ మర్నాడు సుబ్బన్న తల్లి

చనిపోయిందని కబురొచ్చింది. తల్లి మరణవార్త వినగానే సుబ్బన్న ఆలోచనలో పడ్డాడు. వెంటనే అతడు తల్లి దగ్గరకు బయలుదేరే సమయంలో కట్టెలూ, నూనె ఎదురొచ్చాయి. అవి ఎదురొచ్చేసరికి సుబ్బన్న మనసు మరలా కీడును సూచించింది. అయినప్పటికీ తల్లి చనిపోయినా మూఢునిలా వెళ్లలేదని అందరూ చివాట్లు పెడతారని, తన తల్లి దగ్గరకు వెళ్ళాడు.

సుబ్బన్న వెళ్ళేసరికి తల్లి ఆనందంగా తిరుగుతూ కనిపించింది. అది చూసి సుబ్బన్న తల్లిని అసలు విషయం అడిగాడు.

"నీవిలా మూఢనమ్మకాలతో మగ్గిపోతున్నావని తెలిసి నేనే నాకు ఒంట్లో బాగాలేదని కబురు పంపించాను. మొదటి రెండురోజులు నేను చావు బతుకుల మధ్య ఉన్నానని తెలిసి కూడా కేవలం నీ మనసులో పాతుకుపోయిన మూఢనమ్మకాల వల్ల నా దగ్గరికి రాలేకపోయావు. నీ విషయం, నీకు కబురుపంపిన వ్యక్తి ద్వారా తెలుసుకున్న నేను, ఈ రోజు మరణించానని కబురు పంపించాను. నిజానికి నీకు నేనే ప్రతిరోజూ ఎదురు కల్పించింది. ఈ రోజు నాకోసం కాకపోయినా పరులకోసం ఇక్కడికి వచ్చావు. ఇప్పుడు చెప్పు నీవు వచ్చేటప్పుడు పుల్లలు, నూనె ఎదురొచ్చాయి. నీకేమైనా నష్టమొచ్చిందా? ఎప్పుడు ఎలా ఏం జరగాలంటే అది జరుగుతుంది. అంతేకాని వచ్చే ఎదురే మనకి నష్టాన్ని, లాభాన్ని తెస్తుందని ఊహిస్తే అది మూర్ఖత్వమే అవుతుంది" అని ముగించింది.

విషయం గ్రహించిన సుబ్బన్న మూఢనమ్మకాలను మరచి మామూలుగా బతకడం మొదలుపెట్టాడు.

# గురుదక్షిణ

సిద్ధ మహాముని ఆశ్రమంలో శూరసేనుడు, రఘువీరుడు, గుణశేఖరుడు అనే శిష్యులుండే వారు. సిద్ధుడు ముగ్గురికి తన విద్యలన్నింటినీ నేర్పి, వారు అన్ని విద్యలలోనూ ఆరితేరే విధంగా తర్ఫీదు ఇచ్చాడు.

కాలం గడుస్తోంది. సిద్ధుని వయసు పెరుగుతోంది. వృద్ధాప్యం రావడంతో ఆశ్రమ బాధ్యతలను నిర్వహించలేక తన బాధ్యతలను తన శిష్యులలో ఒకరికి అప్పగించాల నుకున్నాడు. అయితే ముగ్గురు శిష్యులలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు. సరైన సమర్థుడైన శిష్యుడు మాత్రమే ఆశ్రమ బాధ్యతలు నిర్వహించగలడని సిద్ధుడికి తెలుసు. అందువల్ల ఓ ఉపాయం ఆలోచించి శిష్యుల్ని పిలిచి, "నాయనలారా... ఇంతకాలం మీకు శిక్షణ ఇచ్చి, నాకు తెలిసిన విద్యలన్నీ నేర్పాను. కాని, నాకు కూడా వృద్ధాప్యం వచ్చేసింది. అందువల్ల నేను పోయేలోగా నాకు మీరు గురుదక్షిణగా ఓ బతికిన లేగదూడను చంపి దాని రక్తాన్ని నాకు గురుదక్షిణగా ఇవ్వాలి' అన్నాడు.

దానికి శూరసేనుడు, రఘువీరుడు "స్వామీ... మీరు చెప్పినట్లుగా, మీకు గురుదక్షిణ సమర్పిస్తాం...మాకు సెలవీయండి...అంటూ లేగదూడ రక్తాన్ని తీసుకురావడానికి వెళ్ళిపోయారు.

గుణశేఖరుడు మాత్రం సిద్ధుడి వద్ద మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు సిద్ధుడు గుణశేఖరుడితో "నాయనా... నీవు గురుదక్షిణ ఇవ్వవా? నీ స్నేహితులిద్దరూ, గురుదక్షిణ ఇవ్వడానికి వెళితే నీవు మాత్రం మౌనంగా ఉన్నావేమిటని" అడిగాడు.

దానికి గుణశేఖరుడు "గురువర్యా... నన్ను క్షమించండి. నేను మీకు గురుదక్షిణ ఇవ్వలేని స్థితిలో ఉన్నాను" అన్నాడు విలపిస్తూ.

"ఏ...ఎందుకు నాయనా...?" అనడిగాడు సిద్ధుడు.

"మీరు చెప్పినట్టు గురుదక్షిణ యివ్వవచ్చు. కానీ అది మరో ప్రాణికి హాని తలపెట్టేదిగా ఉంది. ఒక ప్రాణిని నిర్దాక్షిణ్యంగా చంపి, మీకు గురుదక్షిణ ఇచ్చేకన్నా, గురుదక్షిణ ఇచ్చుకోలేని నిస్సహాయుడనని అనిపించుకోవడమే నాకు మనశ్శాంతిని కలుగజేస్తుంది. కనుక నా తప్పిదాన్ని మన్నించండి మహాత్మా..." అని ప్రాధేయపడ్డాడు.

ఆ మాటలకు సిద్ధుడు ఆనందపారవశ్యం చెందుతూ "లే...నాయనా లే... యోగనేవాడు సమస్త ప్రాణులయందు దయా, ప్రేమా కలిగిఉండాలి. ఇతర ప్రాణులకు హాని తలపెట్టకుండా పరోపకారం చేయువాడే నిజమైన యోగిపుంగవుడు. నిజానికి మీలో యోగ్యుడైన వాడిని ఎన్నిక చేయడం కోసమే నేనీ పరీక్ష పెట్టాను. నేను ఊహించిన అర్హతలన్నీ నీలో ఉన్నాయి. నీవు మాత్రమే ఆశ్రమ బాధ్యతలను నిర్వర్తించగలవు. కనుక ఈనాటినుంచి నువ్వే ఆశ్రమ బాధ్యతలు నిర్వర్తించు.." అంటూ దీవించాడు.

# ఏకాగ్రత

భద్రాచలానికి దగ్గరలో గోదావరి నదీతీరానగల ఓ గ్రామంలో ఒక రామయ్య శాస్త్రి ఉండేవాడు. ఆయన సకల శాస్త్రాలు చదివిన ఉద్దండపిండమే గాని లౌకిక జ్ఞానం లేనివాడు. ఎప్పుడూ పూజలు, పునస్కారాలు, యజ్ఞాలు, యాగాలు అంటూ కాలం గడిపేవాడే కాని ప్రజల మధ్య మసలుకున్నవాడు కాదు. పిత్రార్జితమైన ఆస్తిపాస్తులు. పాడిపంటలకు లోటుండేది కాదు.

ఆ రామయ్య శాస్త్రి యజ్ఞం ఒకటి తలపెట్టాడు. అందుకు ఒక మేక కావలసి వచ్చింది. దానిని తెచ్చిపెట్టేవారెవరూ దొరకకపోవడం వల్ల కొని తెచ్చుకునేందుకు బయలుదేరాడు. ప్రక్క గ్రామంలోని గొల్లవీధిలోనికి వెళ్ళి ఓ చక్కని నల్లటి మేక నేరుకొని, దానికి వాడడిగిన ధరయిచ్చి కొన్నాడు. పై మీద అంగవస్త్రంతో దాన్ని కట్టి పట్టుకొని తోలుకుంటూ తన స్వగ్రామమునకు బయలుదేరాడు.

మేకను తోలుకుంటూ వస్తున్న ఆ బ్రాహ్మణ్ణి నలుగురు దొంగలు చూశారు. ఆ మేకమీద వాళ్ళకు ఆశ కలిగింది. ఆ బ్రాహ్మణుడి నుండి దాన్ని అపహరించి దాన్ని చక్కగా వండుకుని

తినాలనుకున్నారు. అందుకని బ్రాహ్మణ్ణి బెదిరించడం, నిర్బంధించడం, దోచుకోవడం దేనికి? మాటలతోనే మేకను కాజెయ్యాలని పన్నాగం పన్నారు.

ఆ రామయ్య శాస్త్రి కంటే ముందుకుపోయి ఆ మార్గమధ్యంలో నలుగురు నాలుగుచోట్ల కాపుకాచుకున్నారు. మేకను తోలుకుంటూ వెడుతూ బ్రాహ్మణుడు దగ్గరకు రావడంతో మొదటి దొంగ ఎంతో వినయంగా దండం పెట్టి "ఏంటిటీ పంతులుగారూ! నల్ల కుక్కను పట్టుకుపోతున్నారు" అని తన త్రోవన తాను వెళ్ళిపోయాడు. రెండవ దొంగను సమీపించేసరికి అతడు రామయ్యశాస్త్రితో కలసి అడుగులు వేస్తూ "అవునుగానీ అయ్యగారు ఈ కుక్క నెక్కడ్నించి తీసుకెడుతుండారండీ" అని తన దారిని తాను వెళ్ళిపోయాడు. రామయ్యకి వీడు కూడా దీన్ని కుక్కే అన్నాడేమిటా అని నడుస్తూనే దాన్నొకసారి ఎగాదిగా చూచాడు. మరికొంతదూరం నడిచేసరికి మూడవ దొంగ ఎదురుపడి "ఏమండోయ్! బ్రాహ్మడు గారూ! కుక్క పట్టుకు పోతుండారు. దానితోటి తమకేటి పనండి అయినా బ్రాహ్మణులు కుక్కను ముట్టుకోవచ్చునటండి" అని అతడూ వెళ్ళిపోయాడు.



"అరరే! వీడు కూడా దీన్ని కుక్కనే అంటున్నాడు. ఇది కుక్క కాకపోతే వీళ్ళంతా అలాగే ఎందుకంటారు మరి గొల్ల నమ్మకంగానే ఇచ్చాడు. నేనేమన్నా మోసపోయానా?" అనుకుంటూ నడుస్తున్నాడు. అంతలో, నాల్గో దొంగ కలుసుకుని "ఇదేంటండి కర్రి కుక్క పట్టుకెళ్తున్నారు తమ కెందుకండిది మీ ఊరోళ్లు చూస్తే కుక్కను ముట్టుకున్నారని తప్పట్టరా యేటి?" అని ముందుకు వెళ్ళిపోయాడు.

"వీడు కూడా దాన్ని కుక్కనే అంటున్నాడు. కుక్క కాకపోతే ఇంతమంది అదేమాట అంటారా! దీన్ని ముట్టుకుని నేను మైలపడ్డాను. గొల్లడు నన్నెంత మోసం చేసాడు. తెలిసినవాళ్ళ నెవర్నయినా పంపించి మేకనే కొనిపించుకోవాలి. ఈ కుక్క నాకెందుకు? దీనితో ఊళ్ళోకడితే నలుగురూ గేలిచేసి తప్పుపడతారు" అని తర్కించుకుని అంగవస్త్రం విప్పి ఆ మేకను వదిలివేశాడు. గోదావరిలో స్నానంచేసి ఇంటికి చేరుకున్నాడు.

అలా వదిలేసిన మేకను, వెనకనే వస్తున్న దొంగలు నలుగురు కలిసి పట్టుకొని బ్రాహ్మడి తెలివితక్కువతనానికి నవ్వుకుంటూ తీసుకొని వెళ్లిపోయారు.

నలుగురాడింది వేదమనుకునే విజ్ఞానునికిల్లాంటి భంగపాటే జరుగుతుందంటారు.

ఒకే మాటమీద కలిసికట్టుగా నిలబడితే ఎలాంటివారినైనా ఒప్పించవచ్చు. ఎలాంటి పనినయినా సాధించవచ్చు.


# గర్వం

కాకులు దూరని కాకారణ్యంలో ఒక చెవులపిల్లి, తాబేలు ఉంటుండేవి అడవిలో గల జంతువులన్నింటిలో తానే గొప్పదాన్నని కుందేలుకు ఎంతో గర్వం. సాటి జంతువులకు దాని ప్రవర్తన మాటలు అంతగా నచ్చేవికావు.



తన అంతటి చురుకైన జంతువుగాని, వేగంగల జంతువుగాని తెలివితేటలుగల జంతువుగాని మరొకటి లేదని తనను తాను తెగ పొగడు కుంటుండేది. అతి మెల్లగా నడిచే తాబేలును చూస్తే ఆ కుందేలు కెంతో లోకువ "ఏంటో తాబేలు బావా! నాతో పరుగు పందెం వేస్తావేంటి?" అంటూ వెటకారం చేసింది. పాపం ఆ తాబేలు యేమీ అనేదికాదు. ఇలా అంటుండడం అలవాటయిపోయి పదిమంది ముందు గర్వంగా మాట్లాడుతుండేది.


ఒకనాడు జంతువులన్నీ గుమిగూడి ముచ్చటగా మాట్లాడుకుంటున్న సమయంలో కుందేలుకు తన దర్పం ప్రదర్శించుకోవాలన్నా అహంభావం కలిగింది. దానితో ఒళ్ళు తెలియకుండా నోటికి వచ్చిన ప్రగల్భాలన్నీ చెప్పడం ప్రారంభించింది. చుట్టూ చేరిన జంతువులా మాటలకు అసహ్యించుకుంటూ దానినోట్లో నోరుపెడితే మర్యాద దక్కదని మాట్లాడకుండా ఊరుకున్నాయి. అలా వుండడంతో కుందేలు ఒళ్ళు తెలియకుండా మాట్లాడుతూ "ఈ తాబేలు బావ నాతో పరుగుపందెం వెయ్యాలని కలలు కంటున్నాడు. అడుగు తీస్తే అడుగు వెయ్యలేడు. ఎందుకొచ్చిన జన్మది" అంటూ పొగరుబోతుతనంగా మాట్లాడింది.




"పరుగులో గొప్పదాన్ననుకునే ఓ పొగరుబోతు! ఎవరి శక్తి ఎలాంటిదో ఎవరికి తెలుసు? నాతో పాటుకూడా నడవలేనిరోజు నీకు రాకపోదు మిడిసి పడకు" అన్నది తాబేలు.

"అబ్బో! బావకు పౌరుషం వచ్చిందే నీతోపాటు నడవటే నేను తగని రోజులుదాకా ఎందుకు? ఏం అదేదో ఇప్పుడే చూద్దాం వస్తావా యేం? తారతమ్యం తెలియకుండా మిడిసిపడకు!" అన్నది కుందేలు







"పొగరుబోతు కుందేలా! అంతటి గర్వం తగదు" అని మందలించింది తాబేలు.

"అదేమిటో తేల్చుకుందాం రా. నాతో పరుగుపందానికి" అని అంది కుందేలు

సై అంటే సై అనుకున్నాయి తాబేలు, కుందేలు. అడవికి ఆవలవున్న నగరం పొలిమేర వరకూ వెళ్ళి రావాలి. ఎవరు ముందొస్తే వారు గెలిచినట్లు అని జంతువులన్నీ నిర్ణయించాయి.

రెండూ కలసి బయలుదేరాయి. చిటికెలో కుందేలు కనుచూపుదూరం పోయింది. తాబేలు నెమ్మదిగా కదులుతూ వుంది. జంతువులన్నీ హుషారిస్తున్నాయి

కనుచూపు దూరం పోయి కుందేలు వెనుతిరిగి గమనించి నేనెందుకింత ఆదుర్దాగా పరుగెత్తాలి? హాయిగా కాస్సేపిక్కడ ఆగి తాబేలు దగ్గరపడ్డాక మెల్లగా బయలుదేరుతాను అనుకొని ఆగిపోయింది. అంతలో దానికి ఆకలి జ్ఞాపకమొచ్చి అక్కడి ఆకులు, దుంపలు తింటూ వుండిపోయింది.

తాబేలు ఆ చోటు దాటి ముందుకు సాగిపోయింది. దుంపలవీ తిని తేన్చుకుంటూ త్రోవలో కొచ్చిన కుందేలు తనకన్నా ముందుగా తాబేలు వెళ్ళిపోవడం చూసింది. ఒక్క ఉదుటున పరుగు ప్రారంభించింది. పరుగెత్తి పరుగెత్తి అలసటొచ్చేవరకు పరుగెత్తి వెనక్కు చూసింది. తనకు వెనకబడిన తాబేలు కనుచూపుమేరలో ఎక్కడా దానికి కనబడలేదు. బ్రతుకుజీవుడా అని మెల్లగా నడవసాగింది.

కుందేలు తిని పరుగుపెట్టి బాగా అలసిపోయిందేమో నిద్ర ముంచుకురావడంతో ఒక పొదరింటి నీడలో హాయిగా పడుకుంది. అలా పడుకున్న కుందేలుకు తెలివొచ్చేసరికి చీకటి పడిపోయి చాలాసేపు పడుకుండి పోయానే అని కంగారు పడి ముందుకు బయలుదేరింది.

అలా బయలుదేరిన కుందేలుకు ఎదురొస్తున్న తాబేలు దాని వెనక జంతువులు కనబడ్డాయి. అవన్నీ దగ్గరకంటూ వచ్చి "ఏం కుందేలా ఇంకా ఎక్కడికి వెడతావు? తాబేలు నీకన్నా ముందే వెళ్ళివచ్చేసింది. నేను చాలా వేగమయిన దానినని దబాయించే దానివి. తాబేలుతోనే గెలవలేకపోయావు. ఎందుకొచ్చిన ప్రగల్భాలు ఎవరు యేనాడు ఎలా భంగపడతారో ఎవరికి తెల్సు? నేను గొప్ప అని విర్రవీగే వాళ్ళెప్పుడూ అల్పకులవల్లనే భంగపాటు పొందుతారు! అని మందలించాయి. ఆనాటినుండి కుందేలు డాబుమాని అన్నింటితో కలసి మెలసి తిరుగుతుండేది.

# నిదానమే ప్రదానం

అనగా అనగా ఒక ఊళ్ళో బ్రాహ్మణ దంపతులుండేవారు. వాళ్ళకు పిల్లలు లేరు. అందువల్ల ఆ భార్యాభర్తలిద్దరూ బాధపడి చివరికొక ముంగిసను తెచ్చి పెంచుకున్నారు. ఆ ముంగిస వాళ్ళకెంతో మచ్చికయి ఇంట్లో పసిపిల్లవానిలా తిరుగుతుండేది. కొంతకాలం అయ్యేసరికి వాళ్ళకో చిన్న పాపాయి పుట్టింది. వాళ్ళు వాళ్ళతో పాటు ఆ ముంగిస కూడా ఎంతో ఆనందపడ్డారు.

లేక లేక పుట్టిన ఆ పాపాయిని వాళ్ళు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ముంగిస కూడా ఆ పాపతో ఆడుకుంటుండేది.

ఒకరోజున ఆ పాప అమ్మ ఏటికి నీళ్ళకి బయలుదేరింది. పాప అప్పుడు ఉయ్యాల్లో హాయిగా నిద్రపోతున్నది. ముంగిసను పిలిచి ఆ అమ్మ పాపకు కాపలాపెట్టి నీళ్ళకు బయలుదేరింది. ముంగిస ఆ ఉయ్యాల చుట్టూ తిరుగుతూ గంతులేస్తూ పాపనే చూస్తూ పాప యెప్పుడు లేస్తుందా, ఎప్పుడాడుకుందామా అని ఆలోచిస్తూ కాపలా కాస్తున్నది. కొంతసేపటికి ఒక

పాము ఇంటిదూలం నుండి ఉయ్యాల గొలుసు మీదకు ప్రాకి గొలుసు గుండా ఉయ్యాలలోకి వస్తుండటం ముంగిస చూసింది. పాము పరమదుర్మార్గురాలని, విషజంతువని ముంగిసకు తెలుసు. అందువల్ల పాపకు ఏమయినా అపకారం చేస్తుందేమో నని హడలిపోయింది. ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదని వెంటనే ఉయ్యాలలోనికి గెంతి ముంగిస గొలుసులనుండి వస్తున్న పామును ఎదుర్కొంది. హోరా హోరీగా దానితో పోరాడింది. ఎల్లాగయితేనేం దాన్ని ముక్కలు ముక్కలు కొరికి చంపేసింది. పాపకు ప్రమాదం తప్పింది.

పాపను రక్షించానన్న ఆనందంతో ముంగిస పాప అమ్మకోసం వాకిట్లోకి వెళ్ళి ఎదురు చూస్తోంది. అంతలో ఆమె భుజాన బిందెత్తుకుని ఆ ఇంటికి వచ్చింది. ముంగిస ఆమె కాళ్ళలో ఎంతో ఆనందంగా దూరింది. తన కాళ్ళలోకి అడ్డుపడుతున్న ముంగిసను చూసింది. దాని నోరంతా రక్తంతో తడిసివుంది. పాపను కరిచేసుంటుంది. అదే ఆ రక్తమంతాను అని అనుకున్నది. ఎర్రగా వుండడం చూచింది. ఆమె గుండెలు గుభేలుమన్నాయి. ఆమెకెంతో కోపం వచ్చింది. వాకిట్లోగల కర్రపొకదాన్ని తీసుకుని కోపం తీరా దాన్ని కొట్టి చంపింది

దాన్నలా చంపేసి చరచరా లోపలకు పరుగెత్తుతూ వెళ్ళింది. పాపను చూచుకునేటందుకు. పాప చిరునవ్వులొలికిస్తూ ఉయ్యాలలో ఆడుకొంటుంది. ఆ ఉయ్యాలలో పాము ముక్కలు ముక్కలై పడి ఉండడం చూచింది. జరిగిందేమిటో ఆమెకు అర్థమయ్యింది. తన బిడ్డ ప్రాణాలు కాపాడిన ఉపకారిని తాను చంపేసిన పాపాత్మురాలనని బాధపడింది. తొందరపడకుండా నిదానంగా ఆలోచిస్తే ఈ దారుణం జరిగేది కాదని బాధపడింది. ఆవేశంతో ఉపకారికి అపకారం చేసాను. ఏ పనైనా నిదానంగా ఆలోచించి చెయ్యాలి అని బాధపడింది.

# దురాశ దుఃఖానికి చేటు

రామాపురంలో పూర్వం ఒక నిరుపేద కుటుంబీకుడుండేవాడు. అతడు పెట్టల్ని పెంచి వాటిని వాటి గుడ్లను అమ్ముకుని జీవించేవాడు. అతి కష్టంగా కుటుంబ భారాన్ని నిర్వహించుకొంటున్న అతని దగ్గర ఒక బాతు వుండేది. అది గుడ్లు పెట్టడం ప్రారంభించింది. అవి బంగారు




గుడ్డు! దానితో అతని అదృష్టం మారింది. రోజుకొక బంగారు గుడ్డు పెడుతూ వుండడం వల్ల అతనికి క్రమక్రమంగా సిరిసంపదలు పెరగసాగాయి.

ఇలా కొంతకాలం జరిగిందో లేదో అతనిలో ఆశలు అధికమయ్యాయి. రోజు రోజు గుడ్డుకోసం వేచి వుండే కన్నా దాని కడుపులో గుడ్లన్నీ ఒక్కసారే తీసుకుని వాటితో అనంతకోటి సిరిసంపదలుగల శ్రీమంతుడై సుఖభోగాలనుభవించాలని. కీర్తిని, పేరుని సంపాదించాలని అతనికి దురాశ కలిగింది.

ఒకనాడు బాతును చేరదీసి పట్టుకుని. దురాశ కొద్దీ కత్తితో దాని కడుపు కోశాడు. బంగారు గుడ్లకోసం దాని కడుపంతా గాలించాడు. ఒక్క గుడ్డు కూడా దొరకలేదు. ఆ బాతు మాత్రం చచ్చిపోయింది. ఆ నాటినుండి బంగారపు గుడ్లు లేవు; మళ్ళీ అతని పరిస్థితులు పూర్వపు దరిద్రపు స్థితికే దిగజారిపోయాయి. ఉన్నదాన్ని ఆనందంగా అనుభవించలేకపోగా అతని దురాశ దుఃఖానికి చేటయ్యింది.

# అపకారికి ఉపకారము చేయరాదు

ఒకానొక దట్టమైన కీకారణ్యంలో ఒక పాము వుంటుండేది. దానిని చూచి అడవిలోని జంతువులన్నీ ఎంతో భయపడేవి. తనపట్ల జంతువులు చూపుతున్న భయం కేవలం తన గొప్పతనం వల్లనేనని ఆ పాముకెంతో గర్వంగా వుండేది. అందువల్ల అది కన్నూమిన్నూ కానకుండా ఆ అడవిలో ఎంతో పొగరుబోతుతనంగా తిరుగుతుండేది. అది వస్తున్న చడి వినిపించేసరికి జంతువులు దాని త్రోవనుండి తప్పుకుపోతుండేవి.







అసలే విష జంతువు అందులోనూ గొప్పదానినన్న గర్వంతో ఎంతో పొగరుగా తిరుగుతున్నట్టిది, తీరా దాని కంటబడితే ఏమి మాట్లాడుతుందో ఏమంటుందో ఆ మాటల దూకుడులో పౌరుషం చెంది కాటువేస్తే, ఆ విషానికి ప్రాణాలు కోల్పోవాలి. ఎందుకొచ్చిన ముప్పు తప్పకు తిరిగితేనే మంచిదని జంతువులేవీ దాని సరసకు రాకపోవడం వల్ల అది తిరుగాడే పరిసరాలలో ఒక్క పిట్టయినా ఉండేదికాదు. ఒంటరి అయిపోయి పాము తను మామూలుగా తిరిగే తావులో తనకేమీ తోచక ఆ అడవి మార్గాన బయలుదేరి చాలాదూరం ప్రయాణం చేసింది. అంతలో ఆకస్మికంగా అది తిరుగుతున్న ప్రాంతంలో మంటలు లేచాయి. దాన్ని తప్పకుపోవాలన్న తొందరలో వెనక్కి మరలింది పాము. అంతలో అటు ప్రక్కకూడా మంటలు వ్యాపించినాయి. క్షణాలలో ఆ పాము చుట్టూవున్న పొదలంటుకుని ఆ మంటల మధ్య అది ఇరుక్కుపోయింది.

బయపడేమార్గం తోచలేదు. "నన్ను రక్షించండి... నన్ను రక్షించండి..." అంటూ గట్టిగా కేకలు పెట్టనారంభించింది. ఆ అడవి మార్గాన అటు ప్రక్కగా ప్రక్క గ్రామానికి పోతున్న ఒక రైతు చెవులకా కేకలు వినబడ్డాయి. యెవరో ఆపదలో ఉన్నారని ఆ రైతు ఆ కేకలు వినబడుతున్న దిక్కుగా వెళ్లాడు. మంటల మధ్య ప్రాణభయంతో తల్లడిల్లిపోతున్న పామును చూచాడు. అది దుష్టజంతువైనా సంకోచించకుండా, ఆ రైతు తన చేతికర్ర కొనకు సంచిని కట్టి ఆ మంటల మధ్యకు పెట్టి పట్టుకున్నాడు. బ్రతుకు జీవుడా అనుకుని ఆ పాము ఆ సంచిలో దూరింది. వెంటనే రైతాకర్రను పైకెత్తి చేతి సంచిని,మంటల ఆవలకు తెచ్చి నేలనుంచేడు.


ఆ సంచిలోనుంచి చర్రున ఈవలకొచ్చింది పాము. ప్రాణభిక్ష పెట్టినవాడన్న ఆలోచనయినా ఆలోచించకుండా బుసలు కొడుతూ కస్సున పైకి లేచి ఆ రైతును కాటు వేసింది. పాపం రైతు పాము విషం తలకెక్కి నోట సొంగలు కక్కుతూ నేలబడి ప్రాణాలు వదిలాడు. ఉపకారానికి పోయి మరణాన్ని తెచ్చుకున్నాడా రైతు. కనుక ఉపకారమే అయినా సజ్జనులకు చెయ్యాలిగాని దుష్టులకు చెయ్యకూడదు.

# బుద్ధి హీనులు

ఒకానొక ఊరి చెరువులో ఒక పెద్ద కప్ప ఉండేది. తాను చాలా గొప్పదానినని దానికి ఎడతెగని గర్వం. దాని పిల్లలకు అది ఎప్పుడూ యేవేవో లేనిపోని గొప్పలను చెప్పుతుండేది. నాకన్నా గొప్ప జంతువే లోకంలో లేదని.

ఒకనాడొక ఎద్దు - ఆబోతుకన్నా పెద్దదొకటి ఆ చెరువుకు నీళ్ళు త్రాగడానికి వచ్చింది. దానిని ఈ బోదురు కప్ప పిల్లలు చూసాయి. అవి అంతకు ముందెన్నడూ ఎద్దును చూడకపోవడం వల్ల దాన్ని చూచి ఎంతో ఆశ్చర్యపోయాయి. అవి తిన్నగా తల్లి కప్ప దగ్గరకు వెళ్ళాయి. నీకన్నా గొప్ప జంతువే లేదన్నావు అదేదో కొండంత జంతువు ఒడ్డున నిలబడి నీళ్ళు త్రాగుతోందిరా చూద్దాం అని తీసుకువచ్చాయి.

కప్ప పిల్లలతో పెద్దకొమ్ము ఎద్దును చూచింది. అదొక ఎద్దరా. దాన్ని చూచేనా మీరు ఆశ్చర్యపోతున్నారు? ఈ చెరువు చాలదని నేను పెరగడం లేదుగాని, అంతవడం యేమంత వింతగాదు. దానంత యేం ఖర్మ? అంతకన్నా మించి పెరుగుతాను చూడండి అంటూ ఊపిరి గట్టిగా బిగపట్టి పొట్టనుబ్బించింది. కప్ప పిల్లలు కిలకిలలాడుతూ చప్పట్లు చరిచాయి. కప్ప



మరింతగా ఉబ్బి కప్ప ఎంతో పెద్దదిగా తయారయ్యింది. భలే భలే నువ్వు చాలా గొప్పదానివి. ఇంకా పెద్దదానికి కావాలి. ఆ ఎద్దుకన్నా పెద్దదానివి కావాలి అంటూ కప్ప పిల్లలు గోలచేశాయి. వాటిని కాదనలేక తాను చేతగాని దానినని అనిపించుకోలేక, తన శక్తి ఎంతవరకో తెలుసుకోలేక ఆ కప్ప ఇంకా ఎక్కువగా ఊపిరి బిగపట్టింది.

దానితో ఆ కప్పకు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యింది. పిల్లలపట్టు మరీ ఎక్కువయ్యింది. ఊపిరి తీసుకోవాలంటే పిల్లలు యేం గేలి చేస్తాయో అని ఇలాగ సతమతమౌతూ తన పొట్టను ఇంకా పెద్దది చెయ్యాలనే తాపత్రయం పడసాగింది. అంతలో ఆ పొట్ట గాలి ఒత్తిడికి "ఢాం" అని పేలిపోయింది. ఆ కప్ప చచ్చిపోయింది.

బుద్ధి హీనులు తమ అంతస్తును మరచి, లేని గొప్పలకు పోయి తబ్బిబ్బుల పాలై తట్టుకోలేక ముప్పునే తెచ్చుకుంటారు.

# అమాయకుడు

శ్రీరంగపురంలో ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబం వుండేది. ఆ రోజుకు సరిపడే ఆదాయంతో వారి బ్రతుకులు గడుస్తుండడమే కాని ఆస్తిపాస్తులు, నగలు, నాణ్యాలు, పాడిపంటలు మొదలయినవేవీ వారికి లేవు. వారికీ ఒక్కగానొక్క కొడుకు. వాడు శుద్ధ అమాయకుడు. వాణ్ణి అల్లారు ముద్దుగా చూసుకుంటూ ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారేగాని, అతడికి కాస్తయినా విద్యాబుద్ధులు నేర్పించలేకపోయారా నిరుపేదలు.

కొంత కాలానికా కుర్రవాడు పెద్దవాడై యుక్త వయస్కుడయ్యాడు. అతనికి పెళ్ళిచేసి వాళ్ళకు బిడ్డా పాపా కలిగితే చూచి ఆనందించాలని ఆశ కలిగిందా దంపతులకు సిరిసంపదలు లేకపోయినా చక్కనైన సాంప్రదాయాలు, కట్టుబాట్లు సంస్కారం కలిగిన కుటుంబీకులు కావడం వల్ల ఎక్కడెక్కడనుండో సంబంధాలు వస్తూండేవి. వచ్చిన వారంతా వాళ్ళ ఆర్థిక పరిస్థితులకు భయపడి వెళ్ళిపోతూండేవారు. అమాయకుడే అయినా ఆ కుర్రవాడు మంచివాడు. కలుపుగోలుతనం కలిగినవాడు కావడం వల్ల ఇరుగు పొరుగు వారికి కూడా వచ్చిన సంబంధాలన్నీ తిరిగి పోతూండడం బాధ కలిగించి. వాళ్ళా ఆ దంపతుల్ని కలుసుకొని "అయ్యా మీ పరిస్థితులు ఇల్లాగే గడిచిపోనచ్చు, పిల్లవాడికి భార్య వచ్చిన వేళావిశేషం వలన సంపన్నుడు కాకపోతాడా చూడవచ్చిన వారికి అలానే చూపిస్తే వారికేం నచ్చుతుంది. ఉన్నంతలో కాస్త దర్జాగానే చూపించండి. అబ్బాయిని" అని సలహా ఇచ్చారు.

అంతలో ఒకనాడొక సంబంధం వచ్చింది. వాళ్ళు కుర్రవాణ్ణి చూస్తామన్నారు. తల్లిదండ్రుల ఆలోచించి ఇరుగుపొరుగువారి సలహా ప్రకారం కుర్రవాణ్ణి దర్జాగా చూపించడానికే నిర్ణయించుకున్నారు. ప్రక్కింటివారిని అడిగి చెవుల పోగులు తెచ్చి కుర్రవాడి చెవులకు అలంకరించారు. పిల్లనివ్వవచ్చిన పెద్దల ముందు కూర్చోబెట్టారు. వారిలో ఒకాయన పిల్లవాడి గుణగణాల్ని పరిశీలిస్తూ "బాబూ! నీ పేరేమిటని ప్రశ్నించాడు" ఫలానా అని చెప్పేడు. ఏం చదువుకున్నావని అడిగాడు అదీ చెప్పేడు ఇంకా ఏమేమో అడిగేసరికి అన్నీ చెప్పి ఇంక దుద్దులు గురించి కూడా అడిగేస్తారని ఊహించుకుని నా చెవులకున్న ఈ దుద్దులు మా ప్రక్కింటి వారివన్నాడు. దానితో ఆ పెళ్ళివారు సంబంధం వదులుకుని వెళ్ళిపోయారు.

తను కొడుకు అమాయకతకు ఆ తల్లిదండ్రులు బాధపడి వాళ్ళతో అలా నావి కాదని అనకూడదు బాబు అని చెప్పేరు. మరికొంత కాలానికి మరో సంబంధం వచ్చింది. అప్పుడా తల్లిదండ్రులు మళ్ళీ ఆ దుద్దులు తెచ్చి అతనికి పెట్టారు. ఆ పెళ్ళివారు అతడితో ఏమేమో మాట్లాడుతూ అనేక ప్రశ్నలు వేశారు. వాటన్నిటికి ఎంతో జాగ్రత్తగా సమాధానాలు చెప్పేడు. అలా చెప్పిచెప్పి చెవులకున్న కమ్మలు కూడా నావేనని అన్నాడు. ఆ పెళ్ళివారు లోలోన నవ్వుకుని వెళ్ళిపోయారు. అలా అనకూడదు అని తల్లిదండ్రులతణ్ణి మందలించారు. వాటి ఊసు నీకెందుకు? అన్నారు.


మళ్ళీ మరికొంతకాలం గడిచాక మరొక సంబంధం వచ్చింది. ఈసారి తల్లి దిద్దులతడికి పెడుతూ వీటిని గురించి నువ్వు మాట్లాడకూడదు బాబూ అన్నది. మరి వాళ్ళడిగితేనో అన్నాడు. అడగరు అడిగినా నువ్వేం అనకూడదు అని హెచ్చరించింది. వచ్చిన పెళ్ళివారి ముందు కూర్చుంటూనే అన్నాడు గదా.. "చూడండి మీరు నన్ను ఏమైనా అడగండి గాని నా చెవుల దుద్దుల గురించి మాత్రం అడగటానికి వీలులేదు. అడిగినా నేనేం చెప్పను అన్నాడు." తల్లిదండ్రులు వెళ్ళిపోతున్న పెళ్ళివారిని చూచి తలగొట్టుకున్నారు.

ఆ తరువాత చేసేదిలేక ఆ అమాయకుడిచేత అబద్ధమాడించడం తప్పని నిర్ణయించుకుని, తమలోనే ఒక నిరుపేద పిల్లను, ఓ వెర్రి బాగులదాన్ని తెచ్చి పెళ్ళిచేసి తృప్తిపడ్డారు.

# మూర్ఖులు

అనగా అనగా ఓ మహారాజా వారుండేవారు. అవంతీ పురాధీశ్వరులైన ఆ రాజశేఖరులకు జంతువులన్నా, జంతువుల వేటన్నా ఎంతో ప్రీతి. అడవిలోకి వెళ్ళి క్రూరమృగాలను వేటాడు తుండేవారు. సాదు జంతువుల్ని తెచ్చి పెంచుతుండేవాడు. ఇలా వుండగా వారికో కోతి దొరికింది. అది యెంతో ముచ్చటగా వుండడం వలన దాన్ని పట్టి తెచ్చి రాజధానిలో ఎంతో శ్రద్ధగా పెంచసాగారు. అది కూడా ఎంతో చురుకైనది కావడం వల్ల, తోటి మనిషి లాగనే వ్యవహరిస్తూండడం వల్ల, రాజుగారు ముచ్చటపడి దానికి ఖడ్గవిద్య నేర్పించారు. అది చాలా సులువుగా ఆ విద్యను నేర్చుకున్నది.

రాజుగారికి ఆ కోతి అన్నా దాని ఖడ్గ విద్యానైపుణ్యమన్నా ఎంతో మోజు పెరిగింది. ఈ వార్త దేశ దేశాలకు ఎగబ్రాకింది. ఎక్కడెక్కడివారో వచ్చి దానిని, దాని విద్యను చూచి వెడుతుండేవారు. అంతేకాదు, రాజుగారు దానితో యుద్ధం చేసి గెలిచినవారిని సత్కరిస్తానని ప్రకటించారు.



తమ శక్తియుక్తులన్నీ చూపించారేగాని ఆ కోతిని ఎవ్వరూ గెలవలేకపోయారు. రాజుగారి ఆనందానికి అంతులేదు. తాను ముచ్చటపడి పెంచుకుంటున్న కోతి దేశ దేశాల వీరుల్ని ఓడించి మహావీర విక్రమ సంపన్నమయినదిగా కీర్తి పొందడంతో ఎంతగానో ఆనందించాడు. దానిని మరింత ప్రేమగా ఆదరణతో చూస్తుండేవాడు. ఆ కోతికి కూడా రాజుగారన్నా, వారితోటి సాంగత్యమన్నా ఎంతో ఇష్టత యేర్పడింది.

ఈ విధంగా రాజుగారు కోతి ఒకరికొకరు అత్యంత ఆప్తులయ్యారు. దానితో రాజుగారు ఆ కోతిని తన అంగరక్షకులలో ఒకదానిగా వేసుకున్నారు. ఆనాటినుండి ఆ కోతి ఇరువది నాలుగు గంటలూ రాజుగారితోనే వుండి వారిని సంరక్షిస్తూండేది. అలవాటు ప్రకారం రాజుగారు వేటకు వెడుతూ ఆనాడు తనవెంట తన కోతిని కూడా తీసుకువెళ్ళారు. కోతి రాజుగారు కలసి వేటాడి అలసిపోయారు.

రాజుగారు విశ్రాంతి తీసుకుంటూ కోతిని పిలిచి జాగ్రత్తగా చూస్తుండమని చెప్పి నిద్రపోయారు. కోతి కన్నురెప్ప వెయ్యకుండా కాపలా కాస్తోంది. రాజుగారు గాఢనిద్రలో వున్నారు. అంతలో ఒక ఈగవచ్చి రాజుగారి వక్షస్థలం మీద వాలింది. అది చూచింది కోతి. రాజావారి మీద వాలిన ఈగమీద దానికి అంతులేని కోపం వచ్చింది. కత్తిదూసి ఆ ఈగను ఒక్క వేటు వేసింది. ఆ దెబ్బకు ఈగ చచ్చిపోగా, రాజుగారి శరీరం రెండు ముక్కలుగా తెగిపడింది. యెంత నైపుణ్యం నేర్పిస్తేనేం. మంచీ చెడూ ఆలోచించుకోలేని కోతివంటి మూర్ఖుల విద్య ముప్పనే కలిగిస్తుంది. విద్యతో పాటు వివేకం కూడా వుండాలి.

# గొప్పలకు పోరాదు

దేవలోకంలో ఒకనాడు బ్రహ్మ దేవేంద్రాది సమస్త దేవతలతో కొలువుదీరి వేదాంత విషయాలను ప్రసంగిస్తున్నాడు. యక్షగంధర్వ కిన్నెర కింపురుష, సురాసుర మానవ మహా జ్ఞానులంతా ఆ సభలో వున్నారు. ఋషులు, సురులు, అసురులు అంతా తమకు తగిన స్థానాల్లో కూర్చుని వున్నారు.

అటువంటి నిండు సభలోకి ఒక వ్యక్తి వచ్చేడు. కమండలం, కృష్ణాజినం, పావుకోళ్ళు బిళ్ళగోచి, పంచకట్టు, అత్యంత శోత్రియం బ్రహ్మజ్ఞానమున మూర్తీభవించిన మహా మేధావిలా ఉన్నాడు. కమండలోదకాన్ని చల్లుకుంటూ మార్గాన్ని శుద్ధిచేస్తూ, అడుగుల్ని ఎత్తి ఎత్తి వేస్తూ మూర్తీభవించిన శోత్రియుడిలా, ప్రకాశిస్తున్న విజ్ఞాన తేజోరాసిలా నడిచి వస్తున్న అతడ్ని చూచాడు. బ్రహ్మ "అహో! ఎంత గొప్పవాడు అనుకుంటూ" ఆదరంగా ఆహ్వానించాడు. అతడి అంతస్తుకు తగిన ఆసనమేదో నిర్ణయించలేకపోయాడు.


అంతటివాడ్ని మరెక్కడ కూర్చోమన్నా గౌరవంగా వుండదని తన అంకతలంలోనే కూర్చుండబెట్టుకున్నాడు. అతనిపట్ల బ్రహ్మ చూపించిన ఆదరణకు సభలోని యావన్మంది ఆశ్చర్యపడ్డారు. సభలో వేదచర్చ జరుగుతుంది. బ్రహ్మ అంకతలంలో కూర్చున్న అతడు కూడా యేదో మాటాడబోయాడు. అప్పుడు అతని నోటినుండి తుంపరులు తూలి బ్రహ్మముఖం మీద పడ్డాయి. దానితో బ్రహ్మకు కోపం వచ్చింది. "ఏమిటిది? వీడింత అపవిత్రంగా ప్రవర్తిస్తున్నాడు" అని మనోనేత్రంతో అతడ్ని పరిశీలించాడు. అతనికేమీ రాదని అంతా అనుకరించడం మినహా యే విధమైన సంస్కారం లేనివాడని గుర్తించాడు.

దానితో వాడ్ని తన అంకతలం నుండి క్రిందకు పడదోసి. "నీదంతా దంబమేనటరా, అది చూచి భ్రమపడి నీవు మహానుభావుడవనుకొని ఎవరికి దక్కని ఉన్నతస్థానంలో నిన్ను కూర్చుండ బెట్టేను. నీ దంబాచారము చూచి భ్రమపడి విజ్ఞానులగు ఈ గొప్పవారి కందరికి **అవమానము** కలిగించినవాడనయ్యాను" అని విసుక్కున్నాడు.

పేదలకు పెద్దరికమును అనుకరించి ఆడంబరము చేయు దంబాచారులవలన తెలివైనవారే మోసపోతూ ఉంటారు. కాని అది స్థిరము కాదు. నిజము తెలియక మానదు. తెలిసిన తదుపరి అట్టి దంబులకు అధఃపతనం తప్పదు కనుక లేనిపోని వట్టి గొప్పలు చూపుట మంచిదికాదు.

# తనకుమాలిన ధర్మం

అనగా అనగా ఒక రాజుగారు. ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు వేటకెళ్ళి ఏడు చేపలు తెచ్చేరు. ఏడు చేపలు తెచ్చి ఎండబెట్టేరు. వాటిలో ఒక చేప ఎండలేదు. "చిన్నెల చిన్నెల వగలాడి చేపా? ముచ్చటయిన ఓ ఏడవ చేపా? ఎందుకు ఎండలేదే?" అని అడిగాడు ఏడవ రాకుమారుడు. "రాజ్యమేలే రాజుని మురిపెముగ గూర్చే ముద్దుల కొడుకా! ఓ బుల్లి రాకుమారా! గడ్డి నాకు చాటొచ్చింది అందుచేత నేను ఎండలేదు" అన్నది చేప. "ఔరా! ఔరా ఓ గడ్డిమోపా! చేపకు చాటెందుకొచ్చావే" అని అడిగాడు. "ధరణిని పాలించే ప్రభువుకు ముద్దుల కొడుకా! ఆవు నన్ను మెయ్యలేదు" అన్నది గడ్డి. "ఆవా! ఆవా! ఏమే ఆవా! ఎందుకు నువ్వు గడ్డిమెయ్యలేదు?" అని అడిగాడు. "అరుగురన్నల అందాల తమ్ముడా! మున్నేలు రాజుల ఆఖరి కొడుకా! గొల్లవాడు నాకు మేతెయ్యలేదు" అంది. "గొల్లా! గొల్లా పాలు పెరుగులు మాకిచ్చేటి గొల్లా! ఆవుకు మేతెందుకు వెయ్యలేదు" అన్నాడు.



"ఓ రాజకుమారా! రాజగారి చిన్నోడా అవ్వ నాకు బువ్వ పెట్టలేదు" అన్నాడు. "ఏమి అవ్వ గొల్లకు బువ్వ పెట్టలేదేమే" అన్నాడు చిన్నరాజు. "నా చిన్న మనవడు ఏడుస్తుంటే ఊరుకో బెడుతున్నాను బాబు" అంది "ఏరా మనవడా! ఆకతాయి మనవడా! ఎందుకేడుస్తున్నావురా? అనడిగాడు రాకుమారుడు. "చీమకుట్టి నేనేడుస్తున్నాను ఓ బుల్లి రాజా" అన్నాడు. "ఏమే చీమా ఎందుకే కుట్టేవు" అని రెట్టించి అడిగాడు ఏడవ కుమారుడు. "నా బంగారు కన్నంలో వ్రేలు పెడితే కుట్టనా" అంది చీమ.

తనకు మాలిన పనులు చేస్తే ఊరువాడా అందరికీ పని చెరుపే ఔతుంది.

# ఆలోచనే విజయానికి సోపానం

శ్రీనాథుడు తన జీవితకాలమంతా ఎంతో దర్జాగా గడిపిన ఏకైక తెలుగుకవి. ఈ పండితుడు ఏ రాజస్థానాలలోనికి వెళ్ళినా, గ్రామాంతరాలకు వెళ్ళినా మరే పనిమీద ఆపతలకు వెళ్ళినా సవ్వారీమీద వెళ్ళేవాడు. సంపన్నుడు కావటంవల్ల సవ్వారీని మోసేటందుకు కొందరు బోయీలను జీతాలిచ్చి పోషించేవాడు. పాడిపంటలకు, సిరిసంపదలకు ఏవిధమైన లోటూ

లేని ఆ మహాకవి ఇంట ఎంతోమంది నౌకర్లుండేవారు. ఆయన జీవితం మహారాజ భోగాలతో సాగుతుంది.

శ్రీనాధుని పాడి పశువులలోని ఒక ఆవు తప్పిపోయింది. అది ఎంతకూ ఇల్లు చేరలేదు. బోయీలు తప్ప నౌకర్లు మరెవ్వరూ అప్పుడింటిలో లేరు. అందువల్ల శ్రీనాధుడా బోయీలను పిలిచి "నాయనలారా మన కర్రి ఆవు త్రోవదప్పి ఎక్కడో చిక్కుపడిపోయింది. కనుక మీరు నలుగురు నాలుగుప్రక్కలకూ పోయి దానిని వెదకి తీసుకురండి" అని చెప్పాడు. అప్పటికి చాలారోజులుగా ఇంటివద్దనే ఊరికే కూర్చుని ఉంటున్న ఆ బోయీలు బద్ధకించి, ఆ పని చెయ్యటం తమకు తగిన పని కాదని అభిమానపడి "స్వామీ! మేము బోయీలము కాని పాలేరులము కాము. అది మా పని కాదు. సవ్వారి మోయుటే మా పని మాకు మరొక పని చెప్పుట పాడికాదని పండితులు తమరెరుగరా? దయచేసి మాకాపని చెప్పకండి" అన్నారు. వారి మాటలను విన్న శ్రీనాధుడు సోమరులై గారలా అంటున్నారని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

"బోయిలూ! మీరన్నమాట నిజమే మీకు మరొకపని చెప్పుట అనుచితమే. ఇంట పాలేరు లెవ్వరూ లేరు. ఆవును వెతకుకొనుట నాకు తప్పదు గదా! కనుక నేనే బయలు దేరుతాను. నా సవారీని సిద్ధం చెయ్యండి" అని చెప్పి శ్రీనాధుడు పశువు కొరకు పల్లకీలో బయలుదేరాడు.

పాపమూ బోయీలు ఆ పల్లకీని మోస్తూ ఊరంతా ఎంత తిరుగసాగినా ఆవు దొరకలేదు. ఈ వీధి కాదని ఆ వీధి ఆ వీధి కాదని మరో వీధి ఇక్కడకు అక్కడకు అని శ్రీనాధుడు వెళ్లమంటున్న తావులకల్లా వెళ్లారు. ఎంతకూ ఆవు కనబడలేదు. పాపమూ బోయీలు అలసిపోయారు. "స్వామీ! ఇక మేం తిరగలేం" అన్నారు. "అదేమన్న మాటయ్యా సవారీ మొయ్యడానికే కదా మీకు నేను జీతమిస్తున్నది. మరో పనేదీ మీకు నేను చెప్పలేను కదా! మీ పనిని మీరు చెయ్యమనంటే ఎలాగ. ఆవు దొరికే పర్యంతం నన్ను మీరు నలుప్రక్కలకు తీసుకు వెళ్లవలసిందే" అన్నాడు.

మరోమాట చెప్పలేక వాళ్ళు పల్లకీని మోస్తూనే వున్నారు. శ్రీనాధుడు ఇటు, అటు, వేగంగా అంటూ వాళ్లను తిప్పుతూనే వున్నాడు. బోయీలకు ఓపికపోయింది. అడుగు వెయ్యలేక పోతున్నారు. ఆయన వెళ్లమన్నప్పుడు ఆవును వెదకడానికి వెడితేనే బాగుండేది. మోత బరువు కూడా పెట్టుకున్నాం అని పశ్చాత్తాపపడ్డారు.

తమ పొరపాటును తెలుసుకొన్న బోయీలు "దొరా! మమ్మల్ని మన్నించండి. తొందర పడి తమతో అవిధేయతగా మాట్లాడాం తిరిగి వెతికితే తీరేదానికి మాటజారి మెడమీదకు బరువు కూడా తెచ్చుకున్నాం. మాకు బుద్ధి వచ్చింది. మేమే తిరిగి వెదకి ఆవును ఇంటికి చేరుస్తాం ఇక ఎప్పుడు మా పని కాదని తప్పించుకోం మమ్మల్ని క్షమించండి" అన్నారు.

శ్రీనాధుడు వాళ్లకు బుద్ధొచ్చినందుకు ఆనందించి ఇంటికి చేరుకున్నాడు. బోయీలు సవారీని ఇంటిదగ్గర వదలి ఆవును వెదకేటందుకు నలుగురూ నాలుగు దిక్కులకు

బయలుదేరారు. వెతికి ఆవును పట్టుకుని ఇంటికి తెచ్చారు. వారిని చూచి శ్రీనాథుడు "ఇలా సునాయాసంగా తీరేదానికి మరింత బాధను మాటబారి తెచ్చుకున్నారు. ఇది నా పని, వాడి పని అని వాదులాడుకోవడం కన్నా, ఆ పని యేమిటో ఆలోచించుకుని పని చెయ్యాలి. పని ఎగవెయ్యడానికి కుంటి సాకులు చెబితే తంటా తప్పదు" అని ప్రబోధించాడు.

# మూర్ఖుడితో చెలిమి

ఒకప్పుడొక వర్తకుడు తన ప్రక్క గ్రామానికి సరుకులు కొనుక్కోవాలని బయలుదేరాడు. కొండమార్గం కావడం వల్ల ఎక్కువదూరం కావడం వల్ల ఎంత నడిచినా గ్రామం చేరలేకపోయాడు. త్రోవలో అతనికొక బాటసారి తగిలాడు. అతడు అతిమూర్ఖుడు అయినా త్రోవలో తోడుగా ఉంటాడని, వర్తకుడు అతనితో జత కలిపి ప్రయాణం చేస్తున్నాడు.

చీకటి పడిపోయిందేగాని వారు చేరవలసిన ఊరు దరిదాపులకైనా చేరలేకపోయారు. అసలే అడవి మార్గం. దొంగల భయం కూడా ఉన్నబాట అందువల్ల ప్రయాణం ముందుకు సాగించడం మంచిదికాదని నిర్ణయించుకున్నారు. అంతలో వారికో పాడుబడిన గుడి కనిపించింది. ఇద్దరూ కలసి అక్కడే పడుకుని తెల్లవారుజామున బయలుదేరడానికి నిర్ణయించుకున్నారు.

మూర్ఖుడు మండపంలోనే పడుకున్నాడు. దగ్గర డబ్బున్నందువల్ల భద్రంగా పడుకోవాలని షావుకారు గుడిలోపల విగ్రహం చాటున పడుకున్నారు.

కొంత రాత్రయ్యేసరికి కొందరు దొంగలాగుడికి వచ్చేరు. దోచుకొచ్చిన సొమ్ము పంచుకునేటందుకు అక్కడకు చేరిన దొంగలకు వరండాలో పడుకున్న మూర్ఖుడు అడ్డంగా కనబడ్డాడు. అందుకు వాళ్ళు విసుక్కొని, వీడెవడో దరిద్రుడు తయారయ్యాడిక్కడ మనకు అడ్డు అని విసుక్కున్నారు. తెలివిగావున్న మూర్ఖుడది విన్నాడు. అతడికి ఎక్కడలేని కోపం వచ్చింది. చివాలున లేచి కూర్చొని "ఏమయ్యా ఎంతోస్తే అంత మాట్లాడెయ్యడమేనా. ఈ రాత్రికి పడుకొని పోయేవాణ్ణి మీకేం అడ్డురాను నేనిలా ఈ వారకు జరిగి పడుకుంటాను. మీరు మీ చోట్లోనే పడుకోండి. ఎంత మీ చోటయినా అంత ఇది పనికిరాదు. మంచీ మర్యాద ఉండాలి. అనవసరంగా తెలిసీ తెలియక మాట్లాడెయ్యడం మీకు ధర్మం కాదు. నేను దరిద్రుడ్నా? వరహాలొంటిలో వున్న నేను దరిద్రుడ్నెలా అవుతాను. తెలివి తక్కువ మనుషుల్లా ఉన్నారు పోయి పడుకోండి" అన్నాడు.

అతడ్ని ఆశ్చర్యంతో చూస్తున్న దొంగలు అతని దగ్గర వరహా ఉన్నదన్నమాట వినేసరికి చటాలున అతడ్ని పట్టుకుని ఆ వరహా దోచుకున్నారు. అందులో ఒకడా

వరహాను పరిశీలిస్తుంటే,"ఏం పెద్దమనుషులయ్యా మీరు మీ తావులో పడుకున్నానని నన్ను దరిద్రుడని తిట్టేరా! నేను దరిద్రుణ్ణి కాదు, వరహా వున్న సంపన్నుడని అంటే నన్ను ఒక్కణ్ణి చేసి మీరు నలుగురూ ఆ డబ్బు దోచుకుంటారా! దోచింది చాలక అది సత్తుదో, మంచిదో అని పరీక్షించి నన్ను అవమానిస్తారా. నేను మీ కంటికి దగా మనిషిలా కూడా కనిపిస్తున్నానన్న మాట. నాణెం పరీక్ష చెయ్యడం చేతకాకపోతే విగ్రహం వెనక పడుకున్న షావుకారును లేపి పరీక్ష చేయించుకోండి" అన్నాడు.

వీడుగాక మరొకడు కూడా వున్నాడన్నమాట. అని దొంగలు గుళ్ళోకి వెళ్ళి ఆ షావుకారిని రెక్కలు విడిచి కట్టి తెచ్చి అతని దగ్గరి రొక్కమంతా అపహరించారు.

"ఈ మూర్ఖుడితో స్నేహం చేయడంవల్లగదా, నేనెంత జాగ్రత్త పడ్డప్పటికీ నాకీ ముప్పు తప్పలేదు" అనుకుని షావుకారు ఎంతగానో దుఃఖించాడు.

# మంత్రపుష్పం


దుర్వాస మహాముని ఆశ్రమంలో నాగవర్ధనుడు అనే శిష్యుడుండేవాడు. నాగవర్ధనుడు కపటి. తన గురువు వద్ద ఎలాగైనా విద్యలన్నీ తక్కువ కాలంలో నేర్చుకుని, వాటి ఫలితాలను అనుభవించాలని యోచించేవాడు.

ఒకసారి దుర్వాస మహాముని ఏకాంతంలో ఉండగా నాగవర్ధనుడు ముని కాళ్ళు పత్తుతూ "స్వామీ...మీకు చాలాకాలంనుంచి భక్తి శ్రద్ధలతో సేవలు చేస్తున్నాను" అన్నాడు.

దుర్వాసుడు అతడి మాటలు విని నవ్వి ఊరుకున్నాడు.

"స్వామీ...మీ దయవల్ల అన్ని విద్యలు నేర్చుకున్నాను. కాని ఒక్క మంత్రపుష్పం విద్యనే నేర్చుకోలేకపోయాను. కనుక దానిని నేర్పించి పుణ్యం కట్టుకోండి" అంటూ ప్రాధేయపడ్డాడు. నాగవర్ధనుడి కపట స్వభావం తెలియని దుర్వాసుడు మంత్ర పుష్పంతో శిల అయిపోయే మంత్రాన్ని చెప్పడమే తరువాయి దానిని వెంటనే నాగవర్ధనుడు, మంత్రాన్ని దుర్వాస మహాముని మీదే ప్రయోగించాడు.

అయితే ఈ సంఘటనకు విస్తుపోయిన దుర్వాసుడు, నాగవర్ధనుడి ప్రవర్తనకు ఆగ్రహిస్తూ..."మూర్ఖుడా... జ్ఞానాన్నిచ్చే గురువునే మోసం చేయాలని చూస్తావా? నీకు మంత్రాన్ని చెప్పాను గాని, ఆ మంత్రం ఫలించడానికి పఠించాల్సిన మూలమంత్రాన్ని చెప్పలేదు. నీ కుటిల బుద్ధి ఇప్పుడర్థమైంది. నీ పాపానికి పరిహారంగా శిలవై పో!" అంటూ శపించి, అక్కడినుంచి వెళ్ళిపోయాడు దుర్వాసుడు.



# మూర్ఖులు

రామాపురంలో నలుడు, బలుడనే ఇద్దరు స్నేహితులుండేవారు. వారిద్దరూ పొరుగింటి వాళ్ళే. అయినా ఒకరిని చూసి ఒకరు విపరీతంగా ఈర్ష్య పడుతుండేవారు. ఎప్పుడూ ఒకరికి తెలియకుండా మరొకరు తెలియకుండా ఎత్తులు వేసుకుని ఒకరినొకరు ఆనందించేవారు.

ఇలా వుండగా ఆగ్రామానికి ఓ ముని వచ్చాడు. నలుడు ఆ ముని వద్దకు వెళ్ళి డబ్బు సంపాదించే మార్గాన్ని ఉపదేశించమని అడిగాడు. దానికా ముని, అరణ్యాని కెళ్ళి బ్రహ్మదేవుడికి తపస్సు చేస్తే కోరిక నెరవేరుతుందని చెప్పాడు.

విషయం విన్న నలుడు ఆనాడే అరణ్యానికి వెళ్ళిపోయాడు. నలుడ్ని గమనిస్తున్న బలుడు యోగి చెప్పిన విషయాన్ని తెలుసుకుని నలుడికంటే రెండింతల ఫలితాన్ని పొందాలన్న ఉద్దేశ్యంతో అరణ్యానికి వెళ్ళాడు.

అయితే బలుడి విషయం అర్థమైన నలుడు, బలుడ్ని ఎలాగైనా నష్టపరచాలన్న ఉద్దేశ్యంతో ఓ ఉపాయం ఆలోచించి బ్రహ్మదేవుడికి తపస్సు చేశాడు.

తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు సంతోషించి నలుడితో "భక్తా... ఏం వరం కావాలనడిగాడు"

దానికి నలుడు "స్వామీ...నా కన్నులో ఒక కన్ను పోయేట్టు అనుగ్రహించండి' అన్నాడు.

నలుడి ఈ కోరికకు బ్రహ్మదేవుడు విస్తుపోతూ 'తథాస్తూ... అంటూ అదృశ్యమయ్యాడు.'

కొన్నాళ్ళకు బలుడికి కూడా బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై 'ఏం వరం కావాలో కోరుకో మన్నాడు.'

"నలుడికి ఏమిచ్చారో_ దానికి రెండింతలు వరం ప్రసాదించండి ప్రభూ" అంటూ ప్రాధేయపడ్డాడు బలుడు. బలుడి మాటలకు బ్రహ్మదేవుడు చిరుమందహాసం చేస్తూ తథాస్తూ_" అంటూ అదృశ్యమయ్యాడు.

# లోభి

రంగయ్య మహాపిసినారి. ఎంగిలిచేత్తో కాకిని కూడా తోలేవాడు కాదు. తన పిసినారి తనంతో భార్యా పిల్లలకి కూడా సరైన భోజనం పెట్టేవాడుకాదు. ఎంతసేపూ డబ్బు ఎలా కూడబెట్టాలా? అనే విషయం గురించి ఆలోచించేవాడు.

రంగయ్య పరిస్థితికి భార్య సీత విస్తుపోయేది.

ఒకసారి ఆ వూరిలో దొంగతనాలు ఉన్నట్టుండి పెరిగి పోయాయి. రోజూ ఏదో ఒక ఇల్లును దొంగలు దోచుకునేవారు. ఇది విన్న రంగయ్యకు కంటిమీద కునుకు

పట్టేదికాదు. తను కష్టపడి సంపాదించిన డబ్బు దొంగలు పాలు చేయడం రంగయ్యకు సుతారమూ ఇష్టంలేదు. అందువల్ల ఆ రాత్రికి రాత్రే తన డబ్బునంతటినీ మూట కట్టుకుని భార్యా పిల్లలతో, వేరే తన బంధువుల గ్రామానికి బయలుదేరాడు.

మార్గమధ్యంలో ఓ వూరు వచ్చింది. ఏరు పొంగి ప్రవహిస్తుండం వల్ల రంగయ్యకు ఏం చేయాలో తోచలేదు. అయితే ఏరుదాటి వెళ్ళకపోతే ఉన్న డబ్బు కాస్తా దొంగల పాలవుతుందన్న ఆలోచనలతో అతడు భార్యా పిల్లలతో ఏరులోకి దిగాడు. అయితే ఏటి నీటి ప్రవాహం బాగా ఎక్కువగా ఉండటం వల్ల భార్యా, పిల్లలు ఒక్కసారిగా ఏటిలో కొట్టుకుపోయారు.

ఒక చేత్తో డబ్బు సంచి పట్టుకున్న రంగయ్య, భార్యా పిల్లలు మట్టుకు పోయారని బాధపడకుండా, తను సంపాదించిన డబ్బు భద్రంగా ఉందని సంతోషించాడు.


ఏటి మధ్యలోకి వచ్చేసరికి ప్రవాహ వేగం మరింత ఎక్కువై పోయింది. ఆ వేగానికి తన చేతిలో వున్న డబ్బు మూటను వదిలేశాడు రంగయ్య.

అంతే లిప్తపాటులో ఈ విషయాన్ని గ్రహించి, డబ్బు సంచి కొట్టుకుపోతుండడంతో, దానిని దక్కించుకోవడం కోసం ఏటిలోకి వెళ్ళాడు రంగయ్య.

అయితే డబ్బు మూట దొరకకపోగా, ఏటిలో పడి కొట్టుకుపోయి మరణించాడు రంగయ్య.

# జోలి మాలిన పనికి పోరాదు

ఓ చాకలివాడు ఓ కుక్కని, ఓ గాడిదని పెంచేవాడు. తను బట్టలు వుతకడానికి గాడిద వీపు మీదపెట్టి చెరవు గట్టుకు పోయేవాడు. రాత్రివేళల్లో కుక్క యజమాని ఇంట్లోకి ఎవ్వరూరాకుండా కాపలా కాసేది.



ఇలా జరుగుతుండగా ఒకనాటి రాత్రి ఒక దొంగ చాకలివాడు ఇంట్లోకి వెళ్లి విలువైన వస్తువులన్నీ మూటగట్టాడు. ఇదంతా చూస్తున్న గాడిదకు మనసు మనసులో లేకుండా పోయింది. ఆ సమయంలో తన స్నేహితుడు కుక్క గుర్రుపెట్టి నిద్రపోతుంది. అందువల్ల తనుకూడా చూస్తూ ఊరుకుంటే యజమాని ఇల్లంతా దొంగ దోచుకుంటాడని గ్రహించి గాడిద గట్టిగా ఓండ్ర పెట్టడం మొదలు పెట్టింది.

ఈ అలికిడికి దొంగ కాస్తా, జారుకున్నాడు.

అలా నిశిరాత్రివేళ గాడిద ఓండ్ర పెట్టడంతో ఆగ్రహించిన చాకలివాడు వెంటనే ఓ దుడ్డుకర్రను తీసుకుని తన నిద్ర పాడు చేసినందుకు గాడిదను విపరీతంగా కొట్టాడు. ఆ దెబ్బలకు గాడిద. గట్టిగా అరుస్తూ చనిపోయింది. తోలిమాలిన పనికి పోరాదనడానికి ఈ కథే ఉదాహరణ. ఎవరు చేయాల్సినపని వారే చేయాలన్న ఈ కథ సారాంశం.

# కోపం తెచ్చే అనర్థం

రంగమ్మ పరమ కోపిష్టి. ఆవిడ కోపానికి ఆగలేక ఎవ్వరూ కూడా ఇంట్లో పనిచేయలేక పోయేవారు. నెలకు నలుగురు వంట మనుషులు మారేవారు.

కొంత కాలానికి రంగమ్మ ఇంటికి మారయ్య అనే వంటవాడు చేరాడు. మారయ్య తెలివైనవాడు. వంటలకన్నా వాడి మాటలు గమ్మత్తుగా ఉండేవి. ఒకనాడు వాడు కాఫీ కోపాలో పోసి టేబుల్ మీదపెట్టి వెళ్లిపోయాడు. రంగమ్మ కాఫీ తాగేముందు దాని మీద మూత తీసివేసి. చాలాసేపు పేపరు చదువుతూ కొద్దికొద్దిగా కాఫీ పుచ్చుకుంటోంది.

ఇంతలో ఒక ఈగ వచ్చి కాఫీలో పడి చచ్చింది.

ఆ కాఫీ పారబోయించి వేరే కాఫీ తెప్పించుకోవలసి వచ్చింది రంగమ్మకు. అయితే తన అజాగ్రత్తవల్ల కాఫీలో ఈగ పడిందని అనిపించుకోవడం రంగమ్మకు సుతారమూ ఇష్టంలేదు. అందువల్ల ఆ నేరం వంటవాడి మీద వెయ్యాలని నిశ్చయించుకుందామె.

వెంటనే మారయ్యని పిలిచి 'ఏమోయ్! ఇంత అజాగ్రత్త అయితే ఎలా? కాఫీ కోపాలో ఈగపడింది' అంది కోపంగా.

దానికి వెంటనే మారయ్య తడుముకోకుండా "అమ్మా! కాఫీలో ఈగ పడకపోతే ఏనుగు పడుతుందా?" అన్నాడు.

"ఏనుగు పడదని నాకు తెలుసుకాని ఈగపడేలాగు పాలమీద మూత లేకుండా ఫుంచి, ఇంకా పెంకిమాటలు మాట్లాడతావేం" అని చాలా కోపంగా అడిగింది రంగమ్మ.

"అమ్మా! ఇందులో నా తప్పేమీ లేదు. మీ సాలు మంచివికావు. అందువల్ల ఇంత అవస్థ వచ్చి పడింది' అని చమత్కరించాడు.

దానికి రంగమ్మ నొచ్చుకుంటూ "పని బాగా చేయమంటే కథలు చెబుతా వేమిటి? మర్యాదగా తప్పు ఒప్పుకో..." అంది.

ఆ మాటలకు మారయ్య "అమ్మా నీ దగ్గర పనిచేయడం నావల్ల కాదు.. అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు."

రంగమ్మకు నోటమాట రాలేదు. తానొకటి తలిస్తే ఒకటి జరిగింది. ఉన్నట్టుండి పనివాడే మానేసేసరికి ఇబ్బంది పడిందామె.

అయితే ఆ తర్వాత రంగమ్మ గురించి తెలిసిన వారెవ్వరూ ఆమె దగ్గర పనిచేయడానికి రాలేదు.

ఒకనాడు రంగమ్మకు జబ్బు చేసింది. మాట సహాయానికిగాని, వంట చేయడానికి గాని ఎవ్వరూ లేకపోవడంతో, అలాగే నీరసంతో వెళ్ళి పొయ్యిమీద కాఫీ పెట్టుకోబోయి పొయ్యిమీదపడి కాలిపోయి మరణించింది.

తన కోపమే తన శత్రువనడానికి ఇదొక ఉదాహరణ.

# సోమరి

రామాపురంలో వీరయ్య అనేవాడుండేవాడు. వీరయ్య వట్టి సోమరిపోతు. ఏ పనీ చేసేవాడు కాదు. తండ్రి సంపాదించి పెట్టిన ఆస్తిని ఖర్చుచేసి, హాయిగా నిద్రపోయేవాడు.

ఆ యేడు రామాపురంలో వరదొచ్చింది. వరద రావడంతోనే వీరయ్య పనివాడు అక్కడికి వచ్చి "బాబూ.. ఊరిలోకి వరదొచ్చింది. మీరు వెంటనే లేచి మన ధాన్యం బస్తాలు తరలించండి" అని చెప్పాడు. దానికి వీరయ్య "వరదొచ్చి ఏం చేస్తుందిలే.. వచ్చిపోతుందిలే అంటూ పనివాడిని పంపించివేశాడు.

అనంతరం ఊరిలోకి వరదొచ్చి, ధాన్యం బస్తాలన్నీ నీటిలో కొట్టుకు పోయాయి.

సోమరిపోతు అయిన వీరయ్య దీనికి పట్టించుకోలేదు.

ఈ సంఘటన జరిగిన నెలరోజులకి, వీరయ్య పనివాడు మరలా వచ్చి "బాబూ.. మన ఇల్లు కాలిపోతుంది... వెంటనే వచ్చి మంటలు ఆర్పండి' అని చెప్పాడు.

"దానికి వీరయ్య అగ్ని అన్న తర్వాత మండక ఏం చేస్తుంది" నీవేమీ భయపడకు. అదే ఆరిపోతుంది" అని చెప్పాడు నిద్రపోతూనే.

అంతే, అగ్ని ప్రమాదంలో వీరయ్య వస్తువులన్నీ తగులబడిపోయాయి. కొంతకాలానికి వీరయ్య వద్ద వున్న సొమ్ము కాస్తా అయిపోయింది. సొమ్ము అయిపోవడంతో తినడానికి డబ్బులేక వీరయ్య మలమల మాడిపోయాడు. వీరయ్య సోమరిపోతు కావడం వల్ల ఎక్కడా అప్పుకూడా పుట్టలేదు

తన సోమరితనమే తన ఈ స్థితికి తీసుకొచ్చిందని గ్రహించాడు వీరయ్య. ఆ నాటినుంచి అతడు కష్టపడి పని చేయడం మొదలు పెట్టాడు.

# మహా బలుడు

విదర్భ దేశంపై అక్రమంగా దండెత్తిన కళింగరాజు శూరసేనుడు చిత్తుగా ఓడి వెనుదిరిగి పారిపోయాడు. తమ విజయానికి కారకులైన సైనిక ముఖ్యులనూ, అధికారులనూ విదర్భ దేశ మహారాజు అనేక విధాల సత్కరించాడు.

మహాబలుడనే సైనికుడు యుద్ధరంగంలో వీర విహారం చేసి, వెయ్యి మందికి పైగా శత్రుసైనికుల కాళ్ళు, చేతులూ నరికాడని ఒక వార్త పుట్టింది. ఇది విన్న వాడి గ్రామస్థులు, మహాబలుడ్ని పూలమాలలతో ముంచెత్తి గ్రామంలో ఊరేగించారు. ఆ సమయంలో మహాబలుడు ఆనందంతో మైమరచి వుండగా జనంలోంచి ఒకడు "మహాబలా! నువ్వు ఆ శత్రు సైనికుల తలలు నరక్కుండా, కాళ్ళూ, చేతులూ మాత్రమే నరికి వూరుకున్నావు? అని అడిగాడు.

దానికి మహాబలుడు మీసం మెలివేస్తూ ఒకటి రెండు క్షణాలు ఆలోచిస్తూ వూరుకుని, చప్పున ఏదో గ్రహించిన వాడిలా "అవును అలాంటి అవకాశం నాకు రాలేదు. వాళ్ళందరి తలలూ ముందే తెగనరికి వున్నాయి" అన్నాడు.

# అబద్ధం

పూర్వకాలంలో రాజమహేంద్రిలో ఒక నిరుపేద బ్రాహ్మణుడుండేవాడు. నాలుగు వేదాలు క్షుణ్ణంగా చదువుకున్న పండితుడు. అందువల్ల రాజమహేంద్రిలోను ఆ చుట్టు పక్కల గ్రామాలలోను ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులుండేవి. ఎక్కడ యే శుభకార్యం జరిగినా, యజ్ఞాలు, యాగాలు, విద్వత్ సభలు ఏవి జరిగినా ఈ బ్రాహ్మణుడికి కూడా పిలుపు వస్తుండేది. అంతేగాని ఆ విప్రుని ఆదాయం మాత్రము ఏ రోజునా దినసరి బత్తానికి లోటు లేకుండా బ్రతుకు సాగిపోతుంది. అదే చాలు అని తృప్తిపడేవారు.

ఆ దంపతులకు ఒక్కొగానొక్క కొడుకు. అతడ్ని అల్లారుముద్దుగా పెంచుకుంటు న్నారు. తాను ఎక్కడకు వెళ్ళినా ఆ పిల్లవాడ్ని వెంటతీసుకుని వెడుతుండేవాడు. పాఠాలు వల్లెవేయడమే కాకుండా, సభలు శుభకార్యాలు, వివిధ తరహాల జనులు వారి వారి సంస్కారాలు అర్థం చేసుకుని తన కొడుకు లౌకిక జ్ఞానం పొందాలన్నది ఆ తండ్రి ఆశ. ఒక్కడు కావడం వల్ల విడిచి ఉండలేని మమకారం వల్లకూడా ఆ తండ్రి ఆ కొడుకును తన వెంట తిప్పుతుండేవాడు తండ్రి ఎంత అదుపాజ్ఞలలో పెంచుతున్నా మమతలవల్ల, గారాబంవల్ల, ఆ పిల్లవాడు ఆకతాయిగా

తయారయ్యాడు. ఇంటనున్నప్పుడు తండ్రి పిలుపుకైనా దొరికేవాడు కాదు. అల్లరి పిల్లలతో గూడి ఆటలాడుతూ గ్రామమంతా పోకిరిగా తిరుగుతుండేవాడు. అందువల్ల కూడా ఆ తండ్రి కొడుకును తనవెంట ఉంచుకొనేవాడు.



రాజమహేంద్రికి రెండు క్రోసుల దూరంలో ఉన్న వీరవల్లిలోని ప్రముఖ క్రాప్తివ్రతం చేసుకుంటూ ఆ విప్రుడికి కూడా కబురు పెట్టేడు. విప్రుడు తన కుమారుడ్ని తీసుకొని వీరవల్లి కాలి నడకన బయలుదేరాడు. సమయానికి ఆ గ్రామం చేరుకుని క్రాప్తి ఇచ్చిన సంభావన, స్వయంపాకం అందుకుని తన గ్రామానికి తిరుగుముఖం పట్టేడు.

సాయం సమయం కావడం వల్ల, అరణ్య మార్గమైనందువల్ల, తొందరగా ఇల్లు చేరుకోవాలని విప్రుడు వేగంగా నడువసాగేడు. పిల్లవాడు తండ్రితో సమంగా నడవ లేక వెనకబడిపోవడం వల్ల తండ్రి హెచ్చరిస్తూ, పిలుస్తూ, ఆగుతూ నడుస్తున్నాడు. అంతలో ఆ కుర్రవాడికొక ఆలోచన కలిగింది. తండ్రి తనకోసమని ఆగుతున్నాడేకాని వెనుకకు రాడం లేదు. వెనక్కు వస్తాడో రాడో చూడాలని ఆకతాయితనంగా ఆలోచించాడు.

"నాన్నా పులి!" అంటూ గావుకేక పెట్టేడు! ముందు నడచి వెడుతున్న తండ్రి గుండెలు గుభేలు మన్నాయి. పరుగు పరుగున వెనుకకు కొడుకు దగ్గరకు వచ్చేడు. రొప్పుతున్న తండ్రిని చూచి విజయగర్వంతో నవ్వేడు. కొడుకును చెంత చేర్చుకుని అలా అనకూడదు. అబద్ధమాడితే అనర్థం కలుగుతుంది అని చెప్పి వెంటబెట్టుకుని ముందుకు బయలుదేరాడు.

మరి కొంతదూరం పోయేసరికి కొడుకు మళ్ళీ వెనకబడ్డాడు. మళ్ళీ తండ్రిని ఆటపట్టించాలని "నాన్నా పులి" అంటూ కేక పెట్టాడు. ఈ సారి కూడా ఏమీ లేకపోవడం చూచి తండ్రికి కొడుకు ఆకతాయి తనానికి విసవిసలాడుతూ, "బాబూ! ఇలాగున పెద్దవాళ్ళతో వేళాకోళం ఆడడం అబద్ధాలు ఆడడం మంచిదికాదు. నీ వెకిలితనం కట్టిపెట్టి తొందరగా నడు. చీకటి పడకముందే అడవిని దాటెయ్యాలి నడు" అంటూ ముందుకు బయలుదేరాడు.

ఇద్దరూ వేగంగానే నడుస్తున్నారు. దురదృష్టవశాత్తూ పొదల చాటునుంచి ఒక పులి రావడం జరిగింది. కుర్రవాడు భయపడి "నాన్నా! పులి" అంటూ బిగ్గరగా అరిచేడు. తండ్రి కుర్రవాడికి వెటకారం తగ్గలేదనుకుని చాలుగాని తొందరగా రా"! అంటూ ముందకు సాగిపోయాడు.

ఆ పులి వచ్చి పిల్లవాడిమీద పడింది "నాన్నా పులి నిజంగానే వచ్చింది నన్ను చంపేస్తోంది రక్షించు నాన్నా పులి" అంటూ అరిచాడు. తండ్రి "పులిలేదు గిలిలేదు. అల్లరి మాని తొందరగా రా!" అన్నాడు. ఆ పులివాత పడ్డ బాలుడు "అయ్యో రెండుసార్లు పులి పులి అని అబద్ధమాడడం వల్ల నిజంగా పులి వచ్చి కేకపెడితే అదికూడా అబద్ధమే అనుకున్నాడు నా తండ్రి. నా అబద్ధం నా ప్రాణాలనే తీసింది" అని వాపోతూ మరణించాడు.

# మొదటికే మోసం

నలుగురు వర్తకులు కలసి సమిష్టిగా దూది వ్యాపారాన్ని ప్రారంభించేరు. దూది బేళ్లను ఒక గదిలోవేసి తాళం వేసేవారు వాళ్ళు. కాని, ఆ గదిలోని ఎలుకలు వాటిని పాడుచేస్తూండేవి. అందుచేత వాటిని అంతం చెయ్యాలని ఒక పిల్లిని పెంచడం మొదలు పెట్టేరు వాళ్ళు.

ఆ పిల్లి ధర్మమా అంటూ ఎలుకల బాధ తగ్గిపోయింది. దానితో ఆ వర్తకులకు లాభం రావడం మొదలు పెట్టింది. ఆ లాభానికి కారణం పిల్లేనని గ్రహించుకుని ఆ పిల్లి నాదంటే నాదని తగవులాడటం మొదలు పెట్టేరు ఆ నలుగురు వ్యక్తులు.

అలాగ కొంతకాలం తగవులాడిన పిమ్మట వారు ఒక నిర్ణయానికి వచ్చేరు. ఆ పిల్లికి నాలుగు కాళ్ళూ తమ విభేదాన్ని తొలగించడానికే ఇచ్చేడు భగవంతుడనుకొని, ఒక్కొక్క కాలిని ఎంచుకొని పంచుకున్నారు. ఎవరి కాలికి వారు వారికి తోచిన అలంకారం, సంరక్షణ చెయ్యడం మొదలు పెట్టారు. కాళ్ళ అలంకారంతో పిల్లి దిట్టంగా పెరగటం మొదలు పెట్టింది.



ఒక వర్తకుడు తన వంతుకు వచ్చిన పిల్లి కాలికి బంగారపు మువ్వలను కట్టాడు. కొత్త బరువువల్ల పిల్లికాలు బెణికి పుండయింది. అందుచేత అతడు ఆ మువ్వలను తీసివేసి ఆ కాలికి నూనె గుడ్డతో కట్టుకట్టాడు.



పూర్వంలాగే దాన్ని గదిలో వదిలిపెట్టి, చీకటి పడగానే ఆ గదిలో దీపం పెట్టి తాళం వేసుకుని వెళ్ళిపోయేరు వర్తకులు.

ఆ రాత్రి ఒక ఎలుక ఆ గదిలోకి వచ్చింది. వెంటనే దాన్ని పట్టుకోవడానికి ఆ పిల్లి పరుగెత్తబోయింది. కాని కాలు కుంటి అవడంచేత లక్ష్యం తప్పి, దీపం మీద అది పడింది. దాంతో ఆ కాలికున్న నూనె గుడ్డకు దీపం అంటుకుంది. పిల్లికి గాభరా ఎత్తింది. దాంతో అది గది యంతట చిందులు త్రొక్కడం మొదలు పెట్టింది. ఆ చిందులతో కాలికున్న నిప్పు దూదిబేళ్ళకు అంటుకొని అవన్నీ తగులబడి పోయాయి.

రెండవనాడు ఆ వర్తకులంతా ఆ ఘోరాన్ని చూసేరు. దానికి కారణం వారిలో ఒకరు పిల్లికాలికి నూనెగుడ్డ కట్టి కుంటించడమేనని నిర్ధారణ చేసుకుని, మిగిలిన

ముగ్గురూ ఆ నాల్గవవాడిని తమకు వచ్చిన నష్టానికి పరిహారం యివ్వమని కోరేరు. ఇది వాడికి చాలా కష్టమనిపించింది. తన బాపతు సరుకుపోయినందుకే ఏడవాలో, లేక మిగిలిన ముగ్గురకూ వచ్చిన నష్టాన్ని ఇచ్చుకోవడానికి ఏడవాలో తెలిసిందికాదు. వారికి ఏమైనా గాని వాడు అంత మొత్తాన్ని ఇచ్చుకోలేక కొంత యిస్తానని బ్రతిమాలేడు. కాని వాళ్ళు తమ మొత్తాన్ని అణాపైసలతో ఇచ్చుకోవలసిందేనని ఒత్తిడి పెట్టారు.

వాడు ఇవ్వలేడనడంతో వాళ్ళు పంచాయితీ పెద్దలకు ఫిర్యాదు చేసేరు. పెద్దలు రెండు పక్షాలవారి వాదనలూ శ్రద్ధగా విని అసలు విషయం జాగ్రత్తగా గ్రహించేరు. తరువాత వారీ క్రింది విధంగా తీర్పునిచ్చేరు.

నాలుగవ వర్తకుడికి చెందిన పిల్లి కాలికి దెబ్బ తగలడం చేత అది కుంటిది అయిపోయింది. అందువల్ల మిగిలిన మూడుకాళ్ళే పరుగుత్తే స్థితిలో వున్నవి. ఆ కాళ్ళ పరుగువల్లనే నాల్గవ కాలికి కట్టివున్న నూనె గుడ్డకు నిప్పు అంటుకుంది. తరువాత ఆ కాళ్ళే నాల్గవకాలికి అంటుకొన్న నిప్పును దూది బేళ్ళకు అంటించేయి. అదే దూది గిడ్డంగి తగలబడడానికి కారణం. మిగిలిన ముగ్గురు వర్తకులూ నాలుగవ వర్తకునికి చెందిన వాటాకు పిల్లి వలన సంభవించిన నష్టానికి పరిహారం ఇచ్చుకోవలసిందే అని తీర్పునిచ్చారు.

అది విని ముగ్గురూ "అయ్యో! వాడిస్తానన్న కొద్ది మొత్తానికే అంగీకరిస్తే ఈ చిక్కే వుండేది కాదు గదా! ఇంతకు తగవులాడి తీర్పుకు వెళితే మొదటికే మోసం వచ్చింది" అని మధనపడి, నాల్గవవాడికి నష్ట పరిహారం ఇచ్చుకున్నారు.

# పనికిమాలినవాళ్ళు

ఒక వూళ్లో ఒక బ్రాహ్మణుడు, ఒక కోమటి వున్నారు. వాళ్లిద్దరి యిళ్ళూ ఒకే చోట వున్నాయి. బ్రాహ్మణుడు చాలా బీదవాడు. కోమటి చాలా ధనవంతుడు. బీదవాడైన బ్రాహ్మణునకు భూతదయా, ధర్మచింతన వుండేవికాని, ధనవంతుడైన కోమటికి హృదయం లేదు. ధర్మచింతన మచ్చుకైనా లేదు. అతనికున్నదంతా ధనకాంక్ష పరధనాపహరణాలోచన.

అంతటి ధనవంతుడు బీదసాదలను ఆదరించకుండా నిర్దయాపరుడై వుండటం ఇష్టం లేదు. భగవంతుడికి, అతనికేదయినా మంచిబుద్ధి కలిగించాలని ఎంచేరు ఆయన.

ఒకనాటి రాత్రి ఒక వృద్ధ శూద్రుని రూపంలో భగవంతుడు కోమటి మేడదగ్గరకు వెళ్ళి తనకారాత్రి భోజనంపెట్టి పోయే ప్రాణం కాపాడవలసిందని శెట్టిని ప్రార్థించేడు. కాని శెట్టి హృదయం పాషాణం అందుచేత ఇదేమీ పూటకూళ్ళ యిల్లుకాదు. పొమ్మని

గద్దించేడు. అతను పోనీ ఈ రాత్రి అక్కడ నిద్రపోవడానికైనా అనుమతించని కోరేరు. ఆయన, అందుకు కూడా శెట్టి ఒప్పకొనకుండా, ఇదేమి సత్రంకాదు. పొమ్మని యింటినుండి తరిమివేసాడాయనను.


అంతట ఆ వృద్ధుడు ఆ ప్రక్కనే వున్న బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి తనకేమైనా తినడానికి పెట్టమని కోరేడు. అతను తనకున్న కొద్దిలోనే ఆ వృద్ధుని తృప్తిపరచి, ఆ నాటి రాత్రి అక్కడ విశ్రమించమని కోరేడు. ఆ వృద్ధుడు అట్లే విశ్రాంతి తీసుకొని తెల్లవారిన వెంటనే లేచి వెళ్ళిపోయేడు. ఆయన ఇల్లు వదిలిపెట్టి వెలుపలికి వెళ్లనంతనే బ్రాహ్మణుని గృహం స్వర్ణమయం అయింది.

అదంతా కనిపెట్టిన శెట్టి, తక్షణం కదలిపోతున్న వృద్ధుణ్ణి దేవుడని గ్రహించి, పరుగు పరుగునపోయి అతని కాళ్ళమీదపడి తన తప్పిదాన్ని క్షమించవలసినదిగా వేడేడు.

భగవంతుడు అతని కుయుక్తిని గ్రహించి సరే క్షమించేను. నీకేం కావాలో కోరుకో అన్నాడు. కాని అత్యాశాపరుడయిన శెట్టికి ఏం కోరాలో తెలిసింది కాదు. అప్పటికి అతనికేమీ లోపం లేదు. అందుచేత తొందరపడి ఏదైనా కోరడం కన్నా సావకాశంగా ఆలోచించుకుని కోరడం మంచిదనుకున్నాడతను. ఆ సంగతి భగవంతునకు తెలియజేశాడు.

అందుకు భగవంతుడు కూడా ఇష్టపడి, శెట్టి అనుకున్న మొదటి మూడు మాటలు సంభవించడానికి వరం ఇచ్చి అంతర్ధానం అయిపోయేడు.

తరువాత శెట్టి చాలా దీర్ఘాలోచనతో ఇంటికి బయలుదేరిపోతున్నారు. అప్పుడే తెల్ల వారడం చేత కాకులు కావు కావు మంటూ ఆకాశంలో ఎగురుతున్నాయి.



వాటి కూతలు వల్ల అతనికి ఆలోచన తట్టలేదు. అంతలో ఒక కాకి అతని నెత్తిమీద ఎగురుతూ రెట్ట వేసింది.

దానితో అతనికి అరికాలి మంట నెత్తికెక్కింది. పాడు కాకి ఛస్తే బాగుండును అని అన్నారు.

ఆ మాటతో అది గిర గిర తిరిగి క్రిందపడి చచ్చింది. అప్పుడు అతనికి పశ్చాత్తాపం కలిగింది. అది కాకి చావడం వలన కలుగలేదు. తమ సంపాదించిన మూడు మాటలలోను ఒకటి నిష్ఫలమైపోయినందుకు కలిగింది.

చేసేది లేక నెమ్మదిగా వెళ్ళి తోటలో రాతిమీద కూర్చొని ఆలోచించసాగాడు అతను. అంతలో అతని భార్య అతన్ని లోపలకు రావలసిందని కూలి వాడితో కబురు పంపింది.

కూలివాడు అతన్ని లోపలికి రమ్మన్నాడు. కాని తన ఆలోచన తెగేవరకు కదలడానికి ఇష్టంలేక అతను "నేను రాను" అన్నాడు. అంతే అతనా రాతికి తాపడం అయిపోయేడు "అయ్యో! ఎంత చిక్కువచ్చింది" యని బాధపడ్డాడు అతను. కాని, ఆ బాధ తను రాతికి అతుక్కుపోయినందుకు కాకుండా, రెండవ మాటను పోగొట్టుకున్నందుకు పొందేడు.

కొంతసేపటికి అతని భార్య అక్కడకు వచ్చి భర్తను రమ్మని పిలిచింది. అతను మాట్లాడలేదు. పైన చూస్తే కపాలం పేలి పోయేలాగు. గ్రీష్మ భానుని తీవ్రత క్రింద చూస్తే చుర్రునకాలే నేల అలాంటి సమయంలో అతనక్కడ అలాగ కూర్చోవడం ఆమెకు నచ్చలేదు.

అతనికి తనమీద కోపం వచ్చిందేమోనని బ్రతిమాలి పైకి లేవదీయబోయింది ఆవిడ. కాని లాభంలేకపోయింది. అతను రాతికి తాపడం అయిపోయేడు. అది చూచి ఆవిడ గాభరాపడి ఇదేం ఖర్మంరా దేవుడా అని ఏడవడం మొదలుపెట్టింది. పలుకరిస్తే పలుకకుండా వుండిపోయిన భర్తను చూసి ఆవిడ గొల్లుమంది.

కొంతసేపటికి భార్య దుఃఖం చూడలేక జరిగిన చరిత్రనంతటినీ చెప్పేడు. అదివిని 'అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పుడయినా ఆ మూడో వరాన్ని మీరు రాతినుండి విడివడటానికి వుపయోగించుకోండి. అని కోరింది ఆమె. అతడు వినలేదు. ఇంకా మంచి వరంకోసం ఆలోచిస్తూనే వున్నాడు. ఇంకా కొంతసేపటికి మిట్టమధ్యాహ్నం అయింది. సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చేడు. దానితో అతని బట్టతల సుర్రుమంది. ఇంక వేరే శరణ్యం లేక భార్య చెప్పినట్లుగా ఆ మూడవ వరాన్ని తను రాతినుండి విముక్తి చెందటానికి వుపయోగించుకున్నాడు.

కాకిని చంపడం రాతికి అతుక్కుపోవడం, ఎండలో మలమల మాడిపోవడం తప్ప దేముడిచ్చిన మూడువరాలవల్లా ఆ అత్యాశపరుడు పొందిన లాభంలేకపోయింది

ఇంతకూ భగవద్దర్శమైనా అతనికి దురాశ పోలేదు గదా అనుకుంది అతని భార్య.

# కష్టార్జితం కానిది...

ఒక పాల వ్యాపారస్తుడు ఆరోగ్య శాఖ వారి అజాగ్రత్త వల్ల పాలలో నీటిని అధికంగా కలిపి డబ్బు బాగా సంపాదించేడు.

అక్కడితో అతనికి ఆశ తీరలేదు. యింకా గేదెలను కొని వాటి పాల మీద ఇంకా అధిక లాభాలు తియ్యాలని వూహించి, పన్నెండు వందల రూపాయలు సంచిలో వేసుకొని, పశువుల సంతకు బయలుదేరెను.

ఆనాడు ఎండ చాలా తీవ్రంగా వుండటం వల్ల అతను చాలా అలసిపోయి ఒక చెరువు గట్టున వున్న చెట్టు క్రింద నిద్రపోయెను. నిద్రపోయేముందు రూపాయల సంచిని తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు.

అంతలో ఎక్కడనుంచో ఒక కొండముచ్చు అక్కడకు వచ్చి అతని తలక్రింద వున్న సంచిలో ఏదో తిను బండారము వుందనుకుని, దాన్ని లాక్కుని ఒక్క దూకున చెట్టు మీదకెక్కి చిటారు కొమ్మమీద కూర్చున్నది.

దానితో ఆయనకి నిద్రాభంగం కలిగి, సంచిని కొండముచ్చు పట్టుకొనడం చూచి లబోదిబోమని గోలపెట్టసాగాడు. కానీ, ఆ లోపులో అది సంచిని విప్పి, లోపలనున్న రూపాయలను ఒక్కొక్క దానినీ గట్టుమీద పడవేయడం మొదలు పెట్టింది.

పాలవాడికి, పాలలో నీరు జోరుగా కలపడం తప్ప చెట్టెక్కడం నీటిలో ఈదడం రాదు. కనుక పెయ్యమ్మలాగ నోరు తెరుచుకుని దాన్ని చూస్తూ నిలబడిపోయాడు.

కొంతసేపటికి కొండముచ్చు తన పని పూర్తి చేసుకుని ఇంకొక చెట్టుమీదకి ఎగిరి పోయింది.

పాలవాడు గట్టుమీదనున్న రూపాయలను ప్రోగుచేసుకుని లెక్క పెట్టుకొనగా అవి నాలుగు వందలు మాత్రమే వున్నాయి.

అప్పుడు, ఒక శేరు చిక్కని పాలలో రెండు శేర్లు నీళ్ళు కలిపి అమ్మిన కారణంగా కూడగట్టిన పన్నెండు వందల రూపాయల్లో ఎనిమిది వందలు నీటి పాలైపోయినా, పాల సొమ్ము మాత్రమే తనకు దక్కినదని నీటి డబ్బు నీటికే దక్కినదని అనుకుని వుసూరుమంటూ తిరుగుముఖం పట్టాడు.

# ఆశపోతు నక్క కథ

ఒక అరణ్యము నందు వేటగాడు వేటాడుచూ ఒక జింకను చంపెను. దానిని వాడు భుజమున వేసుకుని పోవుచుండగా చూడక అటువైపుకు వచ్చిన పామును తొక్కెను. వేటగాని కాలికింద పడిన పాము చనిపోతూ ఆఖరిక్షణమున అతడిని

కాటువేసినది. దానితో ఆ వేటగాడు తక్షణమే మరణించాడు. ఇలా జింకా, పాము, వేటగాడి శవాలు ఆ అడవినందు పడి ఉన్నాయి.

అప్పడే ఆహారము కొరకు అటువైపుగా వచ్చిన నక్క ఈ మూడింటిని చూసింది. అంతే దాని ఆనందానికి అవధులు లేకుండా పోయింది. "ఈ రోజు లేచి ఎవరి ముఖం చూశానో ఒకేసారి జింకా, పాము, మనిషి దొరికినారు. ఈ ఆహారం నాకు ఎన్నో రోజులకు సరిపోతుంది. ఇక నాకు ఆహారం కోసం ఎటువంటి కష్టము



ఉండదు. అనుకుని కొద్దిసేపు ఆనందంతో ఈలపెట్టుతూ అటు ఇటు గెంతినది. ఇంతలో ఆకలి విషయం గుర్తొచ్చి ఈ పూటకు ఏది తిందామా అని మూడింటి వంకా చూసింది. అయితే ఆ మూడింటిలో దేనిని తినటానికి దానికి మనస్కరించ లేదు. ఈ పూటకు ఏదో ఒకటి దొరికినది తినేస్తాను. ఉదయాన్నే ఈ పాముతో మొదలుపెట్టి, జింకను ఒక పది రోజులు, మనిషిని ఒక నెలరోజులు తింటాను. అనుకుని సమీపంలో ఆహారం కోసం ఏదన్నా చిన్న జంతువు దొరుకుతుందేమోనని చూసింది. వేటగాడికి సమీపంలోనే వాడి విల్లుత్రాడు పడి ఉన్నది. దానిని చూసి నక్క "ఇది జంతువు నరంతో చేసినది కనుక ఈ పూట దీనితో నా ఆకలిని తీర్చుకుంటాను". అని దాని దగ్గరకు చేరి ఆ విల్లుత్రాడును తన పంటితో గట్టిగా కొరికింది. ఆ విల్లుత్రాడు తెగడంతోనే దానికి కట్టిన వుల్ల వేగంగా వచ్చి నక్క గుండెలో గుచ్చుకుంది. అది బాధతో మెలికలు తిరుగుతూ తన ప్రాణాలు వదిలింది.

# తెలివి తక్కువ కోతి

ఒకానొక ఊరియందు ఒక ధనవంతుడు కలడు. వాడు పాపాత్ముడు. ఎన్నో పాపములు చేసిన తరువాత వాడికి పాపభీతి పట్టుకుంది. దానితో వాడు ఒక మునీశ్వరుని కలుసుకుని "మునివర్యా! నేను తెలిసి ఎన్నో పాపాలను చేశాను. ఇప్పుడు నాకు ఈ అంతిమ దశలో వాటి గురించి భయం పట్టుకున్నది. నేను చేసిన దాని మూలముగా నేను, నా పెద్దలు, పూర్వులు, నా రాబోయే తరములవారు నరకములో ఘోర పాపములను అనుభవించెదవేమో! దీనికి తమరే తరుణోపాయమును సెలవియ్య వలెనని" వేడుకున్నాడు.

అతడి ప్రార్థన విన్న మునీశ్వరుడు అతడి పట్ల జాలితో "నాయనా! అన్ని పాపములను ఆ సర్వేశ్వరుడే రూపుమాపుతాడు కనుక. నీవు నీ ఊరిలో ఒక ఆలయాన్ని నిర్మించి అందులో అనునిత్యం పేదలకు అన్నదానం చేయించు దానితో నీ యొక్క పాపములు పరిహారమవుతా"యని తెలిపాడు.



మునీశ్వరుని సలహా నచ్చిన ఆతడు ఆయనకు నమస్కారము చేసి తన ఇంటికి చేరుకుని వెంటనే దేవాలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేయసాగాడు. ఇందు నిమిత్తంగా కొద్దిగా కలప అవసరమైనది. దానితో కొందరు అడవికి పోయి పెద్ద

పెద్ద చెట్లను నరికి ఆ దూలాలు తీసుకువచ్చి మంటప నిర్మాణానికిగాను వాటిని రంపాలతో కోయసాగారు. దానితో ఆ ప్రాంతమంతా  ఎంతో సందడిగా ఉండసాగింది.

ఈ తంతును అక్కడికి దగ్గరలోనే మరో గుడివద్ద ఉంటున్న కోతులమందలోని ఒక కోతి చూచినది. దానికి ఈ సందడంతా ఎంతో ఆనందంగా ఉంది. అప్పుడప్పుడు అది పని జరుగుతున్న చోటుకు వచ్చి పోతూ ఉండేది. మిగిలిన కోతులు మనుషులతో మనకు పనేమిటంటూ దానిని హెచ్చరించాయి. అయినా అది వినలేదు. ఒకనాటి మధ్యాహ్నం వేళ పనివారందరూ ఎక్కడ దూలాలను అక్కడే వదిలి భోజనానికి వెళ్ళారు. వారు లేకపోవడం చూసిన కోతి అక్కడికి వచ్చింది. అక్కడ దానికి దూలాల మధ్యలో ఇనుపమేకులు కనిపించాయి. వాటిని దూలాలు సగం వరకు కోసిన తరువాత అవి మళ్ళీ అతుక్కుపోకుండా ఉండటానికిగాను పెడతారు.

ఈ సంగతి తెలియని కోతి ఇలాంటి ఒక దూలంమధ్యలోకి దూరి ఎంతో ఆత్రంగా ఆ మేకును తీయడానికి ప్రయత్నించింది. ఎంతకి రాకపోవడంతో ఒక రాయిని తెచ్చి దానితో బలవంతంగా కొట్టింది. ఆ రాయి దెబ్బకు ఆ మేకు క్రిందకు జారి పోవడం దూలం దగ్గరగా చేరడం మధ్యలో ఉన్న కోతి ఊపిరాడక గిలగిల తన్నుకుని మరణించడం జరిగింది."

